నవశక్తి

Vol. 2, no. 5

(Jan. 11, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 5

(Jan. 11, 1939)

Bejavāḍa, 1939

జమీన్ రైతు వారం

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 2 } బుధవారం 11-1-39 బెజవాడ {సంచిక 5

టామ్ మూనీ విడుదల



టామ్‌మూనీ మా పాఠకులకు పరిచయుడే।
22 సం॥ 7 మాసాలు శిక్ష ననుభవించి, మొన్ననే విడుదల పొందాడని వార్తలు వచ్చాయి, కాలిఫోర్నియా కార్మికులకు ఆనాడు పండుగ।

మనరాజకీయాలు

జవహర్ పండితుని యదార్ధ వాక్కులు.

"రాష్ట్రి స్వపరిపాలనలో ఎన్నో ఆటంకాలూ, హద్దులూ, ఉండడంవల్ల నిజంగా అభివృద్ధి కరమైన పనులు జరగటంలేదు. దానివల్ల మనం పొందగలిగే మంచి త్వరత్వరగా హరించి పోతోంది"

అంటూ జవహర్ పండితుడు యు. పి. రాజకీయ మహాసభలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈమాటల్లో ఎంతైనా నిజముంది. రాష్ట్రి స్వపరిపాలనద్వారా స్వరాజ్యం లభిస్తుందని కొంతమంది కాంగ్రెసు వాదులు ఆశించారు, కాంగ్రెసు మంత్రి పదవులు స్వీకరించిన కొత్తరోజులలో. కాని $1\frac{1}{2}$ సంవత్సరాలు గడిచాక అట్టి ఆశలు అడుగంటుతూన్నట్లు స్పష్టం అయింది. ఎందువల్లనంటే, పై మహాసభకు హాజరైన ప్రతినిధులందరూ, గోవింద వల్లభ పంతువంటి మంత్రులతోసహా పైతీర్మానాన్ని ఆమోదించారు.

కాంగ్రెసువారు మంత్రి పదవుల్లోకి వచ్చిన మొదటి రోజులలో మనం చూచిన ఉత్సాహం నేడు కనపడ్డంలేదు. కాంగ్రెస్ మంత్రులు రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. వందల కొద్దీ అక్రమ సంఘాలమీద నిషేధాలు తొలగించారు. ప్రజా సామాన్యానికి అవసరమైన అనేక చట్టాలు చేశారు. కాని, క్రమంగా యీ ఉత్సాహం తగ్గుతూ వచ్చింది. ఇండియా అక్టులో గల లోపాలే యిందుకు కారణం. 18 నెలలు కాంగ్రెసు మంత్రులు అధికారంలో ఉన్నప్పటికీ యు. పి. రాష్ట్రిములో ఇంకా రైతాంగపు బిల్లు చట్టము కానే లేదని విలపించాడు జవహర్లాల్. మన రాష్ట్రిములోయీ బిల్లును గురించి చర్చ కూడా ప్రారంభంకాలేదు. ఇంతేకాదు. ప్రభుత్వోద్యోగుల నిరంకుశత్వం పూర్వం మాదిరిగానే ఉంది. రైతు ప్రచారకుల్ని ఎరస్టు చేయడం, కార్మిక నాయకులమీద కేసులు బనాయించడం, పత్రికలకు సెక్యూరిటీలు అడగటం, గ్రంధాల్ని-కరపత్రాల్ని నిషేధించడం, ప్రజలవద్ద లంచాలు పుచ్చుకోవటం,-యివన్నీ నిరాటంకంగా సాగుతున్నాయి. ఈ దురంతాలన్నింటికీ కాంగ్రెసు మంత్రులు మౌనముద్ర వహించడమే కాకుండా, సమర్ధిస్తున్నారుకూడా !

కాంగ్రెసు తీర్మానానుసారం ఇండియా అక్టును మనం భగ్నంకావించాలంటే, మన మంత్రులు యీ పంథాను వెంటనే విడిచిపెట్టాలి. రాజీనామా లిచ్చి బయటికిరావాలనీ మేము కోరడంలేదు. అక్టులో వున్న లోపాలు, అడ్డంకులు యిప్పుడైనా వారు గ్రహించి, గవర్నర్లతోనూ, జమీందార్లతోను రాజీపడ్డం ద్వారా ప్రజలకు చేయగలిగినంత ఉపకారమే చేద్దాం అనే ధృక్పథం విడిచిపెట్టి, కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో చెప్పిన అంశాలన్నింటినీ తు, చ, తప్పకుండా నెరవేర్చడానికి పూనుకోవాలి. గవర్నర్లు, భాగ్యవంతులు యిందుకు వ్యతిరేకించినప్పటికీ అందుకు సిద్ధం కావాలి. జవహర్ పండితుడు వాక్యమందలి యదార్ధాన్ని మన మంత్రులు గ్రహించనంతకాలం మనం యింతే!

బోసు యిచ్చిన సందేశం.

ఈ మధ్య రాజపాళయంలో జరిగిన తమిళనాడ్ రాజకీయ మహాసభకు రాష్ట్రిపతి సుభాష్‌బోసు సందేశంయిస్తూ, ఈవిధంగా వ్రాశాడు:—

"బ్రిటిష్‌ప్రభుత్వం మరొక అయిదో, పదో, సంవత్సరాల వరకు ఫెడరేషన్ అమలు జరపకుండా ఆపివేస్తే, మనం చేయవలసింది ఏమిటి? చేతులు ముడుచుకొని కూర్చోవలసిందేనా? పట్టి ఆత్మరక్షణేనా, మనం అవలంభించవలసింది? ఆ విధంగా చేయకూడదని మన అందరి విశ్వాసం అని తలుస్తున్నాను. సాధ్యమైనంత త్వరలో మనకు సంపూర్ణ స్వరాజ్యం రావాలి. అందుకై మనమే ముందంజ వేయవలసియుంటుంది"

జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు చక్కగా పరిశీలించిన తరువాతనే బోసు యీ సందేశాన్ని పంపాడు. కాంగ్రెసు సభ్యులసంఖ్య ఈయేడు ఉన్నంత ఎక్కువగా ఇదివరకెప్పుడూ లేదు. రైతు సంఘాలు నానాటికీ వృద్ధిచెందుతున్నాయి. కార్మిక సంఘాలుకూడా అంతే. ప్రజాసామాన్యం ప్రత్యక్షపోరాటాలలో విరివిగా పాల్గొంటున్నారు. సంస్థాన ప్రజలపోరాటశక్తి నిమిష నిమిషానికీ ఎక్కువౌతోంది. అంతర్జాతీయంగాచూస్తే, గ్రేట్ బ్రిటను యిప్పుడు పడ్డ సందిగ్ధావస్థలో యిదివరకెన్నడూ పడియుండలేదు. ప్రజాపోరాటానికి యిదే సరియైనఅదను. వచ్చే త్రిపురా కాంగ్రెసు ప్రజలెట్టి "ముందంజ" వేయాలని తీర్మానిస్తుందో!

మలబార్ రైతులపై నిర్బంధ విధానం

కొత్తగా బయల్దేరిన మలబార్ రైతు ఉద్యమంమీద ప్రభుత్వోద్యోగుల నిర్బంధవిధానం ఎక్కువౌతోంది. రైతుసంఘ కార్యాలయాల్ని పోలీసులు సోదాచేస్తున్నారు. రైతుప్రచారకుల మీద పోలీసునిఘా హద్దుమీరుతోంది. 60 మంది రైతు సేవకుల్ని ఎరస్టుచేశారు. కొంతమందికి శిక్షలు విధిస్తున్నారు. గ్రామాలలో ప్యూనిటివ్ పోలీసుల్ని కూడా నియమించారు. రివెన్యూ మంత్రి ప్రకాశంగారు వాగ్దానంచేసినప్పటికీ, ప్యూనిటివ్ పోలీసులబాధ తప్పడం లేదు. ఈ ఒక్క విషయంచూస్తే బోధపడుతుంది, మదరాసు రాజధానిలో పరిపాలనచేస్తున్నది కాంగ్రెసు మంత్రులో లేక పోలీసులూ-జిల్లా కలెక్టర్లో!

మదరాసు మంత్రులు యీ నిర్బంధవిధానాన్ని ధైర్యంగా ఎదుర్కొని, కాంగ్రెసు గౌరవాన్ని నిలబెట్టవలసి యుంటుంది గవర్నరుతో పేచీ వచ్చినప్పటికీ!

సత్య - అహింసల పేరిట!

బీహార్ రాష్ట్రింలో, హరినగర్ పంచదారమిల్లు కార్మికుల సమ్మెకు సహాయంచేసిన కాంగ్రెసు వాదులపై రాష్ట్రికాంగ్రెస్ కమిటీ డిసిప్లినరీ చర్య తీసుకోవాలంటూ చంపారణ్ జిల్లా కాంగ్రెసు కమిటీ తీర్మానించింది. నవంబరు 7వ తేదీని బొంబాయి రాష్ట్రిమంతటా జరిగిన కార్మిక సమ్మెలో పాల్గొన్న కాంగ్రెసు నాయకులపై డిసిప్లినరీ చర్య తీసుకోవాలంటూ మహారాష్ట్రి కాంగ్రెసు కమిటీ తీర్మానించింది. రేవ్‌రా (బీహార్)లో రైతుల సత్యాగ్రహంపట్ల గయా జిల్లా కాంగ్రెసు కమిటీ సానుభూతిని వెల్లడించినందుకు సంజాయిషీ చెప్పవలసిందంటూ రాష్ట్రి కమిటీవారి ఉత్తరువు. ఈనిషేధాలన్నీ సత్య - అహింసల పేరిటనే జరిగాయి.

మన డాక్టరు పట్టాభివంటి సుప్రసిద్ధ కాంగ్రెసు వాదులు ఒక్క ఆంధ్రరాష్ట్రింలోనేకాక, దేశంఅంతాటాఉన్నారన్నమాట! కాంగ్రెసునుండి అతివాదుల్ని తరిమివేయడానికి సాగుతూన్న యీవేట ఎక్కడ ఆగుతుందో!

విద్యార్థులకు రంగాగారి హితవు.

మదరాసు ప్రెసిడెన్సీ విద్యార్థుల మహాసభకు అధ్యక్షత వహిస్తూ, ఆచార్య రంగాగారీ విధంగా ఉపన్యసించారు:—

"నేటి విద్యాలయాలు, కళాశాలలు జైళ్ళ మాదిరిగా ఉన్నాయి. వాటిల్లోకి విద్యార్థులు వెళ్లుతున్నారంటే, వాటియెడల ప్రేమ కొద్దీకాదు. తప్పనిసరిగా వెళ్ళవలసి వస్తోంది కాబట్టి. విద్యాలయాధికార్లుగాని, ఉపాధ్యాయులుగాని తాము విద్యార్థుల జీవితాలకు ధర్మకర్తలమనే భావం కలిగి యుండములేదు. విద్యార్థులు ముందు ముందు నెరవేర్చవలసిన విధులకు వారిని తరిఫీదు చేయవలసి ఉంది. ఈ విషయాన్ని వారు గుర్తిచడంలేదు. ఒకరితో నొకరు అన్యోన్య భావంతో మెలగడంపోయి, అపనమ్మకంతోను, అగౌరవంతోను మెలగుతున్నారు. ఈ విధంగా వాతావరణమంతా భయంకరంగా కనపడుతోంది. ఈ పరిస్థితులలో, విద్యార్థులు ప్రతి చోటా సమ్మెలు చేయడంలో ఆశ్చర్యం ఏముంది? ఈ సమ్మెలు ఇంత ఆలస్యంగా ఎందుకు ప్రారంభించబడినవా, అని ఆశ్చర్యంగా ఉంది నాకు. ఇప్పటి కంటే సమ్మెలు ఎక్కువ తీవ్రంగాను, అన్ని మూలలా వ్యాపించేలాగునను, ఉండి యుండాల్సింది."

మదరాసు ప్రధాని రాజగోపాలాచారి మొదలు పండితజవహర్‌లాల్ నెహ్రూ వరకుగల కాంగ్రెసు నాయకులంతా విద్యార్థి సమ్మెలను నిరసిస్తూన్న యీరోజులలో ఆచార్య రంగాగారు ధైర్యంగా ముందుకువచ్చి, విదేశ పరిపాలకులచే తయారు కాబడ్డ మన విద్యావిధానాన్ని పూర్తిగా ఖండించి సమ్మెలను సమర్థించినందుకు విద్యార్థిలోకం వారికి ధన్యవాదములు సమర్పించవలసియుంది. విద్యార్థులు రాజకీయాలలో పాల్గొనకూడదనే వితండవాదంకూడా బయల్దేరింది, సుప్రసిద్ధ కాంగ్రెసు నాయకులలోనే. దానికి రంగాగారు సమాధానమిస్తూ, ఈవిధంగా పలికారు.

"విద్యార్థులు నేడు రాజకీయాలలో ఎక్కువగా పాల్గొంటున్నారనికాదు నావిచారం. వారు చాలా తక్కువగా పాల్గొంటున్నారనే!"

వద్దు, వద్దని ఎంత నివారించడానికి ప్రయత్నిస్తూన్నా, విద్యార్థులు రాజకీయాలతో పాల్గొనడం మానడంలేదు. కాలవాహినికి ఎదురీదడానికి పూనుకొన్న మన రాజకీయ నాయకులకు రంగాగారు తగిన సమాధానం చెప్పారు.

జిన్నా యిందు కంగీకరిస్తాడా?

కాంగ్రెసు మంత్రులధికారంలో ఉన్న రాష్ట్రాలలో మహమ్మదీయులమీద ప్రభుత్వం అనేక దుండగాలు చేస్తూందంటూ యీ మధ్య ముస్లింలీగ్ మహాసభలో తీర్మానించబడింది. ఆ ఆరోపణలు ఆధార రహితమని జవహర్లాల్ ఖండించాడు. ఒక నిష్పాక్షిక విచారణ కమిటీ యెదుట పై ఆరోపణను ఋజువు చేయవలసినదని అతడు జిన్నా (ముస్లిము లీగ్ నాయకుడు)కు సవాలుచేశాడు. ఆ కమిటీలో కాంగ్రెసువాదులుగాని, ముస్లిం లీగ్ సభ్యులుగాని ఉండకూడదని సూచించాడు.

నెహ్రూ పండితుని యీ సూచనకు జిన్నా అంగీకరిస్తాడో, లేక కాంగ్రెసు వర్కింగుమిటీ అంతా యిందుకు సమ్మతించాలనీ, ముస్లింలందరికీ లీగు ప్రాతినిధ్యం వహిస్తూందని కాంగ్రెసు గుర్తించాలనీ, కోరతాడో, చూడవలసియుంది.

అతడావిధంగా కోరడంలో ఆశ్చర్యం ఏమీలేదు. బెంగాల్ ప్రధాని ఆమధ్య యీవిధంగానే కాంగ్రెసు ప్రభుత్వాలమీద కొన్ని ఆరోపణలుచేసి, ఋజువు చేసుకోలేకపోయాడు. జిన్నా కూడా యిప్పుడు అనేక హిరణ్యాక్ష వరాలు కోరవచ్చు.

కాంగ్రెసువాదులంతా ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే. మన కాంగ్రెసు నాయకులు ప్రజాపోరాటం నుంచి దూరంగా పోతూన్న కొద్దీ ముస్లింలీగ్-హిందూమహాసభలవంటి మత సంస్థలు అమాయకప్రజలలో మతోద్రేకాలను రెచ్చగొట్టి మత పలుకుబడిని ఎక్కువ చేసుకో గలుగుతున్నాయి. కాంగ్రెసు నాయకులు చట్టసమ్మత పద్ధతులకే ఎక్కువ ప్రాధాన్యత యిస్తూన్నంతకాలం జాతీయ విద్రోహులు కాంగ్రెసు సంస్థపై చేసే దుష్ప్రచారంమానరు. నిష్పాక్షిక విచారణలు, రాజీప్రయత్నాలు-వీటివల్ల అంతగా ప్రయోజనం ఉండదు.

వ్యాసకర్తలకు

(1) వ్యాసాల పంపువారు కాగితానికి విడిగా ఒకవైపునే వ్రాసి పంపవలెను.

(2) వార్తలు ఆలసించకుండా సాధ్యమైనంత క్లుప్తంగా వ్రాసి పంపవలెను.

(3) ప్రకటింపబడని వ్యాసాలు గాని, కథలు గాని పోస్టేజీ పంపనిదే తిరిగి పంపజాలము.

—సంపాదకుడు.

11—1—39 బుధవారం

జమీన్ రైతు వారం జయప్రదంగా జరపండి!

శతాబ్దాలనుండి అక్రమంగా పీడించబడుతున్న జమీన్ రైతుల కష్టాలను స్వల్పముగానైన తొలగించాలనే హృదయపూర్వక ప్రయత్నం చేస్తోంది ప్రకాశం కమిటీ నివేదిక. నివేదికతోపాటు ప్రకటించబడిన చిత్తుబిల్లు వేరొకచో ముద్రింపబడినది. ఈబిల్లు ప్రకాశం కమిటీ నివేదికలోని కొన్ని సూచనలకు వ్యతిరేకముగా ఉంది. రిపోర్టు మూల సిద్ధాంతమును బలపరచుచు, బిల్లులోని లోపాలను తొలగించడమే గాక బిల్లు ఇంకను రైతాంగమున కనుకూలమైన మార్పులను గావించుటకు ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘము, సోషలిస్టుపార్టీ చేసిన సూచనలను మాపాఠక లోకమునకు ఇదివరకే తెలిపియున్నాము. 12 వ తేదీనుండి 19 వ తేదీవరకు జమీన్ రైతు వారమును, 20 వ తేదీ జమీన్ రైతు రక్షణ దినమును జరుపవలసినదిగా ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు ప్రకటించియున్నారు.

ప్రకాశం కమిటీ కవేదికపై మంత్రివర్గంలో అభిప్రాయ భేదాలున్నాయను వదంతులు విరివిగా వున్నాయి. ప్రధాని రాజాజీ హిందూ పత్రిక కిచ్చిన ప్రకటనలో యీవిషయమై కొన్ని పత్రికలు కథలల్లుతున్నాయని నిరశించారేగాని, తాను ప్రకాశం కమిటీ నివేదికకు సుముఖుడనని వెల్లడించలేదు. అది మరింత అనుమానాలకు కారణమవుతూంది.

ప్రకాశం కమిటీ నివేదికను బలపరుస్తూ నివేదికలోని సూచనలకు తగ్గని విధాన శాసనం గావింపబడాలని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కార్య సంఘము తీర్మానించినది. తమిళనాడు రాష్ట్ర కాంగ్రెసు మహా సభ నివేదికను బలపరుస్తూ ఏకగ్రీవంగా తీర్మానించినది. ఎన్నికలలో కాంగ్రెసు జయానికి, కాంగ్రెసు మంత్రి వర్గ స్థాపనకు ముఖ్య కారకులైన రైతు ప్రజానీకం ప్రకాశం కమిటీ నివేదికను బలపరుస్తూ ఉంది.

మద్రాసులో సమావేశ మయిన జస్టిస్ పార్టీ మహా సభ మాత్రం తమ జమీందారీ నాయకత్వానికి నష్టం వస్తుందని యీ నివేదికను నిరసించింది. అంటే జస్టిస్ పార్టీ కోరునది, తాను చాటుకొను బ్రాహ్మణేతర ప్రజల శ్రేయస్సు గాక జాతీయ విద్రోహులగు జమీందారీ వర్గ క్షేమమే నని తేట తెల్ల మయినది. స్వాతంత్ర్యము కాంక్షించు ప్రజానీక మంతా బలపరుస్తున్న, జాతీయ విద్రోహులు వ్యతిరేకించుచున్న యీ ఎస్టేటు ల్యాండ్ టెనన్సీ బిల్లును శాసనం గావించుటలోనే కాంగ్రెసు మంత్రి వర్గ ప్రతిష్ట ఆధారపడి ఉంది.

ఇందులకు రైతాంగము తన కర్తవ్యాన్ని నెరవేర్చాలి. రేపటి నుండి జరుగు జమీన్ రైతు వారములో జమీన్ రైతుల ఘోషతో వాతావరణ మంతా ప్రతిధ్వనించాలి. ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘము వారు సూచించిన సవరణలతో బిల్లును శాసనం గావించాలని పిటీషన్లు మద్రాసు శాసన సభా అధ్యక్షులకు గ్రామ గ్రామముల నుండి రైతుల సంతకములతో అందజేయబడాలి. ఆ యా నియోజక వర్గాలలోని శాసన సభ్యుల వద్దకు రాయబారాలు వెళ్ళాలి. వారి నుండి బిల్లును బలపరుస్తా మని వాగ్దానాలు తీసికోవాలి. కాంగ్రెసు శాసన సభ్యుల నుండి కాంగ్రెసు పార్టీ మీటింగులో ప్రకాశం కమిటీ నివేదికను బలపరుస్తా మని, బిల్లును సంకుచిత పరుచు ప్రయత్నాలను వ్యతిరేకిస్తా మని ప్రమాణం చేయించుకోవాలి. కాంగ్రెసు పార్టీలో భేదా లున్నా యనే వదంతికి రైతులు వేయగలిగిన, వేయవలసిన మందు ఇదే.

జమీన్ వారమంతా రైతు సేవకులు, సోషలిస్టులు, గ్రామగ్రామాన సభలు, ఊరేగింపులు జరపాలి. ప్రకాశం కమిటీ నివేదికలోని వివరాలను రైతులకు తెలియజేయాలి. రాష్ట్ర రైతుసంఘం సూచించిన మార్పులను ఎరుక పరచాలి. ఈబిల్లును శాసనం కావించడానికి కాంగ్రెసు మంత్రివర్గానికి ఆసటగా రైతాంగమును సిద్ధపరుపాలి. జమీందారులు, జాతీయ విద్రోహులు, గవర్నరు వైస్రాయిల సహాయంతో యీబిల్లుకు ఆటంకాలు కల్గించిన, రైతు ప్రజానీకము సర్వశక్తుల ధారవోయుటకు, అవసరమగుచో సత్యాగ్రహం కూడ చేయుటకు సర్వసన్నాహాలు చేయాలి. అందులకు ముఖ్యావసరమైన రైతుల సంఘీకృత బలాన్ని వృద్ధి చేయాలి.

కొందరు, తీవ్రవాదుల ధోరణిలో జమీందారీవిధానమునకు మూలసూత్రమైన పర్మనెంటు సెటిల్మెంటును ఖాయపరచుచున్న దని ప్రకాశం కమిటీ నివేదికను ఆక్షేపించుచున్నారు. జమీందారీ విధానం రద్దుచేయుట రైతాంగ చైతన్యంపై ఆధారపడి వుంటుంది. ప్రకాశం కమిటీ పర్మనెంటు సెటిల్మెంటును ఆధారంగా కొని, నేడు జమీన్ రైతు లనుభవించుచున్న దుర్భరావస్థలను కొన్నిటిని తొలగించుటకు ప్రయత్నము గావించుతూంది. భూమికి హక్కుదారు రైతే అని నిరూపించుతూంది. అడవులు, బంజరులు ప్రజల సాముదాయకోపయోగానికే గాని జమీందారుల సొంత ఆస్థి కాదని నిరూపించింది. జమీందారు రైతులనుండి రాజ భాగము వసూలు చేయుటకు ఏర్పడిన రెవిన్యూ ఏజెంటు మాత్రమే నని స్థిరపరచినది. 1802 పర్మనెంటు సెటిల్మెంటు నాటి శిస్తు రేట్లనే ఖాయపరచింది. ఇదంతయు అభివృద్ధి సూచకమైన సంస్కరణయే గాన జమీందారీ విధానం రద్దు కావాలనే సోషలిస్టులం బలపరచాలి. బలపరుస్తున్నాము.

కాని దాని అర్థం జమీందారీ విధానాన్ని నాశనం గావించాలనే నినాదం వదలుకొంటామని కాదు. తాత్కాలిక సంస్కరణల ద్వారా వచ్చిన అవకాశాన్ని రైతాంగ చైతన్యాన్ని వృద్ధి చేయటానికి వినియోగించి. అసలు జమీందారీ విధానాన్నే రద్దు గావించే అంతిమ పోరాటానికి దారి తీస్తాము.

ఈనాం రైతుల విషయంలో మాత్రం యీ నివేదిక సంకుచితమైన పంథా అవలంబించిన దనే సంగతి సత్యము. పర్మనెంటు సెటిల్మెంటులో చేర్చబడని యీనాములకు ఈ బిల్లు వర్తించ దనియు, వానిలో భూమికి యీనాందారే హక్కుదారు డనియు, నిర్వచించుట అన్యాయము. మనము సంస్కరణలు, మార్పులు కోరునది కష్టపడువారికి శ్రమకు దగిన ఫలితం ముట్టాలనియే. ఈనాందారులు వ్యవసాయకులు కారు. రైతులు భూమి దున్ని పండించి యిస్తే, అనుభవించేవారు. అట్టివారికే, పరిశోధన చేసి పూర్వం నుండి ఉన్నాయి గాన భూస్వామ్య హక్కులు తొలగించరాదనుట, అభివృద్ధిని కోరే సంస్కరణ వాది అయినా హర్షింప జాలడు.

అందులో 1936 లో జస్టిసు మంత్రివర్గం చేసిన ఎస్టేటు ల్యాండు ఆక్టు సవరణలో యీనాములు కూడ ఎస్టేటుల క్రింద చేర్చబడినాయి. ఆసవరణ వలన రైతులకు చెప్పదగిన మేలు చేకూరకపోయినా రైతులదే జిరాయితీ హక్కని నిర్వచించి, కాదని రుజువు చేసికోవలసిన బాధ్యత యీనాందారుపై వేసింది. ఇందుపై కోర్టులలో యీనాందార్లు రైతుల మధ్య అనేక దావాలున్నాయి. నేడు పై ఆక్టు రద్దుచేసి నూతన చట్టంలో ఎట్టి రక్షణా యీనాం రైతులకు యివ్వకపోవుట అన్యాయం. నూతన చట్టంలోని సౌకర్యాలు యీనాం రైతులకు కూడా చెందునట్లు సవరణైనా చేయాలి. లేనిచో యీనాం రైతులకు ఇట్టి సౌకర్యాలిచ్చు బిల్లు ప్రత్యేకంగా వెంటనే తీసికురావాలి. రైతులంతా యిందుకొరకు ఆందోళనచేసి తమ ఐక్యతను వెల్లడిచేయాలి.

మరల ఒకసారి సోషలిస్టులను, రైతు సేవకులను, కాంగ్రెసు వాదులను జమీన్ రైతు వారమును జయప్రదంగా జరుపవలసిందని హెచ్చరించుచున్నాము. నేడు మన నినాదాలు

ప్రకాశం కమిటీ నివేదికను బలపరచండి!


యీనాం రైతులకు కూడ బిల్లు వర్తించాలి!!

జాతీయ విద్రోహులకు లొంగరాదు!!!

గార్వాలీ ప్రజల ఘోష

నాగరిక ప్రపంచాన్నుండి మమ్ము వేరు చేయకండి!

కామ్రేడ్ యస్. యస్. బాట్లీవాలా



కన్యాకుమారి మొదలు నేపాళ రాజ్యంవరకు భారత దేశాన్ని కదలించి వేయగలిగిన ఈ చారిత్రిక ఘట్టాన్ని గురించి ఎంతమంది తెలుసుకున్నారు అని ప్రశ్నిస్తాను. ఆ మహోజ్వల స్వాతంత్ర్య పోరాటంలో, 'చారిత్రిక విభాత సంధ్య' (1930)ల్లో ఈ "సామాన్యుల సాహస మెట్టిదో" గ్రహించ గలిగిన భారత చిత్రకారులున్నారా అని కూడ అడుగుతాను. పెషావరు చరిత్రలో—కాదు మన స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో—అట్టి విచిత్ర సంఘటన ఇంతవరకు జరిగియుండలేదు. పఠానులు, బాలురు యువకులు, వృద్ధులు, స్త్రీలు, పసిపిల్లలు సహితము పెషావరు మెయిన్ బజారులో పెద్దఊరేగింపు చేశారు. పోలీసులు కాల్చి చంపుతారని వారికి తెలుసు. కాని ప్రతి ఒక్కరి ముఖంలోను ప్రతిబింబించే పట్టుదల, మృత్యుగహ్వరంలోకి చొరబడే వారి వారి నేత్రాల మెరుపు కవులు వర్ణించలేరు: చిత్రకారులు చిత్రించలేరు!

ఈ జన సమూహాని కెదురుగా ఒక భారత సిపాయి దళం వచ్చి నిలబడింది. పోలీసు అధికార్లు ముందుకు వచ్చి జన సమూహాన్ని వెళ్ళిపొమ్మని హెచ్చరించారు. లేకపోతే తుపాకులు కాల్చవలసివస్తుందని బెదరించారు. వారి బెదరింపులకు సమాధానంగా, ఆకాశంలో విహరిస్తూ ఈ దృశ్యాన్ని చూడడానికి గుమి గూడుతూన్న మేఘాలు చెల్లాచెదరై పోయేటంత నినాదం...."ఇన్క్విలాబ్ జిందాబాద్". చెదిరి పోయిన మేఘాల వెనకాల నుండి బైటపడ్డ సూర్యుడు తెల్ల మొఖం వేశాడు. ఇంతలో ఒక సార్జంటు ముఖం ఎర్రజేసుకుని 'ఫైర్!' అని మొరిగాడు. తుపాకులు పేలలేదు! జనసమూహం చప్పట్లు కొట్టి కేకలు వేసి కేరింతాలు కొట్టారు. వారికి తెలిసిపోయింది గార్వాలీ సిపాయీలు తమను కాల్చడానికి నిరాకరించారని. ఈ గార్వాలీ సిపాయీల దేశభక్తి ప్రదర్శనానికి సామ్రాజ్యవాదుల హృత్పిండం హడలిపోయింది. "కోర్టు మార్షల్ చేస్తామని బెదరించారు: సిపాయీలు భయపడలేదు! వారి వద్ద నున్న తుపాకులు లాక్కున్నారు; వారు చలించలేదు. మిలిటరీ కోర్టులో వీరి నందరిని విచారించారు. ఒక్కొక్కరికి 10 మొదలు 14 సంవత్సరాల వరకు శిక్షలు విధింపబడ్డాయి. అయితే ఒక విషయం మాత్రం స్పష్టమైంది. స్వాతంత్ర్య వీరుల రక్తంతో తమ దేశాన్ని ముంచెత్తడానికి భారత సైన్యం ఇష్టపడదు!

శిక్ష ననుభవించి విడుదల పొందిన ఒక గార్వాలీ సిపాయి హరిపురా కాంగ్రెసుకు వచ్చాడు, మహాసభ వైభవాన్ని చూచి నిశ్చేష్టుడై ఎ. ఐ. సి. సి. సభా భవనం గేటువద్ద నిలబడ్డాడు. అతని ముఖం వికసించి వుంది. అతని పెదవులమీద చిరునవ్వు నృత్యము చేస్తోంది, అంతులేని ఆ జనప్రవాహాన్ని ఆ సుందర దృశ్యాలను అతని నేత్రాలు కరువుదీర త్రాగివేస్తున్నాయి, కాంగ్రెసు సంస్థంతే పట్టలేని ప్రేమ, గౌరవము అతనిలో పొర్లి పొరలిపోయాయి. దీర్ఘమైన జైలు ప్రవాసంలో నిర్జీవమైన ప్రతిజీవకణాన్ని మేలు కొలిపాయి!

నేను మెల్లిగావెళ్ళి అతని భుజంమ్మీద చేయివేశాను. నావైపుకు తిరిగి చూచాడు. పాపం! ఆ జనసమూహములో ఈ వీర సైనికుని పలకరించిన వారులేరు! వెర్రి సంతోషంతో నన్ను కౌగలించుకున్నాడు. "ఇదంతా చూస్తే నాకు స్వర్గంలో వున్నట్లుంది" అన్నాడు రెండు ఆనందాశ్రువులు రాల్చి!

ఈమధ్యనే గార్వాల్ జిల్లా రాజకీయ మహాసభ జరిగింది. ఉపన్యాసకుని తరువాత ఉపన్యాసకుడు లేచారు. యు. పి. ప్రభుత్వ ఉపేక్షను ఖండించారు. గార్వాలీలు కాంగ్రెసు యెడల భక్తి ప్రమాణం చేశారు. వారు, భారత స్వాతంత్ర్య బలిపీఠం మీద ప్రాణాలు నర్పించడానికి సంసిద్ధులే. కాని, కాంగ్రెసు మంత్రులే తమ కోర్కెలయెడల నిరాదరణ చూపడానికి తగిన కారణముకూడా తెలుసుకోవాలని కోరుతారు! నిస్పృహ చెందిన తమ కోర్కె నెరవేరేవరకు సత్యాగ్రహం చేయ నిశ్చయించుకున్నారు. వారికిప్పుడు కావలసిన దేమ్టిలేదు. ఇతర నాగరిక ప్రపంచంతో సంబంధం కలిగివుండడానికి, ప్రక్క జిల్లాలకు కలుపుతూ ఒక రోడ్డు! గార్వాల్ జిల్లాలో ప్రస్తుత స్థితినిబట్టి ఒకమూల నుండి ఇంకోమూలకు పోవాలంటే 15 రోజుల ప్రయాణం. తమ యీ దుస్థితిని కాంగ్రెసు మంత్రులు తొలగించాలని వారి కోరిక. కాంగ్రెసు బోధించిన సత్యాగ్రహసూత్రం కాంగ్రెసు మంత్రులమీదనే ప్రయోగించవలసి వచ్చినందుకు వారు విచారిస్తారు; కాని వారికింకో మార్గంలేదు!

1938 మేనెలలో నెహ్రూ, గార్వాల్ జిల్లాలో సంచారముచేశాడు. సంచారానంతరము ఇల్లా వ్రాశాడు "గార్వాల్ జిల్లా ప్రపంచాన్నుండి వెలిబెట్టబడి నట్లుంది. అక్కడ దారిద్ర్యం తాండవిస్తూంది. 20 మైళ్ళు ప్రయాణము చేయడానికి నాకు ఒకరోజు పట్టింది. ఆజిల్లాలో సంచారము చేస్తూంటే వెయ్యి సంవత్సరాల క్రితం ప్రయాణం చేస్తున్నట్లుంది నాకు....

"గార్వాలీలకు ఈరోడ్డు నిర్మాణమే స్వరాజ్య నిర్మాణం. ఇది వారికి నేడు జీవన్మరణ సమస్య. "మాకు రోడ్డుకావాలి. లేదా దానికొరకు ప్రాణాలనైనా సమర్పిస్తాము" అన్నారు నాతో..... గత ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు (1914) బ్రిటిషు ప్రభుత్వం వారికి రైలు రోడ్డు నిర్మిస్తామని ఆశలు పెట్టింది. నిజంగా వేసే వారిలాగే కొలతలు కొలిచి, కొంత నాటకం జరిపారు. ఇదంతా వారిని మభ్యపెట్టి సైన్యంలో చేర్చుకోడానికి జరిగిన తంతు. అప్పటికి ఇప్పటికి వారి అతీగతీ ప్రభుత్వానికి అక్కరలేక పోయింది. అవసరం వచ్చినపుడు సిపాయీలను రిక్రూట్ చేసుకోడానికి, ఇతర ప్రపంచముతో సంబంధము లేకుండాచేసి దానినల్లా దాచిపెట్టుకుంది సామ్రాజ్యవాదం!

గార్వాల్ జిల్లాకు ఒక మట్టిరోడ్డు వేయించేభారం తాను వహిస్తానని నెహ్రూ వారికి వాగ్దానంచేశాడు.

యు. పి. ప్రభుత్వం ఇందుకోసం సంవత్సరానికి 20 వేల రూపాయలు గ్రాంటు చేసింది. కాని ఇది వారికి సంతోషాన్ని కలిగించలేదు. ఎందుకంటే ఆ రోడ్డు నిర్మించడానికి 20 లక్షలు కావాలి. యు. పి. ప్రభుత్వం యిచ్చే లెక్కప్రకారం ఆరోడ్డు పూర్తి అయేసరికి 100 సంవత్సరాలు పడుతుంది. అందుచేత వారికిది లాభించే సహాయముకాదు. సంవత్సరానికి నాలుగు లక్షల చొప్పున ఖర్చుచేస్తే వారికోరిక 5 సం॥ల్లో నెరవేరుతుంది.

నిజమే! యీ నాలుగు లక్షలు ఏటా యు. పి. ప్రభుత్వం తన బడ్జటులోంచి ఇవ్వడమంటే కష్టమైన విషయమే! కాని దానికి కొన్ని ఉపాయా లున్నాయి. ప్రభుత్వం వాటిని సునాయాసంగా అవలంబించవచ్చు.

1. ప్రయాగనుంచి బదరీనాధ్‌కు పోయే యాత్రికులు ఈ జిల్లాగుండా పోవాలి. ఈ యాత్రికుల మీద, రోడ్డుకోసం యాత్ర పన్ను విధించి కష్టం లేకుండా సం॥కి 50 వేలు ఆదాయం తీయవచ్చు.

2. బదరీనాథ్ ఆలయానికి కొన్ని లక్షలు ఆదాయం వచ్చే ఆస్థి వుంది. ఆ ఆదాయంలోంచి సంవత్సరానికి 50 వేలు, అక్కడే వున్న కేదారనాథ్ ఆలయ ఆదాయము నుండి సాలుకు 10 వేలు ఇబ్బంది లేకుండా రోడ్డుకోసం మిగల్చ వచ్చు.

3. ప్రతి సంవత్సరం గార్వాల్ జిల్లా 3,50,000 రెవిన్యూ పన్ను చెల్లిస్తుంది. ఇందులోంచి సుళువుగా 20 వేలు దీనికి ప్రత్యేకించవచ్చు.

4. కాంగ్రెసువారు మంత్రి పదవులు స్వీకరించక పూర్వం, 1929 నుండి, ఇదివరకున్న ప్రభుత్వాలు గార్వాల్ జిల్లాలో రూపాయకు అయిదణాలు అదనపు పన్నులు విధించాయి. ఇప్పుడు కాంగ్రెసు మంత్రులు ఆ అదనపు పన్నులు తగ్గించలేదు సరే కదా ఈ రోడ్డు కోసం అయినా వినియోగించవచ్చు.

కాంగ్రెసు మంత్రులు గార్వారీల ఘోషను గుర్తించాలి. వారి సక్రమమైన ఈ కోర్కెను నెరవేర్చాలి. పై జెప్పిన పద్ధతుల ప్రకారము నెరవేర్చడము చాలా సులభము కూడాను. భావి భారత స్వాతంత్ర్యము మన సిపాయీలపై కూడ ఆధారపడి ఉందని వారు గ్రహించాలి. 1930 లో గార్వాలీ సిపాయీలు చూపిన అఖండ దేశభక్తికి తగిన ప్రతిఫలము వారికి అందజేసి కాంగ్రెస్ తన విశ్వాసాన్ని ప్రకటించాలి. యు. పి. కాంగ్రెసు ప్రభుత్వం తన ఈచిన్ని కర్తవ్యాన్ని నెరవేరుస్తుందా? ఏమో, చూడాలి!

ఉత్తర విశాఖ జిల్లా
రైతుల ఏకగ్రీవ సమ్మతి.
వెంటనే శాసనం కావాలని ఆందోళన.

28-12-38 సాయంకాలం కారబుగ్గ రహదారి బంగళావద్ద జిల్లా రైతు సంఘ సమావేశం జరినది. రైతు సంఘ సభ్యులు ప్రచారకులే కాక పరిసర గ్రామములనుండి సుమారు 300 మంది రైతులుకూడ సభకు వచ్చారు.

మొదట జిల్లారైతు సంఘ అధ్యక్షులు శ్రీ పుల్లెల శ్యామసుందరరావు. ఎం. ఎల్. ఏ., గారు ప్రకాశం కమిటీ రిపోర్టు సారాంశములను వివరించారు. ఈనాందారీ రైతులను ప్రత్యేకించాలని రిపోర్టులో సూచించడం అన్యాయమని అన్నారు. ఈ పరిస్థితులలో రైతుల కర్తవ్యం స్పష్టపరిచారు.

తర్వాత శ్రీ ఠాకూరు రామకృష్ణరావు. శ్రీ రంగాచారి, పొట్నూరి స్వామిబాబు, దుక్కా సూర్యనారాయణ రెడ్డి, గౌతు లచ్చన్నగారలు దీర్ఘముగ మాట్లాడినారు. రైతుసంఘాల ప్రధానాశయములగు జమీందారీ పద్ధతి రద్దును, మొదలైనవి జరిగేవరకు రైతులు నిరంతరాంతరాందోళన సాగించాలనీ, ప్రస్థుతపు బిల్లును వెంటనే శాసనం చెయ్యాలనీ ఉద్బోధించారు.

ఈ సభలో జరిగిన తీర్మానాలలో క్రింది తీర్మానం ముఖ్యమైనది.

"రిపోర్టు పై దక్షిణ భారత కార్మిక కర్షక సమ్మేళన సమితివారు, రాష్ట్రరైతుసంఘము, రాష్ట్ర జమీన్ రైతుసంఘాలవారు గావించుచున్న చర్చలు, తీర్మానాలు అన్నియు ఈసభవారు పూర్తిగా విచారించి పై సంఘాల తీర్మానాలన్నింటినీ యేకగ్రీవముగా బలపరచుచు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాల సూచనల ప్రకారము వెంటనే బిల్లును వచ్చే జనవరి శాసనసభలో ప్రవేశపెట్టవలసినదని మదరాసు ప్రభుత్వమును యీ సభవారు కోరుచున్నారు."

* * *

విశాఖపట్నం జిల్లాలో ప్రచారము.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాధ్యక్షులు శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు, జిల్లా రైతుసంఘాధ్యక్షులు శ్రీ వి. అప్పారావు మహాశయోగారు, ప్రధానకార్యదర్శి యన్. నరసింహమూర్తిగారు, సభ్యులు శ్రీ నగిరెడ్డి నారాయణ నాయుడుగారు, (జిల్లాబోర్డు మెంబరు) డిసెంబరు 29 తేదీనుండి జనవరి 2 తేదీవరకు 4 దినములు విశాఖట్నం జిల్లాలో రైతుల కష్ట సుఖములను విచారిస్తూ, శ్రీ ప్రకాశం కమిటీ నివేదికనుగూర్చి, గజపతినగరం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, పెదబోండపల్లి, రామభద్రపురం, తెర్లాం, సంకిలిమంతెన, దూసి మొదలైనగ్రామాలలో ఉపన్యసిస్తూ సంచారము చేసినారు.

జిల్లాలోగల ముఖ్యమైన జమిందారీల నుండి ఒక్కొక్కసభకు పది, పదిహేను గ్రామముల రైతులు హాజరై అధికోత్సాహాన్ని చూపినారు.

జమీందారీ పద్ధతి రద్దుపరుపజాలని యే రైతాంగచట్టము రైతులకు సంపూర్ణ దరిద్ర దాస్య విమోచనమునకు తోడ్పడజాలదని, ప్రస్తుత రాజ్యాంగ పరిస్థితులలో ప్రకాశం కమిటీరిపోర్టు సూచనలు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సూచనలతోపాటు శాసనమైదే రైతులకు కొంతవరకు దారిద్ర్య నివారణకు తోడ్పడునని, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ సూచనలతో ప్రకాశం



కమిటీరిపోర్టు సూచనలకు యేంతమాత్రం తగ్గనివిధముగా జనవరి శాసనసభలోనే చట్టమును ప్రవేశ పెట్టవలయుననీ, ఈనాం రైతులను రానున్న బిల్లునుంచి తప్పించుట అన్యాయం గాన, వెంటనే వారికిగూడ తోడుతనే బిల్లు ప్రవేశపెట్టవలయుననీ, వారికి ఆ నూతనచట్టం అమలులోకి వచ్చువరకు ప్రస్తుత ఎస్టేట్సు ల్యాండు ఆక్టు (యీనాం రైతులకు సంబంధించినంతవరకు) అమలునం దుంచవలయుననీ, పై ప్రకాశం రిపోర్టు రైతులకు అనుకూలంగా, న్యాయంగా బిల్లురానియెడల సత్యాగ్రహమైనా చేయుటకు రైతులు సంసిద్ధులని ప్రకటిస్తు సభలలో తీర్మానాలు చేశారు.

* * * *

కాశీబుగ్గ

2—1—39 వ తేదీని కాశీబుగ్గలో 5 వ ఉత్తర విశాఖజిల్లా రైతు మహాసభ జరిగినది. ఉదయం పతాకోత్సవము జరిగినది. దానిని గుంటూరు వాస్తవ్యులు శ్రీ వాసిరెడ్డి శివలింగ ప్రసాద్‌గారు జరిపిరి. అంతకుముందు పట్టణమంతయు కర్షక, కార్మిక, జాతీయ పతాకములతో ఊరేగింపు జరిగెను. ఆ సమయమున శ్రీ రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ, ఆచంట సత్యనారాయణ, వాసిరెడ్డి శివలింగప్రసాద్, పుల్లెల శ్యామసుందరరావు, గౌతు లచ్చన్న, అబ్దుల్ రహ్మాన్‌ఖాన్, బుక్కా సూర్యనారాయణరెడ్డి మొదలైనవారు కలరు.

సభాకార్యక్రమము వందేమాతర గీతముతోను, రైతు కార్మిక గీతములతోనూ ప్రారంభమయ్యెను. సభకు 4 వేలమంది జమీన్‌రైతులు చీకటి, తలతంపర, జలంత్ర, జొరువ, మంనసా, తర్ల, పాతటెక్కలి, నందిగాం, పర్లాకిమిడి, గోపాలపురం. జమీందారీల నుండి వచ్చిరి.

శ్రీ రెబ్బాప్రగడ మందేశ్వర శర్మగారు సభను ప్రారంభించుచూ, జమిందారీ చరిత్రను వివరించిరి. పర్మనెంటు సెటిల్‌మెంటు గురించి చెప్పిరి. అంతట ప్రకాశంగారి కమిటీ రిపోర్టు ప్రచురించిన తరువాత కొన్నిచోట్ల అక్రమములు జరుగుచున్నవని ప్రభుత్వంవారీ మధ్య ప్రకటించిన ప్రకటనసుఖండిస్తూ రైతులుఅక్రమాలకుదిగుదురనే విశ్వాసమువారికే మాత్రంలేదనియూ, జమిందారులే శేరీలని, భూము క్రొత్తగా కల్పించిన భూములను అమ్ముకుంటున్నారనిన్నీ, సాముదాయక భూములను ఆన్యాక్రాంతము చేయుచున్నటుల తెలియుచున్నదని చెప్పిరి. జమీన్ రైతుల ఉద్యమము 136 సం॥ నుంచీ పడుచున్న బాధలను తప్పించుకొనుటకే యనియూ, జమిందారీపద్ధతి రద్దుగావలెననియు ప్రకాశముకమిటీ రిపోర్టు ప్రకారం శాసనము గావలెననియు. ప్రజారాజ్యములోనే ఇందుకు అవకాశము గలుగుననియూ చెప్పిరి.

అధ్యక్షోపన్యాసము

అంతట అధ్యక్షులు శ్రీ ఆచంట సత్యనారాయణగారు ఉపన్యసించుచూ, జమీన్ రైతులు పడుబాధలు ఎట్టివో వివరించిరి. బ్రిటిష్ పరిపాలనమువలన గ్రామసౌభాగ్యము ఏవిధముగా చెడిపోయినది వివరించిరి. జమీందారీల మూలముగా రైతులు ఏవిధముగా నలిగిపోయినదియు చెప్పిరి.

తీర్మానములు

1. జమిందారీ పద్ధతి పూర్తిగా రద్దుచేసిననేగాని రైతు లోకమునకు ముక్తియు దేశమునకు దారిద్యము తీరడము కలుగునని పూర్తిగా నమ్ముచు ప్రస్తుత పరిస్థితులలో ఆవకాశమైనంతమట్టుకు జమీనురైతుల కష్టములను తొలగించుటకుగాను కృషిచేసి చరిత్రాత్మకమైన రిపోర్టును వెలువరచి, యింతవరకు రైతులను మరుగుపరుపబడిన వారి హక్కులను వారికి బహిరంగపరచి నందులకు శ్రీ ప్రకాశం పంతులుగారికి వారితోటి జమీందారీ విచారణ కమిటీ సభ్యులకున్ను యీ సభవారు తమ కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించు చున్నారు.

2. జమీందారీ విచారణ సంఘమువారి రిపోర్టులోని ఉద్దేశములను ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘమువారి సలహాలను అనుసరించి అమలులోనికి వచ్చేలాగున వెంటనే శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టించ వలసినదిగా శ్రీ గౌ॥ మద్రాసు శాసనసభాధ్యక్షులను శ్రీ గౌ॥ మద్రాసు రెవెన్యూ మంత్రిగారిని యీ సభవారు ప్రార్థించుచున్నారు.

3. ఈనెల 16 తేదీని, 20 తేదీని శాసనసభ కాంగ్రెసు పార్టీ సమావేశములోను, శాసనసభా సమావేశములోను, అన్నివిధముల కృషి చేసి పైప్రకారము బిల్లు వెంటనే అమలులోనికి వచ్చునట్లు చేయవలసినదిగా యీ జిల్లాలోని శాసనసభ్యులైన శ్రీ వరహగిరి వెంకట జోగయ్య పంతులుగారిని, పుల్లెల శ్యామసుందరరావుగారిని, చల్లా నర్సింహంగారిని, సాకేటి గురువులుగారిని, పసుమర్తి వీరభద్రస్వామి, నారాయణ చలమాజీగార్లను కోరడమైనది.

4. జమీందారీ విచారణ కమిటీవారి సలహా ప్రకారము అమలుచేయుటలో యెట్టి ఆటంకములుగాని ఆలస్యములుగాని జరిగిన దేశంలో అశాంతికి కారణమగునని యీ సభవారు అభిప్రాయ పడుచున్నారు.

5. ప్రస్తుతము యీ జిల్లాలో జరుగుతూయున్న సెటిలుమెంటు నిలుపుదేయని యెడల రైతులకు అనవసరమైన వ్యయప్రయాసములు కలుగునుగాన యీబిల్లు పర్యవసానము తేలినవరకు యీ సెటిలుమెంటు నిలుపుచేయ వలసినదని యీ సభవారు రెవిన్యూ బోర్డువారిని మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.

6. ఈజిల్లాలోని అన్ని తాలూకాలలోను గ్రామములలోను విరివిగా ప్రచారము సాగించి రైతు యాత్రలుచేసి తీర్మానములను శాసన సభాధ్యక్షులకును, రెవిన్యూ మంత్రిగారికిన్ని యీనెల 15 వ తేదీలోగా పంపవలెనని తాలూకా, గ్రామరైతు సంఘములవారిని ఈ సభవారు హెచ్చరించు చున్నారు.

7. ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘమువారి కార్యక్రమమునకు సహాయపడుటకున్ను శ్రీయుతులు పుల్లెల శ్యామసుందరరావు, దుక్కా సూర్యనారాయణరెడ్డి, గౌతు లచ్చన్న, గేదెల చంద్రయ్యనాయుడు, బడే వెంకటరెడ్డినాయుడు గార్లు ఈజిల్లానుండి ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘము తరపున ఈనెల 16 తేదీని జరుగనున్న శాసనసభా కాంగ్రెసుపార్టీ సమావేశమునకు రాయబారము వెళ్ళుటకుగాను ఈ సంఘం యొక్క ప్రచారకులను యెన్నుకోవడమైనది.

8. ఈ జమీందారీ విచారణ సంఘపు నివేదికలోని సూచనల ప్రకారము ఇనాము రైతులకు నష్టము కలుగుచున్నది గనుక వెంటనే ఇనాము రైతులకు గల యిబ్బందులను తొలగింను శాసనమును జమీందారీ రివిన్యూ చట్టం తోడ్పాటు వెంటనే ప్రవేశపెట్టవలెనని ఈ సభవారు శాసనసభ వారిని కోరుచున్నారు.

9. 10. చీకటి తలతంపరముఖాసా రైతులు గత ఆరు సంవత్సరములనుండి జమీందారుతో శిస్తునిర్ణయమును గురించి వాదన చేసియున్నను యింతవరకు రైతులను కోర్టుకు యీడ్చుటకు యీ ముఠా రైతులు చింతిల్లుచున్నారు.

10. 11. మదరాసు ప్రభుత్వమువారు రైతుల సౌకర్యమునకై చేసిన ఋణ బిల్లులో యున్న 47,46 ఫసలీ విషమ షరతు మా రైతులకుకడు అన్యాయము గాన వెంటనే పాత బకాయిరద్దు గావింపవలయును అని మదరాసు గవర్నమెంటువారిని యీ ముఠావారు కోరుచున్నారు.

11. 12. జలంత్రా పాడిగాము ప్రాజెక్టుకు, టవరుకొండ వారెప్పు రిజర్వు చేయరాదనియు, తలతంపర, మందసా, టెక్కలి, నందిగామ, తర్లాలలో ఋణసహాయచట్టములో గల విషమ షరతుల రద్దుచేయవలయుననియు, పేష్కసు కొరకు, జప్తు అధికారములు స్థానికాధికారులు చేసిన దుండగములను గర్హించుచు, టెక్కలి తాలూకాలో నీటి సరఫరా స్కీములు, యేర్పాటు చేయవలెనని ప్రభుత్వమును కోరుచు, పంట నష్టములకు 1348 ఫసలీకి రెమిషను యివ్వవలెననియు కోరుచు తీర్మానములను సభలో నుండి జయధ్వానములు చెలరేగుచుండ ఏకగ్రీవముగా ఆమోదింపబడెను.

సభాధ్యక్షులకును, ఉపన్యాసకులను అందరికిని వందనములర్పించుటతో సభ ముగినెను.

డిసెంబరు 29 వ తేదీన ఉత్తరవిశాఖజిల్లా రైతు ప్రచారకులు సమావేశమై, జనవరి శాసన సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టవలెనని తీర్మానించిరి.

* * *

చింతలపూడి.

జమిందారీ విచారణ కమిటీ రిపోర్టును గురించి జమిందారీ, మొఖాసా, ఈనాం, అగ్రహారీ రైతులలో ప్రచారంచేసి రిపోర్టును బలపర్చుటకున్నూ, అందుగల లోట్లను సూచించి ప్రభుత్వమునకు తెలుపుటకున్నూ, చింతలపూడి తాలూకా ప్రచారం చేయుటకు జిల్లా రైతు సంఘ కార్యదర్శి పేటేటి వెంకటరత్నంగారు, ఏలూరు తాలూకా రైతు సంఘ కార్యదర్శి గారపాటి సత్యనారాయణగారు యిచ్చటకు వచ్చిరి. వారితోకూడ చింతలపూడి తాలూకా

కాంగ్రెసు సంఘాధ్యక్షులు పులిపాటి శ్రీ రాములు, తాలూకా కాంగ్రెసు కార్యదర్శి ఘంటా నాగభూషణం, జిల్లా కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ్యులు అచ్చిరెడ్డి వెంకట ముత్యాలరావు, పురుషోత్తంగారలు కలిసి జనవరి 1 వ తేదీ ఉదయం యిచ్చటనుండి బయలుదేరి మల్లాయిగూడెం, కాంతం పాలెం, రేచెర్ల వగయిరా గ్రామాలకు పోయి ప్రకాశం పంతులుగారిచే ప్రకటింపబడిన రిపోర్టులోని విషయాలనుగూర్చి చెప్పి, రైతు సంఘమువారిచే సూచింపబడిన సూచనలతోసహా బిల్లు పెట్టించవలసినదనియు, ఈనాం అగ్రహారీ రైతులకుకూడా యీ బిల్లు వర్తించునట్లు చేయించమనియు, లేనిచో ప్రత్యేక బిల్లు ఈ బిల్లుతోపాటే జనవరి 20 వ తేదీన శాసన సభలో ప్రవేశ పెట్టించమనియూ వగయిరా ముఖ్య విషయాలనుగూర్చి తీర్మానములు గావించి మద్రాసు ప్రభుత్వమువారికి పంపించిరి. మల్లాయిగూడెంలో జరిగిన సభకు చీకటి భూషయ్యగారున్నూ, కాంతం పాలెం సభకు అచ్చిరెడ్డి సీతరామయ్యగారున్నూ, రేచర్లలో జరిగిన సభకు మిట్టపల్లి రామయ్యగారున్నూ అధ్యక్షులుగానుండి సభలను జరిపించిరి.

* * *

కృత్తివెన్ను.

కృష్ణాజిల్లా, బందరుతాలూకా కృత్తివెన్ను జమీలోచేరిన, పెదగొల్లపాలెం గ్రామంనుండి రైతులు యావన్మందీ యేకస్తులై ప్రకాశం కమిటీరిపోర్టును బలపర్చుచూ, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘమువారిచే సూచింపబడిన మార్పులతో బిల్లును రాబోవు అసెంబ్లీ సమావేశమందు ప్రవేశపెట్టి చట్టముగా చేయవలసినదిగానున్నూ కొలదిమంది జమీందార్లుచేయు అక్రమ అలజడికి జడియక, తమకు పూర్తిగా అండగా రైతుమొరను ఆలకించి చట్టమును చేయవలసినదిగానున్నూ, కోరుచు శ్రీ రివెన్యూశాఖామాత్యులకు అర్జీమూలముగా తెలియపర్చుకొనిరి.

* * *

ప్రకాశం రిపోర్టుకు కాశీపట్టణము రైతుల సపోర్టు.

నిన్నరాత్రి 8 గంటలకు కాశీపట్టణంలో ప్రకాశంగారి జమిందారీవిచారణకమిటీరిపోర్టును బలపర్చుటకు శ్రీయుత అల్లూరి సత్యనారాయణగారి అధ్యక్షతక్రింద గొప్ప బహిరంగసభ జరిగినది. శ్రీ సత్యనారాయణగారు ప్రకాశం రిపోర్టు జమీన్‌రైతుల కేవిధముగా మేలుచేయుచున్నది. దానికి యింకను కావలసిన మార్పులనుగురించి విపులముగా తెల్పిరి. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారు సూచించిన సూచనలు శాసనసభవారు ఆమోదించవలెనని తెల్పిరి. యీ రిపోర్టును జమీందారువారి ఏజెంట్లును కలసి ఏవిధముగా ఎదుర్కొనుచున్నది తెల్పిరి. యీబిల్లు ప్యాసు అగుటకు గల యావత్తు అడ్డంకులనువివరించిరి గవర్నరుకున్న ప్రత్యేకాధికారములను నిరసించిరి. ప్రజాభిప్రాయము బ్రహ్మాండమగు ఆందోళన చేసినగాని ఈఅడ్డంకు లన్నిటిని ఎదుర్కొనజాలమని హెచ్చరించిరి, కాంగ్రెసుయొక్క గౌరవ ప్రతిష్ఠలు ఈబిల్లును ప్యాసుచేయుంచుకొనుటలోనే ఆధారపడియుండునని తెల్పిరి. కాంగ్రెసును బలపర్చుటయే మన కర్తవ్యమనిరి. కాశీపట్టణ సమస్య యావద్భారతదేశములోను ఒకవిధముగా ప్రాముఖ్యము వహించినదనిరి. కాశీపట్టణం రైతు శ్రేయస్సుకొరకై జమీందారులతో ఘోరాడుచున్న రైతుసేవకులను దౌర్జన్య వాదులనియు కాంగ్రెసుశత్రువులనియు కొంతమంది కాంగ్రెసు నాయకులు దుష్ప్రచారం చేయుచుండుట ఎంతయు విచారకరమనిరి. ఇట్టి యావత్ కష్టములను దాటి మనసత్రమహక్కులను స్థాపించుకొనవలెనంటె రైతులందరు కట్టడిని నిలుపుకొనవలెనని హెచ్చరించిరి. జమీన్ రైతురక్షణమును రైతులందరు తమ శక్తిని ప్రదర్శించవలెననికోరిరి. ఈవిధముగా షుమారు రెండుగంటల కాలము శ్రీ సత్యనారాయణగారు గంభీరోపన్యాసానంతరం రైతులందరు ప్రకాశం రిపోర్టును బలపర్చు నినాదములుచేసిరి. కలిదిండి బంగారంగారు రైతుల కర్తవ్యమునుగూర్చి ఉపన్యసించినమీదట రాత్రి షుమారు 12 గంటలకు సభ జై జై ధ్యానములతోసభ ముగినెను.

ఈకాశీపట్టణమువున్న సర్కిల్ త్రిపుర కాంగ్రెసు మహాసభకు శ్రీ కలిదిండి బంగారం గారు అభ్యర్థిగా నిలచినారు, వీరికి పోటీగా శ్రీ రాజా కలిదిండి కుమార లక్ష్మీనృసింహ రాజా బహద్దూర్ గారును, గొట్టుముక్కల వెంకన్న M. L. A. గారును నిలచినారు. పోటీలు చాల తీవ్రముగా జరుగుచున్నవి. జయాపజయములు ఏమియు చెప్పజాలము.

(ఒకవిలేఖరి)

* * *

రామచంద్రపురం తాలూకా.

తాలూకా కాంగ్రెసు, రైతుసంఘముల సంయుక్త యాజమాన్యమున పైరక్షణ యాత్రవారు 28—12—'38 తేదీన చింతలూరులో బయలుదేరి గుమ్మిలేరు, నేలటూరు, నిడసనమెట్ట, పాలపోడు, మేడపాడు, చినద్వారపూడి, పందలపాక గ్రామములలో సంచారముచేసిరి. ఈ యాత్రలు తాలూకా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యులు 4గురు, తాలూకా కాంగ్రెసుకమిటీ ప్రెసిడెంటుగారు కలరు. ప్రతి గ్రామములోను సభజరిపి, జమీందారీ నివేదికను విపులముగా తెలియజెప్పుచున్నారు. పిమ్మట ప్రకాశంకమిటీ నివేదికను బలపర్చుచు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమువారి సవరణలతో వెంటనే చట్టము చేయవలెనని తీర్మానములు చేయుచున్నారు. ప్రతి గ్రామమునుండి విశేషముగ అర్జీలు పంపుకొనుచున్నారు.

* * *

మండపల్లి జమీన్ రైతు సభ.

17-12.38 రాత్రి పిఠాపురం స్టేటు మండపల్లి గ్రామంలో కామ్రేడ్ చింతం సత్యనారాయణరావు అధ్యక్షతనుపై సభ జరిగెను. సుమారు 300 మంది హాజరయిరి. జిల్లా రైతు సంఘ కార్యదర్శి కామ్రేడ్ పెన్మెత్స సూర్యనారాయణ, కామ్రేడ్ కొరపాటి పట్టాభిరామయ్యగార్లు జమిందారీ విచారణ సంఘ నివేదికను గురించి ఉపన్యసించిరి. ప్రకాశం కమిటీ రిపోర్టును బలపర్చుచు, ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘమువారి సవరణలతో వెంటనే చట్టము చేయవలెనని ప్రభుత్వమును కోరుతూ తీర్మానము చేయబడెను.

* * *

శ్రోత్రియందారి రైతులసభ.

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా దామవరం గ్రామంలో 2-1-1939 వ తేదీ సాయంత్రం దామవరం, అనంతవరం, నారాయణపురం, గ్రామాల శ్రోత్రియందారీరైతులు అన్నాబత్తిన యలమందయ్యగారి (కావలి తాలూకా రైతు సంఘ కార్యదర్శి) అధ్యక్షతను సమావేశమై, సభలో వి. శంకరయ్యగారు జమీందారీ విచారణ కమిటీ రిపోర్టును గురించి విపులంగా తెలియజేసిరి. శ్రోత్రియందారుల రైతులను పెట్టుచున్న యిబ్బందులను గురించి అధ్యక్షులు చెప్పిరి. అనాదినుండి అగ్రామాలకు చెందిన అడవులలో రైతులు తమ పశువులను, గొర్రెలను మేపుకొనుచుండగా యిప్పుడు శ్రోత్రియందార్లు ఏవిధంగా యీహక్కును అపహరించుచున్నారో; రైతులు తమ పట్టా పొలములోని చెట్లుకూడా కొట్టుకొనుటకు ఏవిధంగా అధికారం లేదో, సొంత కావుల్ క్రింద సాగుచేయు మెట్టకు గొర్రు 1కి రూ 4-0-0 వరకున్నూ, పైర్లవారీ శిస్తు గొర్రు 1కి రూ 5-0-0 వరకున్నూ, రయితులవద్ద ఏవిధంగా వసూలుచేయుచున్నారో యలమందగారు తెలియజేసిరి. తరువాత యీ క్రింది తీర్మానములు సభలో ఏకగ్రీవంగా ఆమోదించబడెను.

1. అనాదినుండి రైతు లనుభవించు అడవులలోని పచ్చికహక్కు ఈయబడేలాగు గవర్నమెంటు చేయవలెను.

2. పట్టాపొలములయందలి చెట్లపై రైతుకు పూర్తిహక్కు ఉండవలెను.

3. ములుమురేట్లు, పైర్లవారీశిస్తులు రద్దు చేయవలెను.

4. దగదర్తి చానల్‌నుండి రెండుమైళ్ళ కాలువ త్రవ్వించవలెనని మద్రాసుప్రభుత్వమును కోరడమైనది.

5. జమీందారీ రైతు విచారణ కమిటీవారు తమ నివేదికలో అగ్రహారం శ్రోత్రియందారీ రైతులను వదలివేయడం చాలా అన్యాయము గాన, వచ్చే బిల్లు వారికి కూడా అన్వయించులాగున చేయుటకున్నూ, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారు సూచించిన మార్పులు ఆక్టులో చేర్చుటకున్నూ మదరాసు మంత్రివర్గమును కోరుచూ తీర్మానించడమైనది.

* * *

ఇంకొల్లు.

1-1-39 వ తేదీని బాపట్లతాలూకా, యింకొల్లు గ్రామంలో సాయంత్రం 7 గంటలకు శ్రీ భట్రాజు హనుమంతరావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగినది. జిల్లా రైతుసంఘ కార్యదర్శి బావిన సుబ్బారావుగారు ఉపన్యసించుచూ, మదరాసు కాంగ్రెసు మంత్రివర్గంవారు ప్రజలకు చేయుచున్న సత్కార్యములను గురించి చెప్పిరి, అయినా ఎన్నికల ప్రణాళిక ప్రకారం వీరు తృప్తికరంగా పనిచేయకపోవడానికి కారణం రైతులు, కూలీలు తమకష్టాలను గుర్తించి తగిన ఆందోళన చేయకపోవడ మేననియు, ఆనేక సంవత్సరాలనుండి జమీందారీ హయాములో నలిగిపోయి అల్లాడుచున్న జమీన్‌రైతు తాత్కాలిక రక్షణకు తయారుచేయబడిన ప్రభుత్వవిచారణ కమిటీ వారి నివేదికను రైతులు బలపరచవలెననియూ, చెప్పిరి. పిమ్మట యీ క్రింది తీర్మానం సభవారిచేత ఆమోదించబడెను.

"విశేషశ్రమ కోర్చి, జమీందారీ విచారణ నివేదికను తయారు చేసిన రివెన్యూ మంత్రి శ్రీ ప్రకాశం పంతులుగారిని అభినందించుచూ, ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘంవారు సూచించిన సవరణలతో 20-1-39 వ తేదీని చిత్తు బిల్లు ప్రవేశపెట్టి చట్టంచేయుటకు మదరాసు కాంగ్రెస్ మంత్రివర్గంవారిని యీ సభవారు కోరుచున్నారు.

* * *

చిత్తూరు జిల్లా జమీన్ రైతు మహాసభ: గౌరవనీయులు రెవెన్యూ మంత్రి శ్రీ ప్రకాశం కమిటీవారి ఎస్టేట్సు ల్యాండ్సు ఆక్టు రిపోర్టుపై ఆలోచించి చర్చించి రైతుల అభిప్రాయమును గవర్నమెంటువారికి తెలియజేయుటకై చిత్తూరు జిల్లా జమీన్ రైతు మహాసభ రామకృష్ణమరాజుపేటలో 13-1-39 శుక్రవారం జరుగును.

కృష్ణాజిల్లా రైతు నాయకులును, సుప్రసిద్ధ రైతు సేవకులును, అయిన శ్రీ కామినేని వెంకటప్పయ్యగారు అధ్యక్షత వహింతురు.

* * *

పుత్తూరు తాలూకాలో ప్రచారము

29 తారీఖు తిరుపతినుండి శ్రీశ్రీనివాసవిఠల్ వి. శంకరయ్యగార్లు నేను బయలుదేరి సాయంత్రం 6 గంటలబండికి రేణిగుంట చేరితిమి. అచ్చట కరకంబాడు గ్రామ రైతులు ఇంకా ఇతర గ్రామ రయితులు వచ్చి మమ్ము కలుసుకున్నారు. మేము వారికి సభజరిపి, తీర్మానములు ప్రభుత్వమునకు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమునకు పంపమని విలాసములు వ్రాసి యిచ్చినాము. వాళ్లు చాలా కుతూహలంగా తీసుకొని "మాకు పన్నులబాధ జమీందార్ల బాధతొలిగితే మీరు చెప్పినట్లు చేస్తాం" అని అన్నారు. మీరంతా బాగా ఆందోళనచేయందే పన్నులబాధ తీరదని చెప్పాము. అచ్చటనుంచి కల్లూరు (2 మైళ్లు) వెళ్ళినాము. వూరినిండా రైతులు చాలా దీనులుగా పిల్ల పెద్దతోటి యున్నారు. మేము భజనమందిరముదగ్గర చేరినాము. రైతులందరు వచ్చినారు, ఆతురతతో "పన్నులు పొయ్యేచట్టం ఎప్పుడయ్యా మీరు చేసేది" అని అడిగారు పన్నులు సంపూర్తిగా పోవనియు, కొంతవరకుమాత్రం తగ్గుతుందనియు. అబిల్లు జనవరి 20 తారీఖు ప్రవేశపెట్టుదురనియు. కాని జమీందార్లవత్తిడికి "ఋణబాధనివారణచట్టం" మాదిరి అవుతుందని, మీరు సభజరిపి తీర్మానములు ప్రభుత్వమునకు తెలియజేయవలయుననియు, తెల్పితిమి. అచ్చటనుంచి పాదిరేడు, రాత్రికి చేరినాము 150 ఇండ్లు వున్నాయి. మేము వూరిలోకి ప్రవేశించక పూర్వమే పొలాల్లోనుంచి రైతులు పశు మోపులు వూర్లోకి తీసుకుపోతున్నారు. కొంతమంది పైరు కోస్తున్నారు. ఆ పైరు ఒక అడుగు నిడివిలో తెల్లగా యెండిపోయివుంది. పశువుల మేతకు ఉపయోగపరుస్తున్నారు పంట అంతా. ఆ రాత్రి అచ్చటనే యుండినాము. రైతులందరిని జేర్చి బిల్లు విషయము తెలియజేసినాము. వాళ్ళలో కొంతమంది "బిల్లు వచ్చే లోపల మేము చచ్చిపొయ్యేటట్లుంది. మాకు ఈ సంవత్సరం పంట సంపూర్తిగా పోయింది. చూచారు గదా మీ కళ్ళార మా గతి" అని చెప్పడం మొదలెట్టారు. ఆ గ్రామంనుంచి సం॥ మొత్తంమీద 6 వేల పన్నులు (రొక్కశిస్తు ధాన్యశిస్తు రెండు చేర్చి) క్రింద చెల్లిస్తార్లు ఆ గ్రామ ప్రొప్రయిటరుగారికి. గుంటకు 30 కుంచాలు చెల్లిస్తారు శిస్తు క్రింద కారుకు. పైరు పోయిందని ప్రొప్రయిటరుగారికి మొరపెట్టుకున్నారు. మరురోజు కదిరిమంగళం కెళ్ళాము. అచ్చటి రైతులతో బిల్లు విషయములు తెలియజేసినాము. వూడి, పుత్తూరు, నారాయణవరం, నగరి యివన్నియు చూచుకొని రాత్రి వేపగుంట చేరుకొన్నాము. మరురోజు కూడా చుట్టుప్రక్కల కొన్ని గ్రామాలు చూచుకొంటూ రాత్రి పుత్తూరు చేరి బస్సులో తిరుపతి చేరినాము. యొక్కడికెళ్ళినా జమీందారీ బాధలకు తోడుగా వర్షము లేక పంటలుపోయి రైతులు అల్లాడుతున్నారు. అసలీ సంవత్సరం సొదవునా వాళ్ళు యే విధంగా జీవించగలరో నాకు అర్థంకావటంలేదు. బిల్లుకు రైతులంతా రోజొక సంవత్సరంగా గడుపుతూ యీ జమీందారీ బారినుండి యెప్పుడు బయట పడి పోతామో దేవుడా! అని యెదురు చూస్తున్నారు. ఒక గ్రామములో మనుష్యులమయిన మా రక్తాన్ని తాగుతున్న జమీందారీ పద్ధతిని యెందుకు నిషేధించటానికి వెనుకంజ వేస్తున్నది అని అడిగారు. అంతే, వాళ్ళ బాధలు యేవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు

ఇట్లు,
ఆర్. నియంత్రణం

మద్రాసు ఎస్టేటుల్యాండ్ రివిన్యూ బిల్లు

[ప్రకాశం కమిటీ వారు ప్రకటించిన నివేదికలో ఒక చిత్తు బిల్లుకూడ యిచ్చారు. దాని సంగ్రహ రూపమే యిది. దీనిని మా పాఠకుల ఉపయోగార్థం ప్రకటించుచున్నాము.—సం.]

ఉద్దేశములు; కారణముల వివరణము.

పర్మనెంటు సెటిల్‌మెంటుకు పూర్వము భూమి శిస్తు ఎన్నడూ శాశ్వతముగా నిర్ణయింపబడలేదు. హిందూ మహమ్మదీయుల పరిపాలనా కాలములో జమిందార్ల కప్పములను హెచ్చుగా చేయుటకే ఆలోచనలు జరిగేవిగాని శిస్తు విధానమును నిర్ణయించే ఆలోచన ఉండేదికాదు. దాని వలన రైతులుగాని జమిందార్లుగాని బాగుపడే వారుగారు. అందుచే బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పడిన పిమ్మట యీ ఒడుదుడుకులను రూపుమాపి సుస్థిరత నెలకొల్పుటకై పర్మనెంటు సెటిల్‌మెంటును ఏర్పాటుచేసిరి. దానివల్ల రైతుకు భూమిపై హక్కున్నూ, జమిందారు ప్రభుత్వంకు చెల్లించవలసిన పేష్కసున్నూ, రైతునుండి వసూలుచేయు శిస్తున్నూ శాశ్వతంగా నిర్ణయించబడుటకు కొన్ని శాసనములు చేయబడెను. కాని జమిందార్లు పదే పదే శాసనముల నుల్లంఘించుచు రైతుల హక్కులను అరికట్టుచు, శిస్తులను విపరీతంగా జాస్తి చేస్తూ వచ్చిరి. కోర్టులున్నూ తప్పుడు తీర్పులు యిస్తూ వచ్చినవి. క్రమేణా, పిమ్మట చేయబడిన చట్టములలో ద్వంద్వార్థముల నిచ్చినట్టిన్ని బ్రిటిషు సాంప్రదాయముల ననుసరించునట్టిన్ని షరతులు జేర్చ బడుటచే రైతులకు విశేషమైన అన్యాయము కల్గినది. కాని మద్రాసు ప్రభుత్వం తిర్గి రైతు జమిందార్ల హక్కులను స్పష్టీకరిస్తూ పూర్వపు శాసనముల కనుగుణ్యంగా చట్టమునుచేసి భూమికి రైతే యజమాని అనియు, భూమి శిస్తు పేష్కసువలెనే శాశ్వతముగా నిర్ణయింపబడ్డదనియు నిర్ధారణచేయుటకు పూనుకొన్నది.

మద్రాసు ఎస్టేట్సు లాండు రివెన్యూబిల్లు 1938

రిపోర్టుతోబాటు ముందు శాసనసభలో ప్రవేశపెట్టబోవు బిల్లును సూచించుటకై ఒక చిత్తు చట్టము ప్రకటించబడినది. అచిత్తు చట్టము ఈక్రింది సెక్షన్లను కల్గియున్నది.

1—3 సెక్షన్లు. పేరునుగూర్చి పరిమితిని గూర్చి పదముల నిర్వచనాన్నిగూర్చి యున్నవి.

ఎస్టేటు అనగా శాశ్వతంగా సెటిల్ చేయబడిన జమిందారీలు, జాగీర్లు మిట్టాలు, పాళియములు, శెటిల్‌కాబడని పాళియములు, జాగీర్లు, పర్మనెంటు సెటిల్మెంటు కాలంలో ఎస్టేటు ఆస్థిలో లెక్కింపబడ్డ ఈనాములు, శ్రోత్రియములు.

'భూమిశిస్తు' అనగా భూమితో సంబంధం లేకుండా చెట్ల ఉపయోగానికై చెల్లించుపన్ను, నీటితీరువా, చట్టరీత్యా చెల్లించ వలసిన ఇతర పన్నులు మున్నగునవి కలిసిన శాశ్వతంగా నిర్ణయింపబడ్డ శిస్తు

'లాండు హోల్డ'రనగా ఎస్టేటును గలవాడు, ఎక్కువ నుంది భాగస్థులున్నచో సీనియర్ ప్రొప్రయిటరు.



మన రివిన్యూ మంత్రి

'రైతు' అనగా భూమిపై శిస్తు చెల్లించు వ్యక్తి.

'లాండు లార్డు' అనగా స్వంత కమతంగల లాండు హోల్డరు

'టెనెన్టు' అనగా స్వంత కమతాలలోని కవులుదారు

'రెంటు' అనగా కవులుదారు లాండు హోల్డరుకు చెల్లించే మొత్తం

4—5 సెక్షన్లు, మామూలు హక్కులు, జిరాయితీ హక్కు కవులుదార్లతో రైతుల లాండు హోల్డర్ల సంబంధము

రైతు స్వాధీనంలోఉన్న సాగుకు లాయఖగు భూమి యావత్తుపైన శిస్తు వసూలు చేయవచ్చును

శిస్తుకై భూమి, భూమిపై ఉండే కట్టడాలు, పంట వగైరాలపై ప్రధమ ఛార్జీ హక్కు జమిందారున కున్నది

భూమి అభివృద్ధి పర్చుకొన్నను శిస్తు జాస్తికాబడదు.

కొత్తసాగులకు పాతసాగుల శిస్తు రేట్లనే విధించాలి.

సాముదాయక భూములన్నీ ప్రజలు ఉపయోగించుకోవచ్చు. సర్వే జేయునపుడు వాటిని ప్రత్యేకించి నమోదుచేయాలి

ఇతర విధములుగా సాముదాయక భూముల ఉపయోగం చేసుకోదలచిన రైతులకు లాండు హోల్డరు అనుమతి ఉండాలి

సాగుకుపయోగపడే జలాధారాలను జమిందారు సంరక్షించుచుండాలి జాస్తి శిస్తులను కోరకుండా కొత్త జలాధారాలను కూడా విధిగా నిర్మించాలి.

స్వల్ప మరమ్మతులకు రైతులు 'కుడి మరమ్మతు' (ఆచారసిద్ధమైన పని సహాయము) చేయాలి.

1882 ఫారెస్టు అక్టుకులోబడి అడవులలోని భూమిపై రైతులకు భూస్వామ్య మున్నది. పశువులను మేపుకొనుట, ఎరువును తెచ్చికొనుట, గృహ, వ్యవసాయోపయోగములకై కట్టి, కలప వగైరా తెచ్చుకొనుటకు రైతుకు హక్కున్నది. జమిందారుకు అడవులపై ఏలాటి హక్కు లేదు.

కవులుదార్లకు, మినహాయింపు ఈనాములకు, దర్మిలా ఈనాములకు ఈచట్టము వర్తించదు

7—13 సెక్షన్లు

తన భూమిలోనున్న చెట్లపై సంపూర్ణాధికారము రైతుకున్నది. భూమిశిస్తును రైతు చెల్లించుచుండాలి. భూమిశిస్తురేటు హెచ్చు చేయబడకూడదు. భూమిపై దాన విక్రయాద్యధికారములు రైతుకున్నవి. ఒకే భూమిలో జిరాయితీ, మేల్వారం హక్కులు రెండున్నూ ల్యాండుహోల్డరుకు సంక్రమించినప్పుడు జిరాయితీ హక్కు రద్దు అగును.

ఇజారాదారుకు జిరాయితీ హక్కు లేదు.

14—15 సెక్షన్లు-కవులుదార్లు :

కవులు-కదపాలున్న. కవులుకాలము అంతమగునంతవరకు కౌలుదారును భూమినుండి వెళ్ళకొట్టగూడదు. అట్టి ఖరారునామా లేనిచో మరుసటి రెవిన్యూ సంవత్సరాంతము వరకు వెళ్ళకొట్టకూడదు

16—30 సెక్షన్లు

భూమిశిస్తు, రశీదులు, భూమిశిస్తు భూమిశిస్తు కుదువ ము॥

పర్మనెంటుగా సెటిల్‌మెంటుకు యొక సంవత్సరం పూర్వపు రేట్లే శాశ్వతం ఖాయపర్చబడినవి.

కొత్తసాగులపైకూడా అవే రేట్లు విధించాలి.

పర్మనెంటు సెటిల్మెంటు దర్మిలా హెచ్చు చేయబడిన శిస్తులు అక్రమము కాన తీసివేయదమైనది.

గ్రామ లెక్కలనుబట్టి పర్మనెంటు శిస్తులను తెలుసుకోవాలి. లేదా అప్పటి జుమ్మాను సర్వే లెక్కలనుబట్టి విభజించి, వచ్చిన మొత్తాన్ని నగదులోకి మార్చాలి. లేదా సేరీ భూములపై చెల్లబడే శిస్తుల నవలంభించాలి. లేదా ప్రక్కనున్న ఎస్టేట్లు లేదా జిల్లాలలో ఏ యితర ఎస్టేటు లేదా ప్రక్కనున్న జిల్లాలోని పర్మనెంటు సెటిల్‌మెంటునాటి రేటును అనుసరించాలి. ఇవేమీ దొరకనిచో ప్రత్యేకంగా యిందుకొరకైయేర్పరచిన, కమీషన్ ఉచితమనితోచిన రేటును విధించవచ్చు.

అక్టుప్యాసయిన 6 నెలలలో జమిందార్లు, రైతులు పట్టా, ముచ్చిలికాలను మార్చుకోవాలి.

రైతులు నాణెములలోనే శిస్తులను చెల్లించాలి. తుపాను, వరదలవగైరా అవాంతరములచే పంటలు పోయినప్పుడు రిమీషన్లు ఇవ్వబడునట్లు నిర్ణయించవలెను. శిస్తు చెల్లించనిచో రైతు ఆస్థి జవాబుదారీగా ఉండగలదు.

రైతు శిస్తు చెల్లించనిచో ప్రథమంలో చరాస్థి పిమ్మట భూములు జప్తు చేయబడును.

పట్టాలో లేని వసూళ్ల క్రమ వసూళ్లక్రింద జమకట్టబడి, రెండింతలు జుల్మానా ఇప్పించబడును.

రైతుకు భూమి ప్రధాన విక్రయాద్యాధికారములున్నవి.

ఆసరాపద్ధతి (ధాన్యపు రేటు) ఉన్నచోట్ల వివిధరకాల ధాన్యంకు ఎంతభాగమెవరిదో స్పష్టంగా పట్టాలో వ్రాయాలి.

ధాన్యపు రేట్లను నగదులోనికి మార్చునప్పుడు పర్మనెంటుసెటిల్మెంటునాటి ధరలను బట్టియే నిర్ణయించాలి.

కరువు మొదలగు కాలములలో పేష్కసు చెల్లించుటకు ప్రభుత్వం గడువిచ్చినట్లయిన అదే విధముగా శిస్తీలకు రైతులకున్ను జమిందారు గడువు ఇవ్వాలి.

శిస్తు బకాయిలపై నూటికి సం॥నకు బారు వడ్డీ 6-4-0 రైతు తను ఏకిస్తీకి ఏ భూమి క్రింద శిస్తు చెల్లిస్తున్నాదో అట్లనే రశీదు పొందుటకర్హుడు.

అన్ని వివరాలు రశీదులలో లేనిచో, శిస్తు పూరా పరిష్కారము క్రిందనే ఎంచబడును.

శిస్తు వసూళ్ళకై జమిందారు తన ఏజంటును నియమించనిచో, గ్రామ మున్సబే శిస్తు వసూలుచేసి రశీదులిచ్చుటకు అధికారి.

లాండు హోల్డరు శిస్తు తీసుకొనుటకు నిరాకరించినా, కాక రశీదులిచ్చుటకు నిరాకరించునని తోచినా, లేక జాయింటు లాండు హోల్డర్లనుండి జాయంటు రశీదు పొందజాలనిచో రైతు కలెక్టరువద్ద శిస్తును కుదువబెట్టవచ్చును.

ఆ సరా పద్ధతిని శిస్తు చెల్లించునపుడు తగాదా వచ్చినచో కలెక్టరు ఒక ఉద్యోగి ద్వారా పంపకము చేయవచ్చును.

31—40 సెక్షన్లు భూమి శిస్తు వసూళ్ళు.

పట్టా ముచ్చిలికాలు పరస్పరం మార్చుకోబడనిచే శిస్తు వసూలు చేయబడరాదు.

పట్టాలలో రైతు-జమిందారు పేర్లు, భూమి విస్తీర్ణము, వర్ణన, శిస్తురేటు, మొత్తము, స్వభావము, ఇతర పన్నులు, కిస్తీలు, మొదలగు వాటిని వ్రాయాలి, ముచ్చిలికాలు పట్టాలవలెనేగాని, లేక పట్టా షరతులకు అంగీకారమనే ఖరారునామాగాగాని ఉండవలెను. జమిందారు పట్టా నివ్వనిచో కలెక్టరుకు పిటీషనుపెట్టి తెప్పించుకొనవచ్చును.

41—72 సెక్షను శిస్తు బకాయీలకై చరాస్థి జప్తు, వేలాలు

రెవిన్యూ సంవత్సరంలోగా శిస్తు వసూలుకానిచో కలెక్టరు ద్వారా జమిందారు రైతు చరాస్థిని జప్తు చేయవచ్చును. బకాయీ మొత్తమునకు సరిపోవు చరాస్థి వున్నంతవరకు వ్యవసాయపు పనిముట్లు, పశువులు, విత్తనములను జప్తుచేయరాదు.

శాంతికి భంగము కల్గునని తోచినచో పోలీసుల సహాయాన్ని జమిందారు పొందవచ్చును

శిస్తు బకాయీకి దాదాపు సరిపోవు నంతకన్న ఎక్కువ విలువగల చరాస్థిని జప్తు చేయరాదు

జప్తు చేయబడిన నెల రోజులలోగా రైతు కోర్టులో దావావేయనిచో జమిందారు 15 రోజులలో వేలమునకు పిటీషను పెట్టుకోవచ్చు. 7 రోజుల నోటీసుతో వేలం ఆఫీసరు ఆ ఆస్థిని వేలము వేయవచ్చును

73—83 సెక్షన్లు శిస్తు బకాయీలకై భూమి జప్తువేలం

శిస్తు బకాయి ఒక సంవత్సరం నిల్వ వున్నయెడల భూమి నంతనుగాని. కొంత భాగమునుగాని జప్తుచేసి వేలమువేసి రాబట్టుకొన వచ్చును

వేలము పూర్తియగులోగా రైతుగాని, కౌలుదారుగాని బకాయి మొత్తాన్ని, ఖర్చులతోసహా చెల్లించి భూమిని విడుదల పెట్టించు కొనవచ్చును. కౌలుదారు ఆమొత్తాన్ని కట్టుబడినుండి తగ్గించుకోవచ్చును

వేలం అనంతరం ఒక నెలలోగా రైతు బకాయి మొత్తాన్ని, ఖర్చులను, వేలం పాటమొత్తాన్ని, అందుపై 5% వడ్డీతోసహా కలెక్టరువద్ద కుదువపెట్టి వేలాన్ని రద్దు చేయించుకొనవచ్చును

వేలంలో భూముని జమిందారుకూడా పాడుకోవచ్చును.

84—93 సెక్షన్లు జలాధారముల మరమ్మతులు

రైతులు జలాధారముల మరమ్మతులుకోరుచు కలెక్టరుకు పిటీషను పెట్టుకోవాలి. కలెక్టరు విచారించిన పిమ్మట జమిందారును మరమ్మతు చేయించుటకై కోరుచు లేదా రైతులే మరమ్మతుచేసినచో కలెక్టరు ఆ జలాధారము క్రింద సాగయ్యే భూముల రైతులనుండి శిస్తులతోబాటు మరమ్మతు ఖర్చులుకూడా వసూలుచేసి మరమ్మతుచేసిన రైతులకీయాలి. డబ్బు యేరైతుల వలన వసూలు చేయబడినదో ఆ రైతులకు వసూలుదార్లవల్ల వసూలు మొత్తమునకు రశీదులివ్వాలి. జమిందారు యీ రశీదులను ఆ సంవత్సరం రైతులు చెల్లించవలసిన శిస్తు రశీదులుగా పరిగణించాలి. లేదా కలెక్టరే స్వయంగా మరమ్మతు చేయించి, ఖర్చులను జమిందారు నుండి రాబట్టుకోవాలి. రైతులకు మరమ్మతులను మాత్రం ఉచితంగా చేయాలి.

94 సెక్షను అక్రమ వసూళ్లు.

పట్టాలోజేర్చిన శిస్తుమొత్తముకన్న జాస్తివసూలుచేసినచో ఆ అక్రమవసూలుకు (6రెట్లు జమీందారునుండి) రైతు దావావేసి రాబట్టుకొనవచ్చును.

95 వ సెక్షను - ఇండ్లుకట్టుకొనుట వగైరాలకు భూమిని వినియోగించుట.

ఎస్టేటుయొక్క అభివృద్ధి కొరకై జమీందారు కట్టడములను కట్టించుటకై రైతు భూమిని కొనదలచినచో ఆ భూమిని 100 కి 115 చొ॥ కిమ్మతు ఇచ్చి కొనవచ్చును.

96 వ సెక్షను భూమిని త్యజించుట.

రైతు ఆ రివిన్యూ సంవత్సరంలో తమలో ఎప్పుడైనను భూమిని వదులుకొనవచ్చును.

97—103 సెక్షన్లు సబ్‌డివిజను పరాధీనము చేయుట.

భూములను సబ్ డివిజను చేయవలసివచ్చినప్పుడు జమిందారీ పట్టాదారులందరితో ప్రత్యేకంగా ఒడంబడికలు చేసుకోవాలి. పరాధీనము చేయబడిన భూములను కూడా నోటీసులివ్వబడినచో జమిందారు అంగీకరించాలి.

కౌలుదారు సంవత్సరాంతమున బకాయిపడియున్నచో, ఆ అవరణలో జప్తుకు తగినంత ఆస్థిలేనిచో, కలెక్టరు అనుమతితో జమిందారు కౌలుదారును భూమినుండి వెడలగొట్టవచ్చును, కౌలుదారు ఒకనెలదాలోగా దావా తేవచ్చును.

105—115 సెక్షన్లు సర్వే హక్కుల ప్రమాణ గ్రంధము, భూమిశిస్తు నిర్ణయము.

ప్రభుత్వము తానేగాని, లేక రైతులుగాని, జమిందారుగాని ప్రభుత్వము నిర్ణయించిన మొత్తమును డిపాజిటుచేసి కోరినచో, సర్వేచేయించి, హక్కుల ప్రమాణ గ్రంధమును తయారుచేయించవచ్చును.

భూమి శిస్తు నిర్ణయములో తగాదా వచ్చిన స్పెషల్ ఆఫీసరే న్యాయమైన శిస్తును నిర్ణయించును.

ఈ విషయములలో అప్పీళ్ళను విచారించుటకై స్పెషలు కలెక్టర్లు నియమించబడుదురు.

సర్వే సెటిల్‌మెంట్ల విషయంలో అగు ఖర్చులు రైతులు, జమిందారు భరించవలెను.

116—120 సెక్షన్లు జమిందార్ల స్వంత కమతాలు నిర్ణయము.

స్వంత కమతాలలో కౌలుదార్లకు జిరాయతీ హక్కు లేదు. 12 సం॥ల నుండి వరుసగా స్వంతంగా వ్యవసాయం చేయించుకొను భూములే స్వంత కమతాలు. వీటిని నిర్ణయించుటకు కలెక్టరు అనుమతి పొందిన ఉద్యోగి అధికారము కలిగియుండును.

121—160 సెక్షన్లు.

అధికార పరిమితి, విధానము, ఒడంబడిక, ఆధారము, కులదోషము, జరిమానాలు, శిక్షలు మొదలగునవి.

రివిన్యూ కోర్టు, కలెక్టరు, బోర్డు ఆఫ్ రివిన్యూ కేసులు ఒక దానిపైనొకటి అధికార సంస్థలు. ఆఖరు అధికారము "బోర్డు ఆఫ్ రివిన్యూ కేసులు" అనబడు స్పెషల్ ట్రిబ్యునలు వాది, ప్రతి వాదులు ఈ ఆక్టు క్రింద రైతుల హక్కులను ఏ ఒడంబడికలున్ను భంగపర్చలేవు.

ప్రభుత్వమప్పుడప్పుడు ఆక్టును స్పష్టీకరించుటకు నిబంధనలను జారీ చేయవచ్చును.

★ కథ

కిస్తీలు

కామ్రేడ్ కొసరాజు శేషయ్య

మధ్యాహ్నం పన్నెండు గంటలు అవుతుంది. మావారు భోంచేసి కచ్చేరికి వెళ్ళేరు. నేను వాకిట్లో కందులు యెండబెట్టి అరుగుమీద కూచుని రామాయణం చదువుతూన్నాను. బజారులో దణధణామంటూ టముకు వినిపించింది. పదోతారీఖు లోపల కిస్తీ కట్టకపోతే ఆస్తులు జప్తుచేసి షట్టా 13 అయిదు రూపాయిలెక్కువ వసూలు చేస్తారోహోయ్ అని కేకపెట్టి పోయాడు దివాణపు వెట్టి. ఉయ్యాలలోవున్న పసివాడు యేడుస్తూంటే వాణ్ణి తీసికొనిపాలిస్తూ అరుగుమీద కూర్చున్నాను. పొరుగింటి రత్తమ్మ వస్తూనే వడిలోవున్న పండు మెరపకాయలు అరుగుమీద పోసి అన్నపూర్ణమ్మగారూ యిప్పుడే కూరలకు కరవు వచ్చిందండీ యికముందు యెల్లా గడుస్తుందో అన్నది. సకలమూ పండించే రైతులు మీరే అల్లా అంటే మేమేమి కావాలి అన్నాను నేను.

తరువాత కొంతసేపటికి పెదకాపు తల్లి మంగమ్మ, వారి బంధువు చుక్కమ్మ మరికొందరూ వచ్చేరు. నేను లేచి అరుగుమీద చాపవేస్తూ కూర్చోండి మంగమ్మ పిన్నీ యేదో పనిమీద వచ్చినట్టున్నారన్నాను. మాటల ధోరణిలో పిల్లలేరీ అమ్మాయిగారూ అని అడిగితే మా పెద్దఅబ్బాయిని పుట్టింటికి పంపించాననీ, మా అమ్మాయి సుశీల స్కూలునుండి యింకా రాలేదనీ చెప్పేను.

పెదకాపు తల్లి మంగమ్మ యిల్లా చెప్పింది. "అన్నపూర్ణమ్మగారూ నామాట కొంచెం ఆలకించండీ. కరణంగారున్నారేమో చెపుదామని వచ్చేను. మా అబ్బాయి మంచానపడి యిప్పటికి నెలపైగా అయింది. కాని యీరోజుకూడా రోగం యేమీ తిరుగుమొఖం కాలేదు. యీ కిస్తీ యెద్దడికూడా యిప్పుడే వచ్చిపడింది. మొన్నపోయిన కిస్తీకి మూడేళ్ళనాటివి జొన్నలుంటే కోమటి వెంకన్నకు కొలిచి ఆ రెండువందల రూపాయలతో అది యెల్లమార్చేను. ఇక యీరెండు సంవత్సరాల నుంచీ వానలులేక గిద్దెడు గింజలు రైలు లేదుగదా! మా యిల్లు జరగడమే కష్టంగావుంది. ఇక జీతగాళ్ళ సంగతి యేమనిచెప్పాలి. గొడ్లకున్న మేతకాస్తా అయిపోవచ్చింది. ఇంట్లో రోగి, యేమి చేయుడానికి ఆలోచన పోవడంలేదు" అంటూ కళ్ళవెంట బొటబొటా నీరు కార్చింది.

"అయ్యో మంగమ్మ పిన్నీ పెద్దదానవు నీవు అల్లా అనుకోవడం ధర్మంగాదు. మీకేం మహారాజులు. యీ కష్టాలు కలకాలముండవు గదా. నీవేమీ అధైర్యపడక మంచి వైద్యుణ్ణిచూచి ఔషధం యిప్పించండి జబ్బు నెమ్మదించక యేమి చేస్తుందండీ అని నేనంటే ఆమె తిరిగి యిల్లా అంది

"యేమో అమ్మాయిగారు వాడుగాదని వీడూ వీడుగాదని యింకొకడు యిప్పటి కప్పుడే నలుగురు వైద్యులయ్యేరు. ఆ పాడు దేవుడు నాకాయుష్షు ఎక్కువ జేశాడు. యే కష్టము చూడకుండా మహరాజు గనుక ముందుగానే పోయారాయన యింకా యే కష్టాలు చూడడానికో దరిద్రపుగొట్టుదాన్ని నేనే మిగిలివున్నాను" అని పాపం ఆవిడ అదే పనిగా ఏడిచేసింది.

ఆ ప్రక్కనే కూర్చున్న చుక్కమ్మ పమిట కొంగుతో కళ్లు తుడుచుకుంటూ యిలా అంది. "అయ్యో మంగమ్మ అత్తా నీవే ఇలా అంటే యే మగదిక్కూలేని నేనెవరితో చెప్పాలి. వుండటానిక్కూ చెరువుక్రింద పొలమే యిరవై యెకరాలుంది. అయితే యేం లాభం, ఒకయేడు పండితే పదేళ్లు సున్నా. యేటా రెండువందలు కాడికి వట్టి గడ్డలకే శిస్తు కడుతున్నాగదా. రెండేళ్ళనాడు అత్తవారింటికి పంపిన మా పెద్దమ్మాయిని యింతవరకు తిరిగి తీసుకురాలేకపోయాను. మూడేళ్ళ క్రితం యీడేరి యింటపడివున్న చిన్నమ్మాయికి పెండ్లి చేయలేక పోయాను. సరిగా ఆ వంటిమీద వున్న నగలు కాసినీ యేటా మార్చి యీ కిస్తీలు కడుతున్నాను. పండినా ఎండినా పన్ను తప్పదయ్యే."

ఇదంతా ఆలకిస్తూ కూర్చున్న రత్తమ్మ చేతులు తిప్పుతూ యిలా అంది "యేమో నమ్మలారా మీరింకా కలిగినవాళ్ళు కాబట్టి వున్నవేవో మార్చి కిస్తీలయినా కట్టగలుగుతున్నారు. యేమీ లేని మాబోటివాళ్ళ గతేమిటి ఆ వున్న రెండెకరాలకూ యేటా యిరవై రూపాయలు చేతులారా పొయ్యాల్సిందేగదా. మొన్న పోయిన కిస్తీకి మా ఆయన పాడిబర్రె నమ్ముతానంటే పిల్లలు వుసూరుమంటారని నా మెడలోవున్న సూత్రం కాస్తా అమ్మి యిచ్చేను. ఇంకా నామాట వట్టిదేమో చూడండి అంటూ ఆవిడ తన మెడలోవున్న వట్టితాడు తీసి చూపెట్టింది.

మేమందరము తెల్లపోయిచూచేము. యెవ్వరి నోటివెంట మాటలేదు. ఆ రత్తమ్మ యింకా యీవిధంగా అంది. యీసారి కిస్తీకట్టేందుకు మాయింట్లో చిల్లిగవ్వకూడా లేదు. యేమైనా సరే పాడిబర్రెను మాత్రం జప్తుచేయనివ్వను. కావలస్తే వాళ్ళభూమే జప్తు చేసుకుంటారు. వక్క యేదైనా చెరువు మరమ్మతు చేయించి కాలువలు త్రవ్వించకపోతే నీళ్ళు యెక్కడనుంచి వస్తాయి. పంట ఎలాపండుతాయి. ఇక్కడకూర్చుని వట్టి గడ్డలకే పన్ను కట్టలేము. యీవూరుకాకపోతే యింకోవూరు అవుతుంది. ఇది ముమ్మాటికీ నిజం."

తరువాత కొంతసేపటికి అందరూ లేచి వెళ్ళిపోయారు. మంగమ్మ వెడుతూ మళ్ళీ యీవిధంగా చెప్పింది. "యేమో అన్నపూర్ణమ్మతల్లీ యీ యేటికి మిగిలిన కిస్తీలు మేము కట్టలేమని నేను చెప్పేనని కరణంగారిని దొరగారితో చెప్పమను. నేనుపోయి దొరగారితో చెప్పుదునుగాని యీ రోజువరకు ఆదివాణంలో అడుగుపెట్టి యెరుగను. యింత వయస్సువచ్చి యిప్పుడెల్లా పోదునా అని చూస్తున్నాను."

ఆరోజున కాశీ విశ్వవిద్యాలయంలో చదువుతూన్న మా తమ్ముడు వాసు, సెలవులకు యింటికివచ్చాడు. కొంచెంసేపు మాట్లాడిన తర్వాత మా సుశీలను తీసుకొని కచేరీలోవున్న బావగారి దగ్గరకు వెళ్ళేడు.

పెందలాడే మడికట్టుకుని వంట చేస్తున్నాను. చీకటి పడకముందే అందరు యింటికి వచ్చేరు. మావారు లోపలికివస్తూనే యేమేవ్ తమ్ముడు వచ్చాడుగదా! యేమి వంట చేస్తున్నావు అన్నారు.

ఏమిచేస్తేమాత్రం వాడొక్కడే తింటాడా! మీరు మానేస్తారా అని నేనన్నాను.

భోజనాలయిన తరువాత బావమరదులిద్దరు వేసుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. నేను త్వరగా భోంచేసి సామాను సర్ది గుక్కపెట్టి యేడుస్తూన్న పసివాడ్ని తీసికొని వారిదగ్గర కెళ్ళి కూచున్నాను. మావాసు పసివాడ్ని చూస్తూ "అక్కాయ్ పెద్దవాడికంటే వీడే బాగున్నాడే" అన్నాడు. అవును వాడివి మీబావగారి పోలికలు వీడివి అచ్చంగా మనపోలికలే అంటూ చిట్టిబాబును ముద్దుపెట్టుకున్నాను.

మధ్యాహ్నం జరిగిన విషయాలన్నీ వారికి పూసగుచ్చినట్టుగా చెప్పేను. వాసు మధ్యమధ్య యేమో అడుగుతూ వచ్చాడు. వారేమీ మాట్లాడలేదు. తరువాత వారిని వుద్దేసించి యేమండీ రెండు సంవత్సరాలనుండి పంటలు లేక రైతులు కిస్తీలు కట్టలేక పోతున్నారుగదా మీరు జమీందారుగారితో మాట్లాడి యీ సంవత్సరం మిగిలిన కిస్తీలు ఆపుచేయించేందుకేమీ అవకాశం లేదా అని అడిగాను.

వారు ఇలా అన్నారు: "అవును పంటలుపండక రైతులు పడే అవస్థలు జమీందారుగారికి తెలియకపోలేదు. అయినా వారు మాత్రం యేమి చేయగలరు. యీ సంవత్సరం వారి దివాణములో జరిగిన వివాహాలకు. విందులకు అరవై వేల రూపాయిలకు పైగా ఖర్చయ్యే. మొన్న క్రిష్టమస్ పండుగకు వారి కుటుంబము మద్రాసు పోయివస్తే పదివేలయ్యాయి. కొడుకుల చదువులకు పాతికవేలకు తక్కువ కావు. ప్రభుత్వానికి చెల్లించవలసిన పేష్కస్ తప్పదు. యిక దివాణపు ఖర్చులకు. వుద్యోగస్తులకు, జమాస్లకు, దాసీలకు కనీసం రెండు లక్షలయినా కావాలి. కాబట్టి, నయానో భయానో యీ కిస్తీలన్నీ వసూలు చేయక తప్పదు.

ఇదెక్కడి న్యాయం బావా! పంటలు లేని సంవత్సరం ప్రభుత్వమునయితం శిస్తు రెమిషన్లు యిస్తున్నారుగదా అలాంటప్పుడు జమీందారు మాత్రము ఎందుకు ఇవ్వడూ? అన్నాడు వాసు.

అబ్బే ఆ రెమిషన్లపద్ధతి యిప్పటివరకు మా యెస్టేటులో లేనేలేదు. నాలుగైదు సంవత్సరాలు వరుసనే పండకపోయినప్పటికీ శిస్తుబాకీ క్రింద నోట్లు వ్రాయించుకొని తరువాత వసూలు చేయడం మామూలు అన్నారు వీరు.

అల్లా అయితే యిదొక పెద్ద సమస్యే. ప్రజలింకా యింత అమాయకులుగా వున్నారంటే చాలా విచార పడవలసిన విషయం. పాపం యీరైతుల అమాయకత్వాన్ని ఆధారంగా చేసుకొనే భూములు పండినా పండకపోయినా మీ జమీందారు వాళ్ళను స్వేచ్ఛగా దోచుకోగలుగుతున్నాడు. నిజంగా రైతులలో యేమాత్రం వర్గచైతన్యం కలిగినా మీ జమీందారు ఆటలు సాగేవికావు అన్నాడు వాసు.

ఒరేయ్ వాసూ నీ సోషలిజం, కమ్యూనిజం యిక్కడి వాళ్ళకేమీ పట్టుబట్టవు. నీవు ఒకవేళ వాళ్ళ జోక్యమేమైనా కల్పించుకున్నా కొంచెం కూడా లాభంలేదు. పైగా కష్టాలుఅన్నారు వీరు

సోషలిజం, కమ్యూనిజం కాదుగాని బావా యదార్థమే మాట్లాడతాను. మీ జమిందారు ప్రతి సంవత్సరము యీ రైతులను పీడించి వసూలుచేసే మొత్తములో చెరువులు, కాలువలు మొదలైన నీటి వనరులకు యేమాత్రము ఖర్చుపెడుతున్నాడు. గ్రామాలకు కావలసిన స్కూళ్ళు, ఆస్పత్రులు, రోడ్లు, బావులు మొదలైనవాటికి ఎంత మినహాయిస్తున్నాడు. యీపై సౌకర్యాలన్నీ ప్రజలకు యేర్పాటుచేస్తే మీ జమిందారుగారిక్కీ విందులకు, గుర్రపు పందేలకు, బ్రాందీలకు డబ్బు చాలనిమాట వాస్తవం. మేము చెప్పేదేమంటే కష్టపడే ప్రతి వ్యక్తికి పొట్టనిండా తిండి, వంటినిండా బట్ట వుచితవిద్యా, వైద్యమూ మొదలైన సౌకర్యాలు కావాలని అల్లాచెపుతూ వాటికోరకు ప్రయత్నించడము సంఘానికి ప్రమాదమా? లేక వేలకొలది ప్రజలు అహర్నిశలుపడే శ్రమ ఫలితాన్ని దోచుకొని మీ జమిందారుబోటి వ్యక్తులు కొందరు వారి విలాసాలకు, భోగాలకు వినియోగించుకోవడము ప్రమాదమా? నీవు ఆలోచించి చెప్పు. అన్నాడు వాసు వాళ్ళ బావవైపు చూస్తూ.

వారేమీ మాట్లాడలేదు. వాసు చెప్పినమాటలు మొదట నాకంతగా అర్థము కాలేదుగాని ఆలోచించిన కొలదీ వాటిలో యెంతో యదార్థము అగుపించింది.

తరువాత నాలుగు రోజులవరకు మా వాసు అక్కడే వుండి రైతులకు జరుగుతూన్న అన్యాయాలు అక్రమాలు పిటీషన్లు వ్రాసి సంతకాలు చేయించి ప్రభుత్వానికి యితర ఆఫీసర్లకు పంపేడు.

కాని జప్తులు మాత్రం ఆగలేదు. ఒక రోజు ప్రొద్దుటే రత్తమ్మ రోచుతూ రొప్పుతూ వచ్చి తన భర్తను దివాణంలోకి పిలిచి రక్తం వచ్చేటట్టుగా వీపంతా పగలగొట్టేరనీ చాలమంది రైతులు అగుపించకుండా పారిపోతున్నారని చెప్పింది. ఒక రోజున మావారు కచేరికి వెళ్ళి వెంటనే తిరిగివచ్చి వుద్యోగంనుండి వెళ్లగొట్టేరని చెప్పేరు. తరువాత రెండు రోజులవరకు మళ్లా పిలుస్తారని ఆశతో వున్నాం. ఆ రోజు సాయంకాలం మా జీతగాడు వచ్చి పాడి ఆవును గేదెల్ని అన్నింటిని దివాణంలోకి తోలించుకు పోయారని చెప్పేడు. ఆ రాత్రి పాలుచాలక పసివాడు బోరుపెట్టి యేడ్చేడు. చేసేది లేక నేను యేడుస్తూ కూచున్నాను. ఆ దృశ్యం చూడలేకను కుంటాను, మావారు ఒక రాత్రికాడే కొందరు రైతులను తీసికొని ప్లీడరును సలహా అడిగి వస్తామని వెళ్ళారు.

ఒక రోజు మధ్యాహ్నం బజారులో గల్లంతుగా వుంటే బయటికి వచ్చి చూచేను. రైతులకున్న సర్వస్వమూ జప్తుచేశామని బళ్ళపైన కట్టి దివాణంలోకి తోలుకుపోయారు. ఎడ్లు, ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలు కోళ్ళతోసహా బజార్లు పట్టకుండా దివాణంలోకి పోయేయి.

చాకలి, మంగలి మా యింటికి రాకుండా మాన్పించారు. ఎవరయినా మాతో మాట్లాడినట్లు తెలిస్తే కొరడా దెబ్బలు తప్పవు. దీనికంతకు కారణం మా వాసు పెట్టించిన పిటీషన్లుట. మా వారు తీరికలేకుండా కోర్టులచుట్టూ తిరుగుతున్నారు. యీ విషయాలన్నీ మా వాసుకు వుత్తరంలో వ్రాశాను.

మా సుశీలకు వారం రోజులనుండి జ్వరం వస్తోంది. వైద్యులెవ్వరు వచ్చేందుకు భయపడ్డారు. ఆరోజున మావారు వూళ్ళోలేరు. వుదయము పది గంటలవుతుంది. పిల్ల ఆకలని యేడిస్తే మడికట్టుకొని తొందరగా వంట చేస్తున్నాను. కూర తరిగి తాలింపు గిన్నెలో వేశాను. యింటిమీది పెంకులు బరబరా జారినట్లున్నయి. చేతిలో గరిటెకాడ అక్కడవేసి బయటికివచ్చి చూచేను. యింటిమీద పదిమంది మనుష్యులు పెంకు పడదోస్తున్నారు. నా ప్రాణాలు పోయినట్లయి నిర్ఘాంతపోయి చూస్తున్నాను. ఆబోతులాగావుండే ఆజమిందారు బావమరది వంటయింట్లోకొచ్చి బయటికి వెళ్ళిపో యిల్లు పడగొట్టేస్తున్నామన్నాడు. లోపల పిల్లలయేడ్పు వినిపించి నాకు కొంచెం స్పృహవచ్చింది. పసివాడ్ని యెత్తుకొని జ్వరంతోవున్న పిల్లను చేతితో పుచ్చుకొని బయటికి వచ్చేను. మా పూర్వులు యేనాడుకట్టేరో ఆపెద్దలోగిలి కాసేపట్లో నేలమట్టముచేసి ఒక్క పుడకకూడా లేకుండాచేసేరు. అక్కడ జ్వరంతోను, ఆకలితోనూ బాధపడుతూన్న పిల్లన్నూ, పాలకొరకు యేడ్చే పసిబిడ్డను, ముందుంచుకొని ఆవేదనతోను, ఆవేశంతోనూ మావారి రాకకొరకు నిరీక్షిస్తున్నాను.

రాంపూరులో 19 మంది మరణించారు

పొలిటికల్ ఏజెంటు హత్య చేయబడ్డాడు

ఈవారం మన స్వదేశ సంస్థాన పోరాటాల చరిత్రలో ఒక 'విషాదకరమైన' సంఘటన జరిగింది. అది రాంపూరు సంస్థాన ప్రజల తిరుగుబాటు. ఈ తిరుగుబాటులో ఒరిస్సా సంస్థానాల పొలిటికల్ ఏజెంటు ఎ. జి. బజల్ గెట్టిగారు హత్య గావింపబడ్డాడు. దీనివలన చాల ప్రమాదకరమైన ఫలితాలు సంభవించ వచ్చునని కాంగ్రెసు నాయకులు కూడ భయపడుచున్నారు.

తిరుగుబాటుకు కారణం

రాంపూరుకు పరిసర గ్రామంలో ఒకచోట దొంగతనం జరిగిందట. అది కారణంగా తీసుకొని సంస్థాన ప్రభుత్వం ప్రజామండలి సభ్యులలో కొందరిని అరెస్టు చేసింది. ప్రజామండలి అక్రమ సంఘమని నిషేధించింది. వారి ఆఫీసు సెర్చిచేసి కొన్ని కాగితాలు తీసుకుపోయారు. ఈవార్త ప్రజలలో అసంతృప్తిని కలిగించింది. చుట్టుపట్ల గ్రామాలనుండి వేలకొలది ప్రజలు రాంపూరు జేరుకున్నారు. సంస్థానాన్ని ముట్టడించి ప్రజామండలి సభ్యులను విడుదల చేయవలసినదిగా గోలచేశారు. ఈవార్త సంస్థాన అధికారులు పొలిటికల్ ఏజెంటుకు తెలియజేశారు. ఆయనవచ్చి ప్రజలను వెడలిపొమ్మని హెచ్చరించాడు. ప్రజలు కదలలేదు. అంతట ఆయన తన రివాల్వరును ప్రయోగించాడు. 19 మంది వరకు చనిపోయారని తెలుస్తోంది. ప్రజలకు మరింత కోపం హెచ్చింది. ఏజెంటు బజల్‌గెట్టి పై తిరుగబడి కొట్టారు. గెట్టీ ప్రాణం రక్షించుకోడానికి ఒక గుడిశవద్దకు పోయాడు. కాని ఆగుడిశ తలుపు వేసివుంది. ఆగుడిసె వసారాలోనే ఆయన మరణించాడు.

ఈ వార్త తెలియగానే కటక్ నుండి ఆయుధ పోలీసు దళం రాంపూర్‌కు పంపబడింది. కలకత్తాలో నున్న 11—5 పంజాబు రెజిమెంటు కూడ రాంపూర్‌కు పంపబడింది. ప్రజలు చాలా భీతావహులై యున్నారు. తలుపులు తెరచుట లేదు. కొందరు సంస్థానం విడిచి పారిపోతున్నారు. పొలిటికల్ ఏజెంటు రివాల్వరుచే కాల్చి చంపబడినవారి శవాలు మరునాడువరకూ రోడ్డు మీదనే పడి వున్నాయి.

సంస్థాన చరిత్ర.

రాంపూరు ఒరిస్సాలో ఒక చిన్న సంస్థానం. ఇది తూర్పు సంస్థాన ఏజెన్సీ ప్రాంతాలకు చేరి వుంది. సంస్థాన విస్తీర్ణం అంతా 203 చదరపుమైళ్ళకు మించి లేదు. జన సంఖ్య 47,713. యేటా 77 వేల రూపాయల ఆదాయం వస్తుంది. దీనిలో బ్రిటిషుప్రభుత్వానికి చెల్లించవలసిన కప్పం 2 వేలు మాత్రమే.

నాయకుల ప్రకటనలు

మేజర్ బజల్ గెట్టీ హత్యను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు చాలమంది ప్రకటనలు చేశారు. నెహ్రూ "పరిస్థితులు ఎటువంటివిఅయినను సంస్థానాల స్వాతంత్ర్యోద్యమం శాంతియుతంగానే సాగాలి. ఉద్యమానికి భంగపాటు కలిగించే ఈ పని చేయడం చాలా ప్రమాదము" అన్నాడు. సుభాష్‌బోసు "ఈ దుర్ఘటనకు హేతువును తెలుసుకొనేందుకు సర్వవిధాల ప్రయత్నించడంతోపాటు ఇట్టి దౌర్జన్య కార్యాలు ఇక ముందు జరుగకుండా తగిన జాగ్రత వహించాలి. ప్రజాసమూహము అత్యాచారాన్ని చేసేందుకు వారిపై పోలీసులొనర్చిన కాల్పులే కారణమని తెలుస్తోంది. ఎంతటి కారణమైనా మన దేశములోని ప్రజోద్యమాలు దౌర్జన్యాన్ని పురిగొల్ప కూడదు" అని ప్రకటించాడు.

కర్తవ్యం.

బోస్ చెప్పినట్లు ఈ ప్రజా దౌర్జన్యానికి కారణమేమిటో తెలుసుకోడానికి న్యాయమైన విచారణ జరగాలి.

కాని దీనితోపాటు సంస్థానాలలో ప్రజాతంత్ర రాజ్యాన్ని కూడ నెలకొల్పకపోతే, ఇట్టి ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని మన స్వాతంత్ర్యోద్యమ చరిత్రను చూచినా స్పష్టమవుతుంది. చౌరిచౌరా హత్యలతో 1922 లో ఉద్యమము ఆపినా, దేశములో ఇట్టి ప్రమాదఘటనలు తప్పలేదు. 1923 లో కాకోరి కుట్రకేసు 1929లో లాహోరు కుట్రకేసులు, వైస్రాయి ట్రెయినును పడగొట్టడానికి జరిగిన ప్రయత్నాలు, బెంగాలులోని 1930-32 వ్యక్తిగత హింసా ఉద్యమము, చిట్టగాంగు ఆర్మరీ రెయిడ్, దీనికి తార్కాణాలు. గాంధిజీ 1930 లో చిట్టగాంగు రెయిడ్, ఇంకను అనేక స్థలాలలో హింసాకార్యాలు జరిగినా స్వాతంత్ర్యోద్యమాన్ని మానలేదు. మానితే హింసాఉద్యమం మరింత ప్రబలుతుందని, ప్రభుత్వ హింసను, ప్రజాహింసను రెంటిని ఆపడానికి తన అహింసా స్వాతంత్ర్యోద్యమాన్ని కొనసాగించడమే మార్గమనికూడ ప్రకటించాడు. నేడు కూడ స్వదేశ సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వమును నెలకొల్పడానికి జరిగే పోరాటాలను ఈ ఘటనతో మాన్పక, ముందుకు సాగించి విజయవంతము గావించడమువల్లనే ఇట్టి ఘటనలు జరగడానికి అవకాశ ముండదు.

జయపూర్ లోనికి జమ్నాలాల్ రాకూడదట!

మౌనమూర్తి మహాత్మునిసహితం మాట్లాడించింది మన సంస్థాన ప్రజా ఉద్యమం. రాజకోట పోరాటాన్ని సమర్థిస్తూ తన హరిజనపత్రికలో ఒకవ్యాసం వ్రాశాడు. "రాజకోట ప్రజలవలె ఇతర సంస్థానాలలోని ప్రజలు కూడ ప్రవర్తిస్తే తప్పక విజయంపొందుతారన్నాడు. మహాత్ముని వాక్యాలలో సత్యం ఘనీభవించి వుంది. రాజకోట సత్యాగ్రహం మాదిరిగా ఇతర సంస్థాన ప్రజా ఉద్యమాలలో కూడ పటేల్ వంటి సుప్రసిద్ధ కాంగ్రెసు నాయకులు నాయకత్వము వహించినచో అవి మాత్రం ఎందుకు విజయం పొందవు? తప్పక జయప్రదమౌతాయి. కాని ఆ విధంగా కాంగ్రెసు నాయకులు గాని, మహాత్ముడు గాని చేయ సాహసించ లేకపోవుట సంస్థాన ప్రజా ఉద్యమం యొక్క 'దురదృష్టమే' అవాలి.

నిజానికి రాజకోట సంస్థానంలోకంటె ఇతరసంస్థానాలలోని ప్రజలు తక్కువ హింస కేమీ పాల్గావడము లేదు. ఢేంకనాల్ సంస్థానం చూడండి. ఇప్పటికి ఆరు మాసముల నుండి ప్రజలు నానా హింసలకు గురి అవుతున్నారు. అచ్చట నున్న కఠినమైన అటవీ శాసనాలు రద్దుగావింపబడలేదు. తమలపాకుల మీది పన్ను తగ్గలేదు. పైగా ప్రజలపై లాఠీ ప్రయోగాలు, పోలీసు కాల్పులు, ఏనుగులచే త్రొక్కించడం, మిలిటరీ బందోబస్తు సాగుతూనే వున్నాయి. అయినా అచ్చటి ప్రజలలో స్వాతంత్ర్య జ్వాల చల్లారలేదు.

రాజనందగోన్ సంస్థానం చూడండి. మహాత్ముని సలహాలు నిరాకరించి సంస్థాన ప్రభుత్వం మరల 400 పై లాఠీచార్జి చేసి తుపాకులు కాల్చింది.

తెల్చెరు తీసుకోండి. సంస్థానాధికారుల దుర్మార్గాలు సహించలేక సంస్థానం విడచి 20 వేల మంది పరిజలు బ్రిటిష్ ఇండియాలోని అంగల్ జిల్లాకు పారిపోయి వచ్చారు. అప్పటికి కూడ వారిని హింసించడం మానలేదు. అంగల్ జిల్లాలో వారి గుడిసెలకు నిప్పంటించి తగులబెడుతున్నారు.

తిరువాన్కూరులో మహాత్ముని సలహాపై దివాన్ మీది నేరారోపణలు ఉపసంహరించుకొన్నా ప్రజల కోర్కెలు నెరవేరలేదు.

మైసూరుకూడ తన నిర్బంధ విధానాన్ని మరల హెచ్చు సాగిస్తోంది. మైసూరు సంస్థానంలోనికి వచ్చు ఇతర పత్రికలను కొన్నింటిని ఆపుచేయాలంతోంది.

ఆఖరికి జయపూర్ సంస్థానం కూడా జమ్నాలాల్ బజాజ్‌ను తన సంస్థానంలో అడుగు బెట్టకూడదని నిషేధించింది. దానికి ఆయన చక్కని సమాధానము ఇచ్చాడు. "నా జన్మస్థానము, నా తాత ముత్తాతలు నివసించిన యీ సంస్థానంలోకి నేను రాకూడదని నిషేధించడం ఆశ్చర్యంగా వుంది. క్షామ పీడితులైన ప్రజలకు ప్రజామండలి ద్వారా సహాయం చేయదలచుకున్నాను. అంతేకాదు శ్రీ జిత్‌లాల్ దుగాంజోషీ మొదలైన రాజకీయ బందీల విడుదల కోసం కూడా నేను ప్రయత్నిస్తున్నాను. నిషేధాన్ని తొలగించకపోతే నా విధి నిర్వహించడం నేను నెరవేరుస్తాను" అన్నాడు.

సంస్థానాలన్నిటిలోను ప్రజలను బాధిస్తున్న [illegible] నిరంకుశ పరిపాలనను నిర్మూలించి కాంగ్రెసు నాయకులు ఈవిధంగానే తమ కర్తవ్యాన్ని నెరవేర్చి బాధ్యతాయుత ప్రజా ప్రభుత్వాలను నెలకొల్పడానికి పూనుకుంటే మన స్వాతంత్ర్యోద్యమానికి బలం చేకూర్చే దేశసేవ మన దేశంలో అమలు జరగకుండా చేసినవారౌతారు.

ఇటలీ కోర్కెలు తీర్చడానికి చాంబర్లేను ప్రయాణం

మాంచెస్టరు గార్డియను పత్రిక వ్రాసినట్లు "స్పెయినులో నేడు సాగుతూన్న ఫ్రాంకో దాడి జయాపజయాల మీద కేవలము స్పెయిను భవిష్యత్తేగాక యూరపు భవిష్యత్తు ప్రపంచ భవిష్యత్తు ఆధారపడి ఉంది. మ్యూనిక్‌కు ముందు జనరలు ఫ్రాంకో గెల్చినట్లయితే, ఇంగ్లండుకు వ్యతిరేక శక్తుల బలము కొంచెము ఎక్కువయ్యేది. కాని నేడో, ఇంగ్లండు ఎత్తు



దలదీర్

కానికి, ఇంగ్లండు నౌకోన్నత్యానికి కూడ భంగము కలుగుతుంది." అయినా ఛాంబర్లేను స్పెయినును నాశనము గావించడానికి ఇటలీని సంతృప్తి పర్చడానికి రోముకు (ఇటలీకి) బయలుదేరాడు. దీనినిగూర్చి చర్చించడానికిముందు జర్మనీ ఈవారము, తన యుద్ధ ప్రయత్నాలను మరేవిధంగా ముందుకు కొనసాగించిందో చూదాం.

జర్మనీ : యూరపు

ఈమధ్య ఇటలీ విదేశాంగ మంత్రి సియానో హంగరీకి వెళ్లాడని, అతని సంప్రదింపుల ఫలితంగా హంగరీ, రోము, బెర్లినుల సమ్మేళనాన్ని అనుసరించి పని చేస్తుందనీ చూచాం. యూదులపై నిర్బంధాలుకూడ ఎక్కువ చేశారు. ఇటలీ బలపర్చినా, జర్మనీ కాదనడముచేత, రుథానియాను హంగరీలో కలుపలేదని దానివల్ల జర్మనీపై హంగరీకి అసంతృప్తి ఏర్పడిందనికూడ చూచాం. ఇదివరకు రుథానియాకు చెందిన "మునకెవ" పట్టణము, రిబ్బన్‌ట్రాప్, సియానో మధ్యవర్తి నిర్ణయము ప్రకారము హంగరీకి ఇవ్వబడినది. ఈ పట్టణ సమీపములో ఈ వారము ఒక చిన్న యుద్ధము జరిగింది. జెకోస్లొవేకియా సైన్యాలు ముందుగా హంగరీ సరిహద్దు సైన్యముపై కాల్చడంవల్ల హంగరీ సైన్యము జోక్యము కలుగజేసుకోవలసి వచ్చెనని హంగరీ ప్రకటించింది. ముందుగా హంగరీ కాల్చడంవల్ల తమ సైన్యము జోక్యము కలుగజేసుకోవలసి వచ్చిందని జెకోస్లొవేకియా ప్రభుత్వము ప్రకటించింది. జర్మనీకి మాత్రము ఈ తగాదా చాల అసంతృప్తిని కోపాన్ని కల్గించింది. హంగరీలో కౌంటు బెత్లీను అను రాజకీయ వేత్త జర్మనీ అంటే హంగరీలో ఎక్కువ ద్వేషము రోజు రోజుకు ప్రబలమవుతూ ఉందన్నాడు. హంగరీ రైతు పక్ష నాయకుడు టిబర్ ఎక్‌హార్డు, మరియొక దేశపు విజయయాత్ర కోసం, హంగరీని రహదారిగా చేయడానికి మేము ఒప్పుకోమని ప్రకటించాడు.

హంగరీ అసంతృప్తి చెందవచ్చు. పోలండు రుమేనియాలు రష్యాతో సంప్రదింపులు జరపవచ్చు. కాని హిట్లరు బెదరించగనే రష్యాను వదిలి హిట్లరుతో చేరడానికి ఆయా దేశ ప్రభుత్వాలు, ధనికవర్గాలు తయారయితే, రష్యావారికి సహాయము చేయలేకపోతుంది.

జర్మనీ బెదరింపువల్ల, జెకోస్లొవేకియా 10000 మంది యూదులను దేశమునుండి తరిమివేసి దక్షిణఅమెరికాకు పంపివేస్తూఉంది.

రుమేనియాలో యూదులకు వ్యతిరేకంగా నిర్బంధవిధానము ఎక్కువగుతూఉంది. ఈవారం 300 యూదుల హోటళ్ళను, ప్రజా ఆరామ గృహాలను ధ్వంసము చేశారు.

పోలండు విదేశాంగమంత్రి కల్నల్‌బెక్ హిట్లరును పిలుపనంపుటచే జర్మనీకివెళ్ళి హిట్లరుతో సంభాషణ లారంభించాడు. యుక్రెయినునుగూర్చి జర్మనీలోని పోలండు యూదులను గూర్చి, డాన్జిగ్‌ను, మెమెలునుగూర్చి సంప్రతింపులు జరిగాయి. రష్యాలోనైనా ఉండాలిలేదా జర్మనీతోనైనా ఉండాలిగాని గోడమీది పిల్లివాటంగా ఉంటే ఖబడ్దార్ అన్నాడు హిట్లరు. బెక్ హిట్లరు కోర్కెలను చాలవరకు ఒప్పుకొన్నాడని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇటలీ ఫ్రాంసులమధ్య తగాదా ఏర్పడితే, ఈవరకు పోలండు నియంత పిల్సుడిస్కి హిట్లరుతో చేసుకున్న ఒడంబడికప్రకారము ఫ్రాంసుకు సహాయము పోకుండా ఉంటాననికూడ బెక్ అంగీకరించాడట!

ఇకమీదట యుగోస్లేవియాలోని లోహపు గనులను జర్మనీ కంపెనీ (క్రుప్పు) ధనము హెచ్చించి ఉపయోగించుకుంటుంది. యూరపు ఆగ్నేయ మూలయందలి దేశాలలో జర్మనీ ఆర్థిక పలుకుబడి మునుపటికన్న మూడురెట్లు హెచ్చినదని వార్తలు తెలియజేస్తున్నాయి.

గత ప్రపంచయుద్ధానంతరము ప్రజలందరి అభిప్రాయము తీసుకొని (ప్లెబిసైటు తీసుకొని) డెన్మార్కుకు, ష్లెస్విగ్ అనే ప్రాంతాన్ని జర్మనీ నుండి తీసి యివ్వబడింది. దీనిని తిరిగి రాబట్టుకోడానికి నాజీలు తీవ్రమయిన ఆందోళన ఈప్రాంతములో ఆరంభించారు. డెన్మార్కు ప్రభుత్వము అందుచే నాజీపార్టీని నిషేధించింది.



ఛాంబర్లేన్

ఫిన్‌లాండు, స్వీడెనుమధ్య ఆలెండు దీవులలో నౌకాశ్రయాలను నిర్మించే విషయంలో సంప్రదింపులు జరుగుతున్నాయని గతవారము చూచాము. ఇవి పూర్తియైనాయి. ఫిన్‌లాండు ఈదీవులలో కొన్నింట కోటలు నిర్మించవచ్చు. ఆత్మరక్షణకని, మిగిలిన దీవుల నన్నింటిని ఉపయోగించుకోవచ్చు. ఈప్రణాళిక ఆచరణలో పెట్టడానికి తనిఖీగా ఒక కమిటీ శాశ్వతంగా ఉంటుంది. దీనిలో స్వీడెను ప్రతినిధులు, ఫిన్‌లాండు ప్రతినిధులు ఉంటారు. ఆలెండు దీవులలోని ప్రజలు అంగీకరిస్తే అచ్చట నిర్బంధ సైనికవృత్తిని ప్రవేశపెట్టవచ్చు. జర్మనీ రష్యాపై దాడి వెడలడానికి, ఫాసిస్టు ప్రభుత్వమయిన ఫిన్‌లాండుద్వారా ఆలెండు దీవులలో నౌకాశ్రయాలను, విమానాశ్రయాలను, నిర్మించడానికి పూనుకుంటూ ఉందన్నమాట!

అంతేగాక సబ్‌మేరైనులను అధికంగా నిర్మించడానికి జర్మనీ ఇంగ్లండు అనుమతి కోరిందని గతవారము చూచాము. ఇంగ్లండు కూడా అంగీకరించినట్లే ఉందనికూడ చూచాము. గోరింగ్ ఈసబ్ మేరైనులను పెంపొందించడానికి కారణాలను వెడల గ్రక్కాడు. రష్యాకు 160 సబ్ మేరైనులున్నవట! రష్యా జర్మనీకి చాల సమీపములో ఉన్నదట! అందుచే రష్యానుండి తమ వర్తక వ్యాపారాన్ని, తమ్ము, కాపాడుకోడానికి మరిన్ని సబ్ మేరైనులు కావాలట!

జర్మనీ ఒత్తిడివల్ల, ఈవరకు మెమెలు ఈ వ్యవహారాలను నడుపుతూ ఉన్న డైరక్టరీకి అధ్యక్షుడు రాజీనామా ఇచ్చాడు. మెమెలు గవర్నరు, మెమెలు జర్మను నాజీ పక్షనాయకుడగు డాక్టరు న్యూమన్‌తో నూతన అధ్యక్షుని నియమించడాన్నిగూర్చి ఆలోచిస్తున్నాడట! మెమెలు కూడ డాన్జిగ్‌వలె పూర్తిగా నాజీ జర్మనుల చేతుల్లోకి పోతుంది.

బెల్జియం, తన బంగారాన్ని లండనుకు పంపివేసింది. ఇది బెల్జియం తటస్థవిధానానికి భిన్నమని జర్మనుపత్రికలు బెదరిస్తూ ఉన్నాయి. ఇంగ్లండులో తన బంగారమంతా యుండుటచే, ఒకవేళ యుద్ధమువస్తే, బెల్జియము ఇంగ్లండు చెప్పినట్లు చేయవలసి వస్తుందని వాదిస్తున్నాయి. ఒకవేళ ఇంగ్లండు ఫ్రాన్సులే బెల్జియంయొక్క తాటస్థ్యమును లక్ష్యపెట్టక దానిద్వారా జర్మనీపై దండెత్తినచో తన బంగారాన్ని ఎక్కడమ్రింగివేస్తాయో అని, ఇంగ్లండు ఫ్రాన్సులకు బెల్జియం లొంగిపోయింది. ఈపరిస్థితులు బెల్జియంయొక్క స్వాతంత్ర్యానికి జర్మనీ ఇచ్చిన గ్యారంటీని కొనసాగించడము అసంభవమని తెలియజేసాయి.


ఇంగ్లండు జర్మనీలయొక్కపోటీలో జర్మనీ తన చుట్టుపక్కలనుండు చిన్న దేశాలమీద తాను చెప్పినట్లు చేయడానికి ఏలా ఒత్తిడి తెస్తూ ఉందో చూచాము. ఇక ఇంగ్లండుమీద, ఫ్రాంసుమీదకూడ ఏవిధంగా ఒత్తిడి తెస్తూఉందో చూదాం.

జర్మనీ : ఇంగ్లండు.

జర్మనీనుండి యూదులను పోనివ్వడానికి తాను తయారుగానున్నానియు, దానికి కావలసిన డబ్బు ఇంగ్లండు ఇవ్వడానికి తయారుగా ఉందా అని షాక్టు ఈవరకు ఇంగ్లండుకు వచ్చి సంప్రదించి వెళ్ళాడని పాఠకులకు తెలిసియేఉండును. ఈ రాయబారాలను ఇంకను కొనసాగించడానికి ఇంగ్లండు బ్యాంకు గవర్నరు మాంటేగూ నార్మను జర్మనీ వెళ్ళాడు. అచ్చటినుండి షాక్టుతో మాట్లాడి, యిరువురూ స్విట్జర్లాండుకు వెళ్ళుతారని వార్తలు వస్తున్నాయి.

టర్కీ సమీపమున సైప్రెస్ అనుదీవి ఒకటి ఉంది. అందు గ్రీకుభాషను మాట్లాడేవారున్నారు. వానిపై ఇంగ్లండు తన యుద్ధ యేర్పాటుల కోసం అధికారము చెలాయిస్తూ ఉంది. పత్రికలు బ్రిటిషువారు తమ స్వలాభాలకోసం సైప్రస్‌వారి జాతీయభావాలను అణచడానికి ప్రయత్నించడం క్రూరమని ఖండిస్తున్నాయి. సైప్రస్‌లోకూడ జాతీయోద్యమము పెంపొందుతూ ఉంది.

పాలెస్టయినులో బ్రిటిషు ప్రభుత్వముగావించే దురంతాలను గూర్చికూడ జర్మనుపత్రికలు వ్రాస్తున్నాయి. 1938 లో 2000 మందికి పైగా పాలెస్టయినులో చంపబడ్డారు. ఇందులో 486 మంది అరబ్బులు 292 మంది యూదులు. వీరుగాక బ్రిటిషు ప్రభుత్వము "బందిపోటుగాండ్రు" అని



తూర్పు యూరప్

పిలిచే అరబ్బు స్వాతంత్ర్యయోధులు 1138 మందిని ఇంగ్లండు ప్రభుత్వము చంపినది. గత సంవత్సరము చనిపోయినవారినిగూర్చిన పై లెక్కలుచూస్తే, పాలెస్టయినులో నేడు జరుగుతూఉండేది బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతూఉన్న అరబ్బుల స్వాతంత్ర్య పోరాటం గాని అరబ్బు-యూదుల కలహముగాదని స్పష్టపడుతుంది. మరి 1700 మంది గాయపడ్డారు. మరి 2000 మంది క్యాంపు జెయిళ్ళలో ఉన్నారు.

బ్రిటిషు సైనికులు గత అక్టోబరు 24 వ తారీఖున ముహమ్మద్ హద్దాద్‌ను అరెస్టు చేశారు. ఇతడుచేసిననేరము, ఒక రివాల్వరును కలిగిఉండడము. నేరానికి శిక్ష మరణదండన. అయితే ఇతనిని అరెస్టుచేసి తీసికొనిపోతూ ఉన్నప్పుడు "పారిపోవడానికి ప్రయత్నించాడని" ఇతనిని కాల్చి చంపారు. హిట్లరు ఇలాగే తన ఖైదీలనుకూడ చంపుతుంటాడు.

ఈ అరబ్బుల మిత్రులు, ఆపోలీసులపై కేసు పెట్టారు. కేసు సాగుతూఉంది. మన దేశములో ఆమధ్య అల్లూరి శీతారామరాజును గూడ ఈలా పారిపోతూఉంటేనే కాల్చి చంపామని" ఇంగ్లీషు ప్రభుత్వము ప్రకటించిన విషయము పత్రికా పాఠకు లందరికీ తెలిసిందే.

పాలెస్టయిను అరబ్బు స్వాతంత్ర్య పోరాటమును అణచడానికి, దానిని ఆనుకొని ఉన్న సిరియా, లెబ్‌నాన్‌లనుండి రాకపోకలను ఆపివేస్తూ, (అంటే సరిహద్దులను మూసివేస్తూ) ఇంగ్లీషు ప్రభుత్వము ఒక ప్రకటన చేసింది. ఈ మధ్య ఇస్తూ వచ్చిన మిలిటరీ ప్యాసులనుపయోగించుకొని ఇంగ్లీషు సైన్యానికి నష్టము కలిగేటట్లు అరబ్బులు పనిచేస్తున్నారని వానిని కూడ ఇవ్వడము మానింది. అంతేగాక ఇక ముందు మ్యునిసిపాలిటీలకు బయట యూదులు, యూరోపియనులుగాక మరెవరయినా మోటారు కార్లు నడపడానికి పూనుకుంటే అనేక నిర్బంధాలకు నియమాలకు లోబడి నడుపవలసి ఉండేటట్లుకూడ ఆర్డర్లు ప్యాసు చేశారు.

ఈ విధంగా బ్రిటను తన వ్యతిరేకంగా పత్రికా ప్రచారమేగాక, బ్రిటను సహకారి ఫ్రాంసుపై ఇటలీ కోర్కెలనుకూడ బలపరుస్తూ ఉంది.

ఇటలీ : ఫ్రాంసులు

దలదీరు కార్సికా, ట్యూనిస్, అల్జీరియాలలో పర్యటనము గావించాడు. ట్యూనిస్‌లో అరబ్బుల నవాబు "బే" దలదీరును సత్కరించాడు. కాని ట్యూనిస్ జాతీయ పార్టీవారు స్వాతంత్ర్యాన్ని కోరుతూ ప్రదర్శనాలు జరిపారు. దలదీరు తన పర్యటనములో కోటలు పరిశీలించాడు. సైన్యాన్ని చూచాడు. సేనానాయకుల కాన్ఫరెన్సులు చేసి యుద్ధ వ్యూహాలనుగూర్చి ఆలోచించాడు. ఫ్రాంసుకు చెందిన భూభాగములో ఒక యకరముకూడ ఇవ్వనన్నాడు. అంతేగాక ఈ విషయమై, ఫ్రాంసుకు హక్కు ఉందా లేదా అనే ధర్మాధర్మ విచక్షణ కోసం మరే దేశములోను ఎట్టి సంప్రదింపులుకూడ చేయనన్నాడు.

కాని ఈమాటలు ఫ్రెంచివారికే నమ్మకము కలిగించడములేదు. ఈ మధ్య ఫ్రాంసులో విదేశ వ్యవహారాలనుగూర్చిన విషయాలను పత్రికలకు విదేశాంగ శాఖ తెలియజెప్పక పోవడము; ఫ్రెంచి సోమాలిలాండులో ఇటాలియను సైన్యము 20 మైళ్ళ వరకు జొచ్చుక పోయిననూ, ఆ విషయము ఫ్రెంచి దేశస్థులకు తెలియనివ్వకుండా ఇంతవరకు ఆపు చేయడము; ఫ్రాంసుకు వ్యతిరేకంగా ఇటలీ చేస్తూ ఉన్న ఆందోళనను చూచి ఫ్రెంచి దేశస్థులు మండిపడు తారేమోనని, పత్రికలలో ఆ ఆందోళనను గూర్చి తక్కువగా ప్రకటించేటట్లు బోనెట్ ప్రయత్నిండము; 1935 లావల్ ముస్సోలినీ ఒడంబడికను ఇటలీ రద్దు చేసిన సంగతి బోనెట్‌కు ముందుగా తెలిసికూడ ఫ్రెంచి చేంబరులో (పార్లమెంటులో) దానిని గూర్చి ప్రస్తావించ కుండడము ఈఅవిశ్వాసానికి కారణాలు.

జర్మనీ పత్రికలు ఫ్రెంచిమంత్రుల యొక్క "ఏమీ ఇవ్వననే" గట్టి దృక్పథమును లక్ష్యం చేయడములేదు. ఫ్రాంసుయొక్క విదేశాంగనీతి ఎప్పుడూ అలాగేనా ఉంటుందనీ, ముందు ఏమీ ఇవ్వనని గట్టిగా ఉంటే, ఏదో కొద్దిగా పిదప ఇచ్చి సంతృప్తి పర్చవచ్చుననే సిద్ధాంతము మీదనే ఫ్రాంసు తన విదేశాంగనీతిని నడుపుతుందనీ, సమయము వచ్చినప్పుడు ఫ్రాంసు తప్పకుండా ఇటలీ కోర్కెలు అంగీకరిస్తుందనీ వ్రాస్తున్నాయి.

ఇటలీ కోర్కెలను అంగీకరించడానికి కావలసిన ఒత్తిడి తేవడానికి స్పెయినులో ముస్సోలినీ, అతని ఏజంటు జనరలు ఫ్రాంకో నూతన యుద్ధయాత్రను ఆరంభించారని మనము చూచాము. ఇటలీ ప్రయత్నాలను భగ్నము గావించాలంటే స్పెయినుకు వెంటనే సహాయము పంపడము అత్యవసరము. దీనినిగుర్తించిన ఫ్రెంచి ప్రజలు, కార్మికులు. సోషలిష్టులు కమ్యూనిష్టులు బ్రహ్మాండమైన ఆందోళనకు లొంగి ఫ్రెంచి ప్రభుత్వము నిచ్చి స్పెయిను ప్రభుత్వానికి సహాయము పంపుతుందోనని బెర్లినుపత్రికలు తిరిగి బెదరించ నారంభించాయి, ఇప్పుడు స్పెయినులో నున్న ఇరుపక్ష బలాలను తారుమారు గావించడానికి మరేదైనా దేశము ప్రయత్నిస్తే జర్మనీ ఇటలీలు ఊరుకోవని ప్రకటించాయి.

అయినా ఛాంబర్లేను ముస్సోలినీతో సంప్రదింపులు సాగించడానికి బయలుదేరాడు. చర్చనీయాంశములు 1. నూతన వర్తకపుటొడంబడిక 2. ఆఫ్రికాలో ఇటలీ ఇంగ్లండులకున్నరాజ్యాల విషయము అంత్యపరిష్కారము చేసుకోవడము 3. మధ్యధరా సముద్రపు భవిష్యత్తు. 4. మ్యూనిక్ ఒడంబడిక. తదనంతరము వివిధదేశాల మధ్యనున్న శక్తి అధికారాలనుబట్టి, ఇటలీ జర్మనీ (రోముబెర్లిను) సమ్మేళనానికి, ఫ్రాంసు ఇంగ్లండ్ సమ్మేళనానికి గల సంబంధాలను గూర్చి నిర్ణయించడము. 5. అవసరమయితే తిరిగి నాలుగు రాజ్యాలసమావేశము జరపడము.

ఈ విషయాలను చర్చించడానికి ఛాంబర్లేను పారిస్‌లో దిగిమరల ఇటలీ వెళ్ళుతాడట! అందుచే ఇటలీ తన కోర్కెను ఛాంబర్లేను మధ్యవర్తి తీర్పుకు ఫ్రాంసు అంగీకరించేటట్లేనని సంతోషిస్తూఉంది. ఫ్రెంచి పత్రికలు ముస్సోలినీ కోర్కెలు ఛాంబర్లేను నిరాకరిస్తాడని ఆశతో ఉన్నాయి. జర్మనీ పత్రికలు! సూయజు, జిబోతి ట్యూనిస్ విషయమై ఇటలీ కోర్కెలు అంగీకరించకపోతే పూర్తిగా ఫ్రాంసు ఇంగ్లండులలో సంబంధాలు త్రెంచుకొంటాము జాగ్రత్త! అని బెదరిస్తూఉన్నాయి. మధ్యధరా సముద్రములో ఫాసిస్టు సామ్రాజ్యము ఏర్పాటు గావాలనికూడ సూచిస్తున్నాయి.


అయితే, ఛాంబర్లేను ఎత్తేమిటి? ఇటలీకి స్పెయినును అప్పగించడము: సూయజుకాలువ విషయములోను, జిబోతి విషయములోను, ట్యూనిస్‌లో ఇటాలియనులకు ప్రత్యేక సౌకర్యాల విషయములోను ఇటలీని సంతృప్తి పర్చడము. దీనివలన ఫ్రాంసు మరింత బలహీనమై తనపై పూర్తిగా ఆధారపడుతుంది. ఇటలీకూడ తనకు కావాలసినది ఇంగ్లండు ఇప్పించినందున, జర్మనీ ప్రాబల్యము నుండి తొలగి ఇంగ్లండు చెప్పుచేతలలో నుండునని ఛాంబర్లేను ఆశ. జర్మనీ అధికారానికి ఇటలీ ఫ్రాంసులను పోటీగా నిలబెట్టి పైన బ్రిటను అధికారము చెలాయించ వచ్చునని.

కాని ఇది వట్టి అడియాస అని చెప్పక తప్పదు. ఫ్రెంచిదేశములోని డిక్రిల్లీస్ అనుమితవాది ఈక్రింది ఊహా సంభాషణను హిట్లరు ముస్సోలినీల ఎత్తునుగూర్చి వ్రాశాడు.

హిట్లరు—ఆముసలి అబ్బాయి (ఛాంబర్లేను) తోటి నీ ప్రథమ దర్శనము చాల ముఖ్యమయింది. అతడు నిన్నుచూచి మెచ్చుకొనేటట్లు ప్రవర్తించాలి. అదే సమయాన నిన్ను చూస్తే అతనికి భయముకూడ కలగాలి.

ముస్సోలినీ—ట్యూనిస్, కార్సికా, నైస్‌లు నాకిమ్మని అడుగనా?

హి—అలాంటి తెలివితక్కువ పనేమి చేయవద్దు. నీవు శాంతికోసం ఏలాపడిచచ్చిపోతూ




హిట్లర్

ఉండేదిచెప్పు. మ్యూనిక్‌దృక్పథమునుపొగడు ఇవన్నీ నిదానంగా, ముద్దులొల్కు మాటలతో చెప్పాలి. పిదప ఆకస్మికంగా మూతిని బిగించుకో. పిడికిళ్ళను బల్లమీద గ్రుద్దుతూ ఇటలీ శక్తినిగూర్చి చెప్పు.

ము—జర్మనీ శక్తినిగూర్చికూడ చెప్పనా?

హి—వద్దు. కేవలము ఇటలీ శక్తినిగూర్చి మాత్రము చెప్పు: ఈజిప్టును, సూడానులను రెండు నిమిషాలలో నీ సైన్యము ఆక్రమించుకోగలదని చెప్పు మాల్టాను సిసిలీ నుండి పాంటలేరియానుండి నాశనము గావించగలనని చెప్పు ప్రాణాలను సరకుగొనని నీ విమానములతోగూడిన నీవిమానాలచే జిబ్రాల్టరును దగ్ధము గావించడానికి పంపుతానని చెప్పు.



ముస్సోలినీ

ము—ఆ! ఇవన్ని చెప్పితే, పాకము చెడుతుందేమో!

హి—ఏమీ చెడిపోదు. బెర్ట్షెస్‌గేడనులో ఛాంబర్లేను వచ్చినపుడు అతని జుచ్చాపట్టుకొని నే నెలా ఊపి వేశానో నీవు చూడాల్సిందే. పారిస్‌ను లండనును రెండు నిమిషాలలో నాశనము గావిస్తానన్నాను.

ముస్సో—హా హా హా! ఆవిధంగా అతని భయపెట్టి ట్యూనిస్, కార్సికా, నైస్‌లను ఇమ్మని కోరుతాను.

హి—ఆలా చేయవద్దు. అతని ప్రాణము ఎగిరిపోయేటట్లు బెదరించి నీవడిగే కోర్కెలు చాలా స్వల్పముగా ఉంటే, నిన్నుచూచి సెబాష్ అంటాడు. జిబోతిని, సూయిజు కాలువలో కొన్ని సౌకర్యాలనుమాత్రంకోరు.

ము—దీనిలో అర్థములేదు. నాకింకా ఎక్కువ కావాలి.

హి—మెల్లగా వెళ్ళాలి. పై కోర్కెలు తెలియజేసినపిమ్మట, "నీవింతవయస్సులో ఇంత దూరము శ్రమపడివచ్చావు. నీవు నీజవాబును తీసుకొని వచ్చేటప్పుడు నేను మిలన్ పట్టణములో సగముదూరములోనే నిన్ను కలుసుకుంటాను," అని చెప్పు. మిలన్‌లో నీవు కోరినది మరికొన్ని సౌకర్యాలతో పుచ్చుకొని ఊరుకో. పిదప నావంతు వస్తుంది.

ము—నీవుద్దేశమేమిటో నాకే అర్థముకాలేదు.

హి—విను. ప్రజాతంత్ర రాజ్యాలకేమీ మతిలేదు. అందుచే నీవొకపర్యాయము, నేనొకపర్యాయము మనకు కావాల్సింది అడుగుతుంటే, మనలో మనకు ఐక్యతలేదనుకుంటారు. జెకొస్లొవేకియా విషయమున నన్ను నీవు బలపర్చవని వారనుకున్నారు. అదే రకంగా ఫ్రాంసు విభజనకు నిన్ను నేను

(మిగతా 22 వ పేజీలో)

కాకినాడ కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలి

స్టీమరు కూలీలు

ఈమధ్య లరీవ్ కంపెనీలో అయిదు గంటలకాలం కూలికి తగాదా వచ్చింది. కాని కూలీల ఐకమత్యతచే పేచీలేకుండా కంపెనీ నుంచి రాబట్టారు.

ఆమధ్య చనిపోయిన రావాడ రామస్వామి విషయమై కంపెనీతోను, హెడ్డాఫీసు కంపెనీతోను ట్రేడ్ యూనియన్ కమీషనర్‌తోను ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. త్వరలోనే రావాడ రామస్వామి కుటుంబమునకు నష్ట పరిహారం వస్తుంది.

కూలీలకు వారు సంఘంలో మెంబరుగా నున్నట్లు గుర్తుగా ఎర్రని టిక్కెట్లు పంచిపెట్టబడ్డాయి. అందు కూలిపేరు, జేరినతేది, ఏనెలకు చందా, ఎంత అనునది మొదలగు విషయాలు, క్రింది భాగమున శక్రటరీ సంతకం ఉండేటట్లు ఏర్పాట్లున్నాయి. ఈ టిక్కెట్లు కనీసం మూడు మాసములకు సరిపోయేటట్లు అమర్చబడి ఉంది.

ఈమధ్యనే బి. ఏ. కంపెనీ ఓడలో స్లింగుమీదపడి ఒక కూలికి పక్కఎముక జారింది. హాస్పటలులో చికిత్స పొందుతున్నాడు. ఇతని విషయమూ, ఇదివరలో దెబ్బతిన్న బోని అప్పలస్వామికిన్ని నష్ట పరిహారం కోసం సంఘం పాటుబడుతోంది.

మొన్నటిదినం క్రిష్ణ అనే ఒక యువకునికి కుడిచేయి మధ్యవ్రేలు కమిలిపోగా ఓడలో డాక్టరు లెక్క చేయకపోతే "నేను సంఘపు మెంబరుని, నాకు చికిత్స చేయాలి" అని గట్టిగా అడగడంతోనే నవ్వుతూ ఆ డాక్టరు కిక్కురుమనకుండా గౌరవించేడు.

త్వరలో స్టీమరులో పనిచెసే టాలీ గుమస్తాలు, స్యూపరు వైజర్లు, మరి యితర పనివాళ్ళుకూడ సంఘములో వచ్చి చేరుతారు? తప్పక వారిని గూడా జేర్చుకోమనిన్నీ, తాము కూడా కూలీలతో సంబంధం ఉందనిన్నీ, అందరికీ క్షేమముఅనిన్నీ జెప్పేరు. ఓడలులేని ఒకరోజున వారికి మీటింగుపెట్టి మెంబర్లగా జేర్చుకోడం జరుగుతుంది.

కాకినాడ రేచెర్లపేటలో విశాలమైన రోడ్లు వేయడానికి కొలతలు తీసికొని రాళ్ళపాతి కొంపల చూర్లు తెగగొట్టడం మొదలుపెట్టేరు. ఇది చాలా అన్యాయం. పేటవారు "మాకు ఒకదీపం లేదు. ఇండ్లకు సదుపాయములేదు గాని రోడ్లు వేయడానికి ముందుగా కొంపలూడపెరికితే మేమెట్లా బ్రతికేది? మాకు పట్టువని రోజుకు పావలా దబ్బుల సంపాదనలేదు. ఇండ్లు బాగుచేసుకోడానికి పైపైనాలేని సమయంలో మాకీ విశాలమైన రోడ్లెందుకు? అని మొరలు పెట్టుకుంటున్నా మ్యునిసిపాలిటీకి విన్నవించుకున్నా ఆలకించడములేదు. ఇక రోడ్లువేసి మ్యునిసిపాల్టీ యిండ్లకు పన్నులువేస్తారని చాల భయపడుతున్నారు. దీనికి సరియైన శ్రద్ధ మ్యునిసిపాలిటీ తీసుకోవాలి. అడ్డువచ్చిన యిండ్లు తీసివేస్తే దానికి నష్టపరిహారం యివ్వాలి. ముందుగా కొంపల దగ్గరవున్న మురికి గోతులు బాగుచేయించాలి లైట్లు వేయాలి. తర్వాత రోడ్లువేస్తే బాగుంటుందని పేటలోని ప్రజల కోరిక.

స్కావెంజెర్లు

కాకినాడ స్కావెంజెర్ల యూనియన్ క్రిందటి సంవత్సరం అక్టోబరులో ఏర్పడింది. ఎన్నోసార్లు మ్యునిసిపాల్టీకి అర్జీలు పెట్టింది. స్వయంగా సంఘపు యజమాన్లు వెళ్ళి మాట్లాడేరు. త్వరగా సమాధాన మిస్తామని సు సీచేసి ఆఖరుకు మార్చినెలలో క్రొత్త బడ్జెటులో స్కేలు ఏర్పాట్లు చేస్తామన్నారు. కాని యీ సంగతులు స్కావెంజర్ల సాధారణ సభలో తెలియజేస్తే యిదివరకు సంఘం ఏర్పడక ముందుకూడా యిలాగేచెప్పేరు బాబూ! ఏమీ లాభంలేదండి అన్నారు. త్వరగా యీమధ్యనే జీతాలు హెచ్చు ఏర్పాట్లు కావాలని పట్టుదలతో ఉన్నారు. మళ్ళీ మునిసిపాల్టీకి త్వరగా ఏర్పాట్లు చేయాలని వుత్తరువు వెళ్ళింది. సమాధానంక్కోసం సంఘం ఎదురుచూస్తూంది.

విశాఖపట్నం

అధికారుల మోసాన్ని గ్రహించిన కార్మికుల విజయం.

అధికారుల మోసం బయట పడింది. 10. 15సంవత్సరాల నుంచి చేసిన సర్వీసును మంట గల్పి నిన్న మొన్ననే పనిలో చేరినట్లు వ్రాసి సంతకాలు పెట్టించుకున్నారు. కొందరు కార్మికులు మోసపోయి సంతకాలు చేశారు. అంతా మోసపోతారా? స్టోరు లైను కార్మికులు 200 మంది సంతకాలు పెట్టకుండా భేష్ అనిపించుకున్నారు. వెంటనే యూనియన్‌వారు హార్బరు అధికారులకు నిరసన పత్రము వ్రాసారు. అందుపై లిల్లీదొర గారు (ట్రాఫిక్ మానేజరు) పోర్టు యింజనీరు ఆదిగా గల ఉద్యోగులు చేసిన పై పనులు తప్పు అనియు, వెంటనే సమాధానం ఈయవలయు ననియు, శ్రీ నంజుడయ్య మొదలుగా గల ఉద్యోగులకు వ్రాశారు.

వైజాగ్ 6—1—39 } కా॥ సత్యనారాయణ.

బందరు

గుర్రపుబండ్లు తోలు పనివారల సంఘం

బందరు పట్టణములో గుర్రపుబండ్లు తోలు పనివారలందరు 2వ తారీఖున ఉదయము బండ్లన్నియు కట్టివేసి చౌకులో సమావేశమైరి. కామ్రేడ్ మునుపల్లె

కార్మిక సమస్యలు

రామారావు, సంఘపు ఆవశ్యకతను, దానివలన లాభముల గురించి ముచ్చటించిరి. ఈ క్రింది తీర్మానము ఏకగ్రీవముగా నామోదించిరి.

2. పనివారలు తుపానువలన గుర్రములు, యిండ్లు కోల్పోవుటచే ఆర్థికముగా కష్టములలో మునిగియున్నారు గనుక మునిసిపల్ పన్ను కట్టుటకు రెండు నెలలు వాయిదా యివ్వవలసినదని మున్సిపల్ అధికారులను కోరుచున్నారు.

2. పట్నములో బెజవాడకంటె పనివారలకు వచ్చు ఆదాయము తక్కువ గనుక మున్సిపల్ పన్ను రు. 4—9—0 (అర్ధ సంవత్సరపు పన్ను) నుండి రు. 3—0—0 లకు తగ్గించవలసినదని మున్సిపల్ అధికారులను కోరుచున్నారు.

ఈ క్రిందివారిని వేమూరి వెంకట సుబ్బయ్యగారు అధ్యక్షులు గాను, అబ్దుల్ అజీజ్ గారు ఉపాధ్యక్షులు గాను ఎన్నుకొనిరి.

గుంటూరు

అచ్చు పనివారల సమావేశము

8—1—39 తేదీన సాయంత్రం 5—30 గంటలకు లైబ్రరీ ఆవరణలో జనరల్ బాడీ సమావేశమై యీ క్రిందివారిని ఏకగ్రీవముగా ఎన్నుకోవడ మైనది.

1. కోటంరాజు క్రిష్ణమూర్తిగారు ప్రెసిడెంటు.
2. పి. వి. సుబ్బారావుగారు కార్యదర్శి

ఈ క్రింది తీర్మానము ఏకగ్రీవముగా సభవారిచే ఆమోదించబడినది.

గుంటూరు పనివారల నందరిని యూనియన్‌లో సభ్యులుగా చేర్చవలసినదిగా హాజరయిన సభ్యులను కోరడమైనది.

గుంటూరు 3—1—39 } పి. వి. సుబ్బారావు సెక్రటరీ.

బెజవాడ

ఆంధ్ర రాష్ట్రీ ప్రెస్ వర్కర్సు యూనియన్ కార్యనిర్వాహక వర్గ సమావేశము 1939 జనవరి 15వ తేదీ ఆదివారము బెజవాడ ప్రెస్‌వర్కర్సు యూనియన్ ఆఫీసులో ఉదయం 10 గంటలకు జరుగును. సభ్యులందరు తప్పక విచ్చేయ ప్రార్థన.

ఎజండా

1. జమా ఖర్చులు
2. 9—1—38, 18—9—38 తేదీలందు ఫ్యాక్టరీ యజమానులకు గవర్నమెంటు పంపిన కమ్యునిక్ ఫలితాలు ప్రెస్ వర్కర్సు అందరికి వర్తించునట్లు చేయుటకు యేర్పాట్లు
3. కార్యదర్శి ప్రవేశపెట్టు యితర విషయములు

పి. వెంకటేశ్వర్లు
ప్రధాన కార్యదర్శి

* * *

గవర్నరుపేట కార్మిక సంఘము

బహిరంగ సభ

సూర్యారావుపేటలో 2—1—1939 తేది సాయంత్రం 6—30 గం॥లకు (మ్యునిసిపల్ కౌన్సిలర్) శ్రీయుత శిరికి దుర్గయ్యగారి అధ్యక్షతను కార్మిక సంఘ యాజమాన్యమున బహిరంగసభ జరిగినది.

శ్రీ యింటూరి వెంకటేశ్వర్రావు (పట్టణ కాంగ్రెసు సెక్రటరీ) మున్నంగి మల్లికార్జునరెడ్డి, యస్. సోమేశ్వరరావుగారలు వుపన్యసించిరి.

తీర్మానములు

1. పశ్చిమ కృష్ణాజిల్లా 35 వేల కాంగ్రెసు సభ్యత్వములను రద్దుపరచినందులకు అసమ్మతి తెల్పుచు దానిని గురించి న్యాయమైన విచారణ వెంటనే చేయవలసినదని ఆలిండియా కాంగ్రెసువారిని కోరుచున్నాము
2. సూర్యారావుపేటలో ఎలిమెంటరీస్కూలు లేనందున చాలామంది కార్మికుల పిల్లలు చదువుకొనుటకు చాలా కష్టముగా నున్నది గనుక మ్యునిసిపల్ వారు వెంటనే స్కూలు ఏర్పాటు చేయవలెనని కోరుచున్నాము.
3. ఈపేటలో లైట్లు, నీళ్ళ కుళాయిలు, ధర్మ హాస్పటలు, లిట్రిన్సు (మరుగుదొడ్లు) లేనందున స్త్రీ, పురుషులకు చాలా యిబ్బందిగానున్నది, కనుక మునిసిపాలిటీవారు తగుశ్రద్ధ తీసుకొనవలెనని కోరుచున్నాము
4. 21వ వార్డులోవున్న పాయికానా దొడ్లు యిటీవల మున్సిపాల్టీవారు తీసివేసినందుకు వారిచర్యయందు అసంతృప్తి వెల్లడిచేయుచూ వెంటనే పాయికానా దొడ్లు కట్టించ ప్రార్థించుచున్నాము.

సాయంత్రం 4—30 గం॥లకు జనరల్‌బాడీ మీటింగులో సంఘ ఆఫీసుమీద ఎర్రజండా యెగురవేయుటకు తీర్మానించడమయినది.

చొక్కాపు క్రిష్ణమ్మ,
కార్యదర్శి.

★ ★ ప్రాణం అంటే ఏమిటి?

శ్రీ గోపరాజు రామచంద్రరావు, ఎం. ఏ.

ప్రాణం అంటే ఏమిటో తెలిస్తే జీవిత రహస్యం మూడు పాళ్ళు తెలిసినట్లే. పుట్టడం, పెరగడం, చావడం—ఇవన్నీ తెలుస్తాయి. అందుకనే పూర్వకాలంనుంచే తర్జన భర్జన జరుగుతూనే ఉంది ఈ విషయాన్ని గురించి, ఇదమిద్ధమని తేలకపోయినాను.

సాధారణంగా ప్రజలలో ప్రాణం అంటే ఒక విధమైన గాలి అనీ, ఆ గాలి శరీరంలోంచి ఎగిరిపోవడమే చావు అనీ అభిప్రాయముంది. చనిపోయేటప్పుడు ప్రాణవాయువు నోట్లోనుంచో, కళ్ళల్లోంచో, కొంతమందికి కపాలంగుండానో, పోతుందంటారు. అట్లాగయితే ఏదైనా జంతువును చనిపోయేముందూ, చనిపోయిన తరువాతా తూచినట్లయితే, ఈ రెండవతూనిక కొంచమయినా తగ్గాలి. ఎందుచేతంటే, గాలికి బరువు ఉంది. దీనికి నిదర్శనంగా ఒక రబ్బరు బంతి నిండా గాలి కొట్టి తూచండి. దానిలో గాలి తీసేసి మళ్ళా తూచండి. ఈ రెండో బరువు తక్కువగా ఉంటుంది. తగ్గిన బరువు, పోయిన గాలి యొక్క బరువు. అలాగే ప్రాణమే గాలి అయితే చచ్చిన శరీరము బరువు తగ్గాలికదా? కాని చచ్చిన శరీరము బరువు హెచ్చుతుంది. ఇది ఎలాగ? ఇంకొకటి. చనిపోతున్నవానికి ప్రాణవాయువు పోకుండా ముక్కూ, కళ్ళూ, నోరూ, చెవులూ, మూసేస్తే అతను బ్రతకాలి. కాని అతను వెంటనే చనిపోతాడు. నవరంధ్రాలూ మూసేసరికి యజ్ఞపశువు ఏమవుతుందో తెలిసిన విషయమే. అందుచేత ప్రాణం గాలీ కాదు. అది ఎగిరీ పోదు.

ఇంక ప్రాణం అనేది ప్రాణి యొక్క లేక జీవుని యొక్క లక్షణమని కొందరు చెపుతారు. కాని అందువల్ల తేటపడిన విషయ మేమీ లేదు. పైగా విడని చిక్కులు కొన్ని సిద్ధమవుతాయి.

ప్రతిప్రాణికీ ఒక్కొక్క జీవుడు ఉందని అనుకుందాము. చెట్లూ జంతువులూ, అన్నీ మనిషిలాంటి ప్రాణులే కదా. అయితే ఒక గులాబిమొక్కలో ఒక జీవుడు ఉందని అనుకోవాలి. ఆమొక్కను ముక్కలు కొట్టి నాటితే ఒక్కొక్క ముక్క ఒక్కొక్క మొక్క అవుతుంది. ఇప్పుడు తల్లి మొక్కలోని జీవుడుకూడా ముక్కలు అయిందా? లేక వేరే జీవుళ్ళు ఈ ముక్కలలో ప్రవేశించాయా? తల్లి మొక్క ఉండగానే కూడా దాని కొమ్మ తెగనరికి వేరే మొక్కగా నాటి పెంచవచ్చును. చాలా చెట్లు ఈలాగునే ముక్కలుకొట్టి వృద్ధి చేయవచ్చును; అల్లం, అరటి, బంగాళాదుంప, క్రోటన్లు వగయిరా. రణపాలవంటి కొన్ని ఆకులలోనుంచికూడా కొత్త మొక్కలు వస్తాయి. చెట్లేకాకుండా, ముక్కలు కొట్టితే వేరు వేరు ప్రాణులయే జంతువులు కూడా ఉన్నాయి. పగడం, హైడ్రా మొదలైనవి. పగడాలు సముద్రంలో జంతువులు. హైడ్రా మంచి నీళ్ళ చెరువుల్లో నాచు ఆకులకు అంటి ఉంటుంది. దాని పరిమాణము దాదాపు పావు అంగుళం. మనం చూడవచ్చు. ముక్కలు కొట్టి పరిశీలించవచ్చు. మరొకటి జంతువులల్లో పురుష బీజం (స్పెర్మటోజోవం) ప్రాణం ఉన్నట్టే సంచరిస్తుంది. అలాగే స్త్రీగర్భంలోని అండం (ఓవమ్) కూడాను. దీనిలో ఒక జీవుడూ, దానిలో ఒక జీవుడూ ఉన్నాయా? ఆ బీజమూ, అండమూ ఈ కలిసిపోయి ఒకే పిండంగా అయిపోతాయి. ఈ పిండములో స్త్రీ, పురుష జీవుళ్ళు కలిసిపోయి ఒకటిగా అవుతాయా?

అయితే ప్రాణం అంటే ఏమిటి మరి? ప్రపంచములో ఉన్న వస్తువులన్నీ రెండు రకాలు—ప్రాణమున్నవి, ప్రాణము లేనివి. చెట్లూ, జంతువులూ, మనుష్యులూ, వీటికి ప్రాణం ఉంది. వీటినే చేతనములని కూడా అంటారు. రాళ్ళు, నీళ్ళు, గాలి, వీటికి ప్రాణం లేదు. వీటినే అచేతనములంటారు. చేతనములకు, అచేతనములకు ఉన్న భేదము ప్రాణము యొక్క గుణాన్నీ, నిజస్థితినీ తెలుపుతుంది. ఈభేదం రెండు విధాలుగా ఉంది. (1) నిర్మాణములోను, (2) చేష్టలలోను. అచేతనములలో, ఘన పదార్థాలు, ద్రవ పదార్థాలు, వాయు పదార్థాలు, అని మూడు రకాలు. ధాతువులూ (మెటల్సు), లవణాలూ (సాల్ట్సు), ఇవన్నీ అచేతన పదార్థాలే.

చెట్లు, జంతువులు, మనుష్యులు, పరిశీలిస్తే వాటి దేహాలు "ప్రోటోప్లాసం" అనే పదార్థంతో నిర్మితమై ఉన్నట్టు విశదమవుతుంది. ప్రోటోప్లాసం చేతన పదార్థము. ఇది నురగగాను, చిక్కగాను ఉంటుంది. ఇది రక రకాలుగా మారి చర్మము, రక్తము, మెదడు, మాంసము, ఆకు, కర్ర వగయిరాగా ఏర్పడుతోంది. ప్రోటోప్లాసం పరీక్ష చేస్తే అచేతనంగా ఉన్న ధాతువులు, వేరువేరు పాళ్ళలో కలిసి ఉన్నట్టు తెలుస్తుంది. దీన్ని కాలిస్తే వాయువులు, నీటి అవిరి పోతాయి. మిగిలిన నుసిలో కొన్ని లోహాలు, ఉప్పులు ఉండిపోతాయి. వీటిని విభజించి గ్రహించవచ్చును. కర్ర, శవములు కాల్చినా ఇలాగే వాయువులలోకి, బూడిదలోకి విభజింపబడతాయి.

రక రకాల పదార్థాలు ఏదో నిర్ణీతవిధిలో సంపుటి చెంది ప్రోటోప్లాసంగా ఏర్పడడంలో ప్రాణం వ్యక్తమవుతోంది. ప్రోటోప్లాసంలో అచేతన పదార్థాలలో వ్యక్తంకాని ఐదు విశేషలక్షణాలు వ్యక్తమవుతున్నాయి.

1. ఆహారగ్రహణం (Feeding)
2. ఎదగడం (Growth)
3. సంతానసృష్టి (Reproduction)
4. శ్వాసక్రియ (Breathing)
5. చైతన్యం (Irritability)

ఈ ఐదు లక్షణాలూ కలిగి ఉండడమే ప్రాణ నిదర్శనం, వీట్లో ఒక్కొక్కటే వివరంగా యోచించండి.

ఎదగడం

చేతనములన్నీ కొన్ని పదార్థాలను వాటి శరీరాల లోనికి ఆహార రూపంగా తీసుకుంటాయి. ఈఆహారం రాసాయనికమైన మార్పులు పొంది, ప్రోటోప్లాసంగా మారుతుంది. మనం అన్నమూ, కూరలూ తింటాము. మన శరీరంలోనికి పోయిన కొంత సేపటికి ఈ ఆహారము రక్తం గానూ, మాంసం గానూ మారుతుంది. ఇట్లా ఆహారం తీసుకొని, దాన్ని సజీవ పదార్థంగా మార్చుకొని శరీర వృద్ధిచేసుకోవడం, ప్రాణులయొక్క ముఖ్య లక్షణం. రాళ్ళు మొదలయిన అచేతనాలకు ఈ గుణం లేదు.

ఆహారం శరీరంలోకి తీసుకొనుట వలన ప్రోటోప్లాసము పరిమాణం హెచ్చు అవుతుంది. అందుచేత శరీరం కూడ ఎదుగుతుంది. చెట్లు, జంతువులు ఎదగడం మనకు తెలిసిన విషయమే. రాళ్ళు ఎదగవు. కొన్ని చిక్కని (కాన్‌సెంట్రేటెడ్) ద్రావణలో స్ఫటికం ముంచితే అది ఎదగవచ్చు. అయితే స్ఫటికం వంటి అచేతనాలు ఎదగడానికీ, చేతనాలు ఎదగడానికీ భేదం ఉంది. పటికస్ఫటికం ఉప్పు ద్రవంలో ఎదుగుతుంది. అంటే ఉప్పు పదార్థం పటికపైని పొరలుగా చేరడంవల్ల దాని పరిమాణం వృద్ధి అవుతోంది. కాని కొత్తగా చేర్పబడిన ఉప్పు ఎప్పటికీ మారదు. చేతనములోనో? భుజించిన ఆహారం ప్రోటోప్లాసంగా మారిపోతుంది. ఇది చాలా ముఖ్యమైన భేదం.

సంతాన సృష్టి

చేతనముల ఎదుగుకు కొంత పరిమితి ఉంది. ఇది బాహ్యపరిస్థితులచేత నియమితమై ఉంటుంది. చేతనం కొంతకాలం ఎదిగిన తరువాత దాని శరీరంలో నుంచి సంతతి ఉత్పన్నమవుతుంది. అరటి దుంప కొంత ఎదిగి పిలకలను పెట్టుతుంది. ఆలాగే కంద, అల్లం మొదలయినవి కూడాను. హైడ్రా మొదలయిన జంతువులలో కూడా ఈ పిలకలను పెట్టే స్వభావ ముంది. పిలకలు పెద్దవై తల్లి శరీరంలో నుంచి విడిపోయి అవికూడా తల్లిలాగే మళ్ళీ అహారం తీసుకొని ఎదుగుతాయి. గుడ్లు పెట్టడం, బిడ్డలను కనడం, ఈ గుణం యొక్క స్వభావం. అచేతనములలో సంతాన సృష్టి లేదు.

ఆహారం యొక్క మొదటి ఉపయోగ మేమంటే ఎదగడం అని పైని వ్రాశాము. ఒక మనిషి రోజుకు ఒక పౌను బరువు గల అన్నము తిన్నా డనుకోండి. అయితే రోజుకు ఒక పౌను కాకపోతే మానె పావు పౌను అయినా హెచ్చుతున్నాడా? లేదు. అటువంటప్పుడు ఈ తింటున్న ఆహారమంతా ఏమవుతూంది?

ఆహారంలో చాలా కొద్ది భాగమే ఎదగడానికి ఉపయోగపడుతున్నది. తక్కిన దంతా శరీరానికి శక్తి ప్రసాదిస్తుంది. అది ఎలాగంటే, మనం పీల్చుకొంటూన్న ప్రాణవాయువు శరీరంలో ఉన్న ఆహార పదార్థంతో సమ్మేళనమైతే, ఆ పదార్థం రాసాయనికంగా పరివర్తన చెంది ఆ సందర్భంలో వేడీ, శక్తీ కలుగజేస్తుంది. శక్తి ఉత్పన్నం కావడం ఆహారంయొక్క ముఖ్యోపయోగం. శక్తే ప్రాణికి ముఖ్యాధారం. జీవి జీవించి ఉండే ప్రతి క్షణమూ శక్తి ఉత్పన్నమవుతూండాలి. అందుచేతనే జంతువుకు నవరంధ్రాలూ మూస్తే ప్రాణవాయువు లోనికి వెళ్ళకపోవడంవల్ల శక్తి ఉడిగి చనిపోతుంది. ప్రకృతిలో ఒక్క జంతువులే కాకుండా చెట్టూ చామా మొదలయిన సకల జీవులు తప్పకుండా శ్వాస తీసుకుంటూండాలి. ప్రాణమునకు శ్వాస చాలా ముఖ్యమైన గుణము. అచేతనములలో శ్వాసక్రియలేదు.

చైతన్యం

ప్రాణులకుండే మరొక ముఖ్య లక్షణ మేమంటే, పరిస్థితుల పరిజ్ఞానం కలిగి ఉండి స్వతేమానుకూలంగా

(మిగతా 18 వ పేజీలో)

వనితాలోకం ఉజ్జ్వల భవిష్యత్తుకు దారి తీస్తోంది!

కామ్రేడ్ నాదెళ్ల రాజేశ్వరి

మానవ సమాజము యుగ యుగాంతరముల నుండి వివిధ రూపాలలో పరిణామము పొందింది. పొందుతూనే వున్నది. ఇది సహజము. సమాజమూ, సామాజిక పద్ధతులు స్థిరములు కావు. పరిస్థితులను బట్టి వాటంతటవే మార్పు చెందుతూ వుంటవి. మానవ చరిత్ర పరిశీలించినట్లయితే స్త్రీ జాతి ఆదిమకాలమునందు తప్ప తక్కిన అన్ని పరిణామ దశలయందును అధమ స్థానమును వహించి యున్నదని తోస్తుంది. పురుషుడామెను సర్వకాల సర్వావస్థల యందును తనకు సౌఖ్యము నొసగు నొక వస్తువుగానే వుపయోగించుకొనుచున్నాడు. స్త్రీ పురుషు లన్నివిషయములలో సమానార్హతలను గలిగి యున్నారని పీడిత వర్గముల కాశా జ్యోతి యగు సోవియట్ రష్యా నిరూపించింది. మనము ప్రస్తుతము యీ దీన దశ నుండి విముక్తి పొందాలన్నా, మన నావరించి యున్న బానిసత్వము పోవాలన్నా, మనకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యము, గౌరవమూ కావాలన్నా ఒక్క సామ్యవాద ప్రభుత్వములోనే వీలు పడుతుంది. అదే శరణ్యం. గమ్యస్థానం సర్వమూనూ.

చిరకాలమునుండి స్వాతంత్ర్యము ననుభవించుచూ అన్ని దృక్పథములలోనూ వెనుకబడి యున్న భారత దేశములో మహిళోద్యమం ఎంతదుస్థితిలో ఉంటుందో వేరుగా చెప్ప నవసరం లేదు. కాని వ్యక్తిగతముగా అనేకమంది వీరాంగనలు ఉన్నతాశయముల కొరకు పోరాడి తమ ప్రాణములనైెత మర్పించినట్లు చరిత్ర చెప్పుచున్నది. ఆంగ్లేయులు మన దేశములో తమ రాజ్యమును సుస్థిరముగా స్థాపించినది మొదలు నేటివరకూ స్వాతంత్ర్య సమరము సాగుతూనే వుంది. ఈ స్వాతంత్ర్య సమరములో అనగా ముఖ్యముగా 1857 లో రాజ్యాలగోల్పోయిన సంస్థానాధీశ్వరుల యాజమాన్యమున జరుపబడిన మొదటి భారత స్వాతంత్ర్య పోరాటములో పాల్గొన్న వీరమాత ఝాన్సీ లక్ష్మీబాయి మొదలు వేలకొలది సోదరీమణులు పాల్గొన్నారు. కాని ఒకసంగతి: వీరు ఒక సంఘంగా ఆర్గనైజు చేసుకొని, ఆ సంఘ యాజమాన్యమున వ్యవహరింపలేదు. సంఘ నిర్మాణము యొక్క బలమునూ, ప్రాముఖ్యతనూ గమనింప లేదు.

అఖిల భారత మహిళా సంఘ 13 వ సమావేశము గత నెల 29 వ తారీఖున ఢిల్లీలో రాణీ లక్ష్మీబాయి రాజ్‌వాడే గారి అధ్యక్షతను జరిగింది. అ. భా. మ. స. ప్రస్తుత స్థితి చూచినచో అ॥ భా॥ కాంగ్రెసు సంఘ బాల్యదశ స్మరణకు వచ్చుచున్నది. అ॥ భా॥ కాంగ్రెస్ మహాసభకు మొదటి రోజుల్లో గవర్నర్లు మొదలగు ఉన్నతోద్యోగులునూ, సంస్థానాధీశ్వరులును వచ్చుచుండెడివారు. ప్రస్తుతం అ॥ భా॥ మ॥ సంఘ స్థితి కూడా అట్లే యున్నది. ఈ సంఘ ప్రథమ సమావేశము బరోడా మహారాణి గారి అధ్యక్షతను జరిగింది. ఇందు పీడిత వర్గముల స్త్రీలకు ప్రాతినిధ్యము లేక, ఏ కొలది మంది ఉన్నత వర్గములకు చెందిన స్త్రీలు మాత్రమే సమావేశమై విద్యా విషయములు చర్చించుచుండెడివారు. క్రమ క్రమముగా సాంఘిక సమస్యల యెడ దృష్టి మరల్చి శతాబ్దములు నుండి స్త్రీలలో పాతుకొని యున్న సాంఘిక దురాచారములనూ, మూఢ విశ్వాసములను రూపు మాపి కృషి చేయ నారంభించిరి. గత రెండు మూడు సంవత్సరములనుండి రాజకీయములందు ప్రత్యక్షముగా పాల్గొనకపోయిననూ, రాజకీయములను గురించి చర్చనైనా చేయవలెనని ప్రయత్నించుచున్నారు. గత సంవత్సరం అధ్యక్షురాలుగా నున్న రాజకుమారీ అమృతకౌర్ గారి సంచారపు కృషి వలన అ॥ భా॥ మ॥ సంఘమునకు కొన్ని అనుబంధ శాఖ లేర్పడినవి. కాని అవి ఎక్కువగా నగరములందు పట్టణములందు మాత్రమే. 7 లక్షల గ్రామములలో పడియున్న ప్రజానీకము దీనితోఎట్టిసంబంధము లేనివారైరి.

యీ ఢిల్లీ సమావేశముతో అ॥ భా॥ మ॥ సం॥ చరిత్రయందు నూతనాధ్యాయము ప్రారంభమగుచున్నది. దేశములో ఉన్న జాతీయ నాయకుల దృష్టినీ సమావేశ మాకర్షించినది. 200 మంది ప్రతినిధులు వివిధ రాష్ట్రములనుండియూ, సంస్థానములనుండియూ యీ సమావేశమునకు విచ్చేసిరి. అంతర్జాతీయ మహిళోద్యమములో కృషి చేయు సోదరీమణులు కూడా ఈ సమావేశమునకు వచ్చు టెంతయూ ముదావహము.



శ్రీమతి విజయలక్ష్మీ పండిట్

ఈ సమావేశములో జరిగిన కార్యక్రమమంతా కొంచెం ముందడుగు వేస్తూంది. మహాత్మా గాంధి యీ సమావేశానికి సందేశమిస్తూ స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్ని తామే సంపాదించుకోవాలనీ, ప్రస్తుతము దేశములో కలవరపెట్టుతున్న సమస్యల్ని స్త్రీలే పరిష్కరించాలనీ చెప్పాడు.

గౌ॥ శ్రీమతి విజయలక్ష్మి పండిట్ యుద్ధ ప్రతికూల తీర్మానాన్ని ప్రతిపాదిస్తే ఏకగ్రీవముగా ప్యాసయింది. ఇటీవల కేంద్ర శాసన సభలో తీర్మానింపబడిన సైనిక శాసనాన్ని నిరసించాడు. ఆండ్రూస్ మహాశయుడు యీ సమావేశములో ఉపన్యసిస్తూ అ॥ భా॥ మ॥ సంఘముకు ఒక విదేశ శాఖ నేర్పాటుచేయాలని సలహా నిచ్చాడు. యీ సమావేశానికి అధ్యక్షత వహించిన రాణీ లక్ష్మీబాయి రాజ్‌వాడే స్త్రీలలో ప్రబలియున్న అజ్ఞానాన్ని, పిచ్చినమ్మకాలనూ, పోగొట్టాలనీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని సంపాదించాలనీ, స్త్రీలు రాజకీయ చర్చలలో పాల్గొనవచ్చునని సూచించింది. యీ సమావేశ కార్యక్రమాన్ని పోకళ్ళను చూస్తే నూతన శకారంభ మగుచున్నట్లున్నూ, వనితాలోకానికి ఉజ్వలమైన భవిష్యత్తుకు దారి తీస్తున్నట్లున్నూ తోస్తుంది.

ఈ సమావేశాన్ని గురించి స్థూలరూపంలో చెప్పాలంటే రెండు భిన్న భావములు గల స్త్రీ ప్రతినిధుల సమావేశమని చెప్పవచ్చును. ఒకవైపున లక్ష్యసిద్ధికిరమగు కార్యక్రమమునిచ్చి స్వాతంత్ర్య సమరానికి పురిగొల్పు జాతీయపక్షమూ, బ్రిటిష్ సామ్రాజ్యానికి పట్టుగొమ్మలైన సంస్థానాధీశ్వరుల భార్యలూ, సర్, లార్డ్ మొదలుగాగల బిరుదములు పొందిన ఉన్నతోద్యోగుల భార్యలు. ఒక వైపు నుండి లేడీ ఫాల్స్ సందేశం. మరొకవైపునుంచి మహాత్మా గాంధి సందేశం. కాబట్టి యీ సంస్థ భావిఔన్నత్యంసోదరీకామ్రేడ్స్‌పైఆధారపడి ఉందని చెప్పాలి. మన మీ సదవకాశాన్ని సద్వినియోగము చేయాలి.

అ॥ భా॥ మహిళా సంఘమును నిజంగా స్త్రీల హక్కుల కొరకు పోరాడు సంస్థగానూ, పారతంత్ర్యమును పారద్రోలుటకు చేయు పోరాటమందు ప్రథమ స్థాన మలంకరించు సామ్రాజ్య వాద వ్యతిరేక సంఘముగానూ చేయవలసి వుంటుంది. అదెట్లు? స్త్రీలలో విద్య శూన్యము. మూఢ విశ్వాసములు మెండు. యే కొలదిమందో విద్యావతులున్నను వారు ప్రముఖ సమస్యలం దభిరుచి చూపక అల్ప విషయము లందే కాలము వ్యర్థ పుచ్చుట శోచనీయము. స్త్రీ ప్రస్తుత విధానమందు ఒక యంత్రముగా ఉపయోగింపబడుచున్నది. రాను రాను స్త్రీ జన్మ భూభారము తప్ప వేరు కాదని అనుకొనవలసిన స్థితి వచ్చినది. శతాబ్దముల తరబడి బానిసత్వములో మునిగి యుండుటచే మనకు వ్యక్తిత్వమే లేదు. మన కర్తవ్యాన్ని నిర్ణయించుకొనలేము. సాహిత్యము, శాస్త్రములు, కళలు మనకు అందుబాటులో లేవు. మనము దేశాభివృద్ధి కొరకు పాటుబడుట పోయి దేశముకొరకు సర్వము త్యాగము చేయుటకు సిద్ధముగా ఉన్న మన సోదరులను ఆటంకపరచి వారిలో నున్న విప్లవ శక్తిని నశింపజేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు సహాయపడుచున్నాము. ఇంతకంటె అవమానకర విషయము వేరొకటి లేదు. నేటి స్పెయిన్ చరిత్రను గమనింపుడు. అక్కడి స్త్రీలు ప్రజాస్వామ్యమును కాపాడుటకు నడుము బిగించి యుద్ధరంగమున యాహుతి యగుచున్నారు. మనలో అట్టి శక్తి లేదా? మన మీ దీనావస్థనుండి బయటబడుటకు మార్గం లేదా? మన మేమి చేయాలి.

అఖిల భారత మహిళా సంఘాన్ని మనదిగా చేసుకోవాలి. దానినే మన వేదికగా ఉపయోగించుకోవాలి. మన కోర్కెలు, మన సమస్యలను దాని ద్వారానే ప్రతిబింబింప జేసి ప్రపంచానికి చాటాలి. అ॥ భా॥ మ॥ సంఘముకు ఆండ్రూస్‌గారు చెప్పినట్లు విదేశ శాఖ నొకదాని నేర్పరచి తద్వారా దూరమందున్న యితర దేశముల మహిళోద్యమముతో దగ్గిర సంబంధ మేర్పరచుకోవాలి. నేడు అ॥ భా॥ మ॥ సం॥కు అనుబంధముగా లేని ప్రత్యేకముగా అనేక జిల్లా సంఘములు, రాష్ట్ర సంఘములు యింకా యితర సంఘములు గలవు, వీటి నన్నిటిని అ॥ భా॥ మ॥ సంఘానికి అను

(మిగతా 18 వ పేజీలో)

ఫెడరేషను మీద సత్యమూర్తి మోజు

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఏ.

"బ్రిటిషు ప్రభుత్వం ఇండియాలో ఫెడరేషన్ ప్రవేశపెట్టితే, కాంగ్రెసు ప్రభుత్వాలు రాజీనామాలివ్వడం శుద్ధ పొరపాటు. గవర్నర్లు వారిని తొలగిపొమ్మంటే, నిరాకరించాలి. జాతీయ విద్రోహుల్ని మంత్రులుగా చేస్తే వారిని ఓడించాలి. బ్రిటిషువారు యీ సమస్యను నిజంగా పరిష్కరించదలచుకొంటే, వైస్రాయి మహాత్మునితో సంప్రదించాలి. మహాత్ముడే బ్రిటిషువారికి ఆఖరి ఆశ. ఇప్పటికే కాంగ్రెసు వాదుల్లో అసహనం వ్యాపిస్తోంది."

అని ఉపన్యసించాడు శ్రీమాన్ సత్యమూర్తి అయ్యర్, కలకత్తాలో. అనేకమంది పత్రికా విలేఖరులు గల ఒక సభలో మాట్లాడుతూ అతడీ విధంగా అన్నాడు: "సైనిక వ్యయంలో కొంత భాగంపైన ఫెడరల్ శాసన సభ్యులకు వోటుచేసే అధికారం యిచ్చి, ఆ శాఖను ఫెడరల్ మంత్రికి స్వాధీనం చేయాలని నా కోరిక. 15 లేక 20 సంవత్సరాలు యీ విధంగా నడిచాక, సైనిక శాఖ పూర్తిగా మంత్రి స్వాధీనం చేయబడాలి."

ఫెడరేషన్‌లో ఈ క్రింది మార్పులు చేస్తే అంగీకరించ వచ్చునంటూ సత్యమూర్తి మరునాడు "హిందూ" పత్రికా విలేఖరితో చెప్పాడు:—

1. ఫెడరల్ ఎసంబ్లీకి ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిపై జరగాలి. "ఏదో ఒక రకమైన ఎన్నిక విధానంవల్ల" సంస్థాన ప్రజా ప్రతినిధులు ఎసంబ్లీకి సభ్యులుగా పంపబడాలి.

2. కమ్యూనల్ (మతముల ననుసరించి) నియోజక వర్గాలు పోవాలి. కాని, వేర్వేరు మత సంస్థల నాయకులతో సంప్రతించి వారిని ఒప్పించి నిర్ణయం యిచ్చే వరకూ కాంగ్రెసు ఆగవచ్చు.

3. పైసభకు ఈయబడ్డ ఆర్థికాధికారం పోవాలి. ఉన్నతోద్యోగాలన్నీ ఫెడరల్ మంత్రుల ఆధీనములో ఉండాలి. రైల్వేలు, నాణెముల చెలామణి పైనకూడా అధికారం మంత్రులకే ఉండాలి.

4. అక్టులో బ్రిటిష్ వ్యాపారస్థుల కీయబడిన ప్రత్యేక రక్షణలు రద్దుకావాలి. ఇండియా బ్రిటన్ దేశాలుకలసి పరస్పర మర్యాదతో ఒక ఒడంబడిక చేసుకోవాలి. గవర్నర్ల ప్రత్యేకాధికారాలు పోతున్నప్లే, గవర్నర్ జనరల్ యొక్క ప్రత్యేకాధికారాలు కూడా పోవాలి. ఫెడరల్ మంత్రులకు సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలి.

5, సైనిక వ్యయంలో మొదట కొంత భాగాన్ని ఫెడరల్ ఎసంబ్లీ యొక్క స్వాధీనంలోకి తీసుకువచ్చి, క్రమక్రమంగా ఎక్కువ భాగాన్ని తీసుకురావాలి. 15 సంవత్సరాలలో సైన్యం అంతా భారతీయులతో నిండి యుండే లాగు ఒక ప్రణాళికను సిద్ధంచేయాలి. విదేశ వ్యవహారాల విషయంలో ఇండియా ప్రతిపత్తి అధినివేశ రాజ్యాల ప్రతిపత్తితో సమానంగా ఉండాలి.

ఈ మార్పులన్నీ అక్టు మార్చకుండానే ఆర్డర్స్ ఇన్‌కౌన్సిల్ ద్వారా చేయవచ్చు. "సకాలంలో పై మార్పులన్నీచేసి, మహాత్మునితో వైస్రాయి సంప్రదిస్తే, కాంగ్రెసు మహాసభ ఫెడరేషన్‌ని అంగీకరిస్తుంది.... అయినా, యిట్టి మార్పులతోగూడిన ఫెడరేషన్‌ని తిరస్కరించేవారు యీరోజున కాంగ్రెసులో ఉన్నారు. వారిబలం స్వల్పమైనది కాదు. పైమార్పులు త్వరలోను, దయతోను, చేయకపోతే వారు యింకా బలం సంపాదించుకోగలరు."

సత్యమూర్తికీ, యితర రాజకీయవేత్తలకీ ఉన్న భేదము యేమంటే, ఫెడరేషన్‌లో మార్పులు చేయబడవని బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులు ఎంత ఖచ్చితంగా చెవుతూంటే సత్యమూర్తి అంత తరచుగా మార్పులు కోరుతున్నాడు. మరో విచిత్రం యేమంటే, అతడు సూచించే మార్పులు రోజురోజుకీ దిగజారుతున్నాయి.

1. సైనిక వ్యయము.

నూతన ఇండియాచట్టంలో ప్రజాప్రతినిధులకు సైనిక వ్యయంమీద యేమాత్రం అధికారం లేదు. గవర్నరుజనరలే దానికి బాధ్యత కలిగి ఉంటాడు. ఆమధ్య సత్యమూర్తి సూచించిన మార్పుప్రకారం, సైనిక వ్యయంమీద ఫెడరల్ మంత్రులకు పూర్తి పెత్తనం వుండాలి. కాని



ఎట్టి రాజీలు లేకుండా
ఫెడరేషన్‌ను ఎదుర్కోవాలనే బోస్

యిప్పుడు మరొక మెట్టు క్రిందికి దిగి, సైనిక వ్యయంలో కొంతభాగం మట్టుకే మొదట మంత్రికి స్వాధీనంచేసి, తరువాత, కొద్దికొద్దిగా, స్వాధీనచేస్తే చాలునంటున్నాడు.

మనదేశంలో సైనికదళం, నావికాదళం, వైమానికదళం, మూడు వుద్దేశాలతో వుంచబడివున్నాయి. (ఎ) ఇండియాలో బ్రిటిషువారికి గల సామ్రాజ్యపు ప్రయోజనాలను విదేశ ప్రభుత్వాలు హరించకుండా కాపాడడం. (బి) దేశంలో బయలుదేరే సామ్రాజ్య ప్రతికూలోద్యమాలను అణచడం (సి) బ్రిటిష్ సైనికులను తరిఫీదు చేసే రంగమును ఏర్పాటుచేయడం. ఇండియా యొక్క అవసరాలు, భారతీయుల భద్రత ఇవేమీ ప్రభుత్వానికి అవసరం లేదు. పశ్చిమోత్తర సరిహద్దులో ప్రజల్ని లొంగతీయడానికి బ్రిటిషు సైనికులు నేడు జరుపుతూన్న హత్యాకాండకీ, మనదేశప్రజల భద్రతకీ ఏమీ సంబంధములేదు. ఐనా, దానికయ్యే ఖర్చు భారతీయులే పన్నుల రూపంగా భరించాలి. మొన్న ఈ మధ్య భారతీయ సైనికదళం ఒకటి చైనాకు పంపబడింది. అక్కడ ప్రజలు జపానువారితో స్వాతంత్ర్యం కొరకు యుద్ధంచేస్తున్నారు. ఇండియానుంచి వెళ్లిన సైనికదళం భారతీయుల హక్కుల్ని కాపాడేటందుకే నని ప్రభుత్వ ప్రతినిధి చెప్పాడు. కాని, చైనాలో భారతీయులకెట్టి హక్కులూ లేవనే సంగతి అందరికీ తెలుసు.

ఇండియాలో సైనిక శాఖను వృద్ధి చేయడానికి, ఆధునిక పద్ధతుల ప్రకారం నడపడానికి, ఏ యే పనులు చేయాలో విచారణ సల్పి, సూచన లీయవలసిందని బ్రిటిషు ప్రభుత్వం చాట్‌ఫీల్డు కమిటీ అనే ఒక విచారణ సంఘాన్ని ఇండియాకు పంపింది. డిఫెన్సు డిపార్టుమెంటులో ఒక భారతీయ ఉద్యోగిని నియమించాలనీ; 30 కోట్ల రూపాయలు అప్పుతెచ్చి జబ్బల్‌పూర్ ఆయుధ ఫ్యాక్టరీని వృద్ధి చేయాలనీ; సైన్యంలో ఇంకొక భారత విమాన దళాన్ని యేర్పాటు చేయాలనీ ఈ కమిటీ సభ్యులు సూచించినట్లు తెలుస్తూంది.

వీటి అన్నింటి అర్థం, కొద్ది రోజుల్లో రాబోయే ప్రపంచ సంగ్రామంలో ఇండియాను భద్రంగా కాపాడుకొంటూ, తమ సామ్రాజ్యానికి సహాయం చేయడానికి బ్రిటిషు ప్రభుత్వము సర్వసన్నాహాలు చేస్తూన్న దన్నమాట.

బ్రిటిషు సామ్రాజ్య రక్షణకై విదేశీ పరిపాలకులు చేసే యుద్ధాలకు, పెట్టేకర్చుకు, భారతీయులకెట్టి సంబంధం వుండకూడదని మన జాతీయ వాదులు (లిబరల్ పార్టీవారు సహా) అందోళన చేస్తున్నారు, అప్పుడు మన సైనిక వ్యయంలో అత్యధిక భాగాన్ని వేరు వేరు రాష్ట్రాలలో ప్రజోపయోగ కార్యాలకు వినియోగించుకోవచ్చు. కాని సైనిక వ్యయంలో "కొంత భాగం" మాత్రం ఫెడరల్ మంత్రికి స్వాధీనంచేస్తే సత్యమూర్తి సంతృప్తి పడతాడు. గత సంవత్సరపు ఆదాయ వ్యయపట్టిక ప్రకారం, సుమారు 50 కోట్ల రూపాయలు (అంటే, రాబడిలో నూటికి 42 వంతు) సైన్యానికి ప్రత్యేకించబడింది. ప్రపంచ సంగ్రామం ఏనిమిషాన్ని వస్తుందోనని బ్రిటిషు ప్రభుత్వం సర్వసన్నాహాలు చేస్తూంది, కనుక ఈవ్యయం అంతకంతకు యెక్కువౌతుందేకాని తగ్గే సూచనలు లేవు. ఇట్టి పరిస్థితులలో సత్యమూర్తి కొంత వ్యయంపైననే అధికారం వస్తే చాలుననడం దేశానికి ద్రోహం తలపెట్టడమన్నమాట.

ఒకవేళ సైనికశాఖను ఫెడరల్ మంత్రుల స్వాధీనం చేసినప్పటికీ, ఎట్టి ప్రయోజనం వుండదని సత్యమూర్తివంటి రాజనీతి దురంధరుడు కనిపెట్టక పోవడం శోచనీయం. ఫెడరల్ రాజ్యాంగంలోని నిజమైన అధికారమంతా గవర్నరు జనరల్‌ది. మంత్రుల్ని ఎన్నుకొనే అధికారంగాని, తొలగించే అధికారంగాని, శాసన సభ్యులకుండదు. గవర్నరు జనరలే మంత్రుల్ని నియమించడం, వారికి వేరు వేరు శాఖలు ఈయడము, తన కిష్టం వచ్చినప్పుడు తొలగించడము చేస్తాడు. అంతేకాదు, ఫెడరల్ రాజ్యాంగ నిర్మాణానికి అందరికంటె పై అధికారి హోదాతో అతడు ఫెడరల్ మంత్రుల ప్రతిపనికి అడ్డు తగులవచ్చు. చట్టంలో అతనికీయబడ్డ ప్రత్యేకాధికారాలకు ఎట్టి హద్దులేదు. అధికార ఛాయలైనాలేని ఫెడరల్ మంత్రిపదవులంటే సత్యమూర్తి ఇంత మోజు కనపరచడం విచిత్రం.

2. ఎన్నిక విధానం.

ఫెడరల్ ఎసంబ్లీకి సభ్యుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకొనే ఏర్పాటు చేయాలని సత్యమూర్తి అంటాడు. కాని, అక్టు ప్రకారం క్రింది సభ చేసే ప్రతి శాసనాన్ని పై సభ నిరాకరించవచ్చు. అసలు క్రింది శాసన సభకే ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యాకులుగ రావడం దుర్లభం. ఎందువల్లనంటే, సంస్థానాధీశులు తమ కిష్టమయిన ప్రతినిధుల్ని మెంబర్లుగా పంపే హక్కు వారికుంది. "ఏదో ఒక రకమైన ఎన్నిక విధానంవల్ల" సంస్థాన ప్రజా ప్రతినిధులు ఎన్నుకోబడి ఫెడరల్ ఎసంబ్లీకి సభ్యులుగా వస్తే చాలునంటాడు సత్యమూర్తి. ఈతని సూచన ప్రకారం ప్రతి సంస్థానంలోను శాసన సభలు నిర్మించబడతాయనుకుందాము. కాని వాటిలో అధిక సంఖ్యాకులు నామినేటెడ్ మెంబర్లుగాను, ప్రత్యేక నియోజక వర్గాలనుండి యెన్నుకోబడిన ప్రతినిధులు, అయివుంటే ప్రయోజనమేమిటి? బాధ్యతాయుత పరిపాలన కొరకు యించుమించు ప్రతి సంస్థానంలోనూ ప్రజలు కోరే పద్ధతి ప్రకారం స్పష్టమైన ప్రజా ప్రతినిధి సంస్థలు కావాలి అని సత్యమూర్తి కోరియుండవలసింది.

3. ప్రత్యేక నియోజక వర్గాలు,

ఇవి పోవాలని సత్యమూర్తి సూచించాడు. కాని, వేరు వేరు మత సంస్థల నాయకులతో సంప్రదించి వారిని ఒప్పించేవరకూ ఇప్పటి పద్ధతినే అనుసరించవచ్చు నన్నాడు. ముస్లిం లీగు నాయకులు, హిందు మహా సభవారు, కాంగ్రెసు సంస్థమీద ఎడతెగని ప్రతికూల ప్రచారం జరుపుతూన్న ఈ రోజులలో వారితో సంభాషణలు జరిపి, రాజీలు ఒడంబడికలు చేసుకోవడం అంటే కాంగ్రెసు సంస్థను అనేకరెట్లు బలహీన పరచడమన్నమాట. సామ్రాజ్యవాదుల పాదసేవకులనుంచి కాంగ్రెసు యెంత దూరంగా వుంటే అంత మంచిది.

4. ప్రత్యేక రక్షణలు

అక్టులో బ్రిటిష్ వ్యాపారస్థుల కీయబడిన ప్రత్యేక రక్షణలు రద్దుకావాలంటాడు సత్యమూర్తి. ఇండియా-బ్రిటన్ దేశాలమధ్య గౌరవప్రదమైన ఒడంబడిక ప్రకారం వర్తక వ్యాపారం జరగాలట, మంచిదే. కాని, దేశీయ వ్యాపారం విషయంలో బ్రిటిష్‌వారు మనల్ని అంతకంతకు సవతి తల్లి ప్రేమతోచూస్తున్నారు. గాని, గౌరవ మర్యాదలతో చూడ్డంలేదు. ఇండియా ప్రభుత్వంచేత నియమించబడిన అనధికార సభ్యులు ఇండియా బ్రిటన్‌దేశాలమధ్య వర్తకపు టొడంబడికకు కొన్ని సిఫార్సులు చేస్తే, అవి ఇంతవరకు అంగీకరించనేలేదు పైగా, లంకషైర్ వర్తకుల కోరికలు భారతీయులు చెల్లించకపోతే ఇండియానుంచి పత్తి దిగుమతి చేసుకోవటం మానివేస్తాం అని బెదరిస్తున్నారు. వ్యాపార సౌకర్యాలకొరకు మన దేశానికి వచ్చిన బ్రిటిష్‌వారు ప్రత్యేక రక్షణ లీయబడటంవల్లనే లాభాలు పొందుతున్నారు. ఇండియా అక్టులో అవి మరీ యెక్కువ చేయబడ్డాయి.

(మిగతా 18 వ పేజీలో)

ఫెడరేషనుమీద మోజు

(17 వ పేజీ తరువాయి)

గవర్నర్ల ప్రత్యేకాధికారాలు పోతూన్నట్టే గవర్నర్ జనరల్ ప్రత్యేకాధికారాలు కూడా ప్రయోగింపబడ కూడదంటాడు సత్యమూర్తి. కాని గవర్నర్ల ప్రత్యేకాధికారాలు ఎక్కడ పోయాయి? ఒరిస్సా, అస్సాం రాష్ట్రాలలో రైతాంగ బిల్లులకు గవర్నర్లు అనుమతి నీయ లేదు. నిర్బంధ శాసనాలను దద్దుచేయాలంటూ సరిహద్దు శాసనసభలో ప్యాసైన తీర్మానాన్ని నిరాకరించాడు గవర్నరు. అయినా, మొన్న అమర్త్య వైస్రాయి కలకత్తాలో యిచ్చిన ఉపన్యాసంలో సత్యమూర్తికి కావలసిన హామీ యిచ్చాడుగా?

5. విదేశ వ్యవహారాల విషయంలో ఇండియాకు అధినివేశ రాజ్యాల ప్రతిపత్తి ఉండాలట. అయితే లిబరల్‌పార్టీలాగ తయారవాలన్నమాట ఇతని నోటికి తాళం లేదా?

కాంగ్రెసు కూడా!

6. ఈపై మార్పులన్నీ ఇండియా ఆక్టు మార్చబడకుండానే చేయవచ్చునట. ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్‌లో యివి చేరిస్తే సరిపోతుందట!

దీనిఅర్థం, ఆక్టులో మనల్ని శాశ్వతంగా అణచియుంచే క్లాజులన్నింటినీ అట్లాగే ఉంచి, ఉత్తరువుల ద్వారా సవరణలుచేస్తేచాలు. బొంబాయిలో మొన్న 30 వ తేదీని సమావేశమైన లిబరల్ పార్టీ నాయకుల బుద్ధి యింతవరకూ వెళ్ళలేదు: ఆక్టులో ఫలాని సవరణలు చేయాలంటూ తీర్మానించారు. కాని, మన సత్యమూర్తికో? ఆక్టు ఆ ప్రకారంగానే ఉండవచ్చు! విదేశ పరిపాలకులచే తయారుకాబడ్డ యీ బానిస రాజ్యాంగచట్టాన్ని తిరస్కరిస్తూ కాంగ్రెసు మహాసభ తీర్మానించింది. భారతీయుల చేత ఎన్నుకొనబడే కాన్‌స్టిట్యుయంట్ ఎసంబ్లీకే భారత రాజ్యాంగాన్ని తయారుచేసే అధికారం ఉండాలని స్పష్టముగా తెలియజేసింది. సత్యమూర్తి యీ తీర్మానానికి వ్యతిరేకముగా ప్రచారం చేస్తున్నాడు. ఎట్టి మార్పులూలేకనే ఇండియా ఆక్టు పనికివస్తుందని వాదిస్తున్నాడు.

అంతేకాదు. ఫెడరేషన్‌లో ఏయే మార్పులు చేస్తే అంగీకరిస్తామో నేటివరకూ కాంగ్రెసు మహాసభ తెలిపి యుండలేదు. అట్టిచో సత్యమూర్తి కొన్ని మార్పులు అనధికార రీత్యా సూచిస్తూ వాటిని కాంగ్రెసు అంగీకరిస్తుందని దబాయిస్తున్నాడు. కాంగ్రెసు తీర్మానానుసారం దేశంలో తీవ్రమైన ఫెడరేషన్ ప్రతికూల ప్రచారముచేసే సోషలిస్టులు — కమ్యూనిస్టులు జాతీయైక్యతను భంగం చేస్తున్నారు అంటూ వారిపై విరుచుకుపడేకంటె జాతీయైక్యతకు యీవిధంగా ఘోరమైన భంగం కలుగజేస్తూన్న సత్యమూర్తి ప్రభృతుల నోళ్ళకు తాళంవేసే మార్గం ఆలోచించకూడదా, మన కాంగ్రెసు నాయకులు?

కాని, అన్నిటికంటె గర్హణీయం ఏమంటే, పై మార్పులు "త్వరలోనూ, దయతోను, ప్రసాదించకపోతే, కాంగ్రెసులోని అతివాదులకు బలం ఎక్కువౌతుం"దట. ఈలాంటి మాటలు గడ్డకట్టిన ఒక సామ్రాజ్యవాది నోటినుండి రావలసినవికాని కాంగ్రెసువాది నోటినుంచికాదు. బ్రిటిష్ వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వారిని మ్రొక్కడం లిబరల్‌పార్టీకి చెల్లిందికాని కాంగ్రెసు సంస్థకుకాదు. కాంగ్రెసులోని అతివాదులు ఎక్కువ బలం సంపాదించుకొంటారంటూ ప్రభుత్వానికి సలహాలిచ్చే సత్యమూర్తి ఏ లిబరల్ పార్టీలోనో ఉండవలసినవారు గాని, కాంగ్రెసులో కాదు.

వనితాలోకం

(16 వ పేజీ తరువాయి)

బంధంగా యేర్పరచి అ॥ భా॥ మ॥ సం॥ను కేంద్ర సంస్థగా చేయాలి. వనితాలోకము నాకర్షించి వారుత్సాహంగా పాల్గొనునట్లు చేయవలెను. ప్రాథమిక సంఘం మొదలు అ॥ భా॥ మ॥ సం॥ వరకూ అన్ని వర్గముల స్త్రీలకు సరియైన ప్రాతినిధ్య ముండునట్లు చేసి ప్రాథమిక సభ్యత్వ రుసుము కార్మిక స్త్రీలకు కూడా అందుబాటులో నుండునట్లు చేయవలెను. వెనుకబడి యున్న ప్రదేశములందు ఆర్గనైజర్లను విరివిగా వేసి ప్రచారము గావించి మహిళా సంఘముల నేర్పరుపవలెను. మన గమ్యస్థానము పురుషులతో పాటు ఆర్థిక రాజకీయ హక్కులను పొందుటయే. మన గమ్యస్థానమును చేరుటకు సమయానుకూలంగా తాత్కాలికంగా వచ్చు సమస్యలను బట్టి నినాదము లిచ్చుచుండవలెను. స్త్రీలు పూర్తి విజ్ఞానము బడయుటకు మహిళా సంఘం తరపున పాఠశాలలను తెరచి అందు శారీరకాభివృద్ధికి వ్యాయామశాలలనుగూడ అనివార్యంగా పెట్టాలి. మన మీ కార్యక్రమములు జరుగుటకు సంస్కరణతత్వమును ప్రధానముగాగొను మితవాదుల ధోరణి వీడవలయును.

మాప్లా తిరుగుబాటుపై నిషేధం!

కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్యగారిచే రచింపబడిన "మాప్లా తిరుగుబాటు" అనే తెలుగు పుస్తకాన్ని బెంగాలు ప్రభుత్వం నిషేధించింది.

మనము గమ్యస్థానమును చేరుటకు ప్రస్తుత సమాజమునందు ప్రబలి యున్న పెట్టుబడిదారీ విధానాన్ని దగ్ధం చేయాలి. ఫాసిస్టు పెనుభూతాన్నెదుర్కోవాలి. కాబట్టి మన పూర్తి కార్యక్రమాన్ని ప్రజా విప్లవం ద్వారానే అమలు జరుపగలుగుతాం. అంటే మనం బ్రిటిషుప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రజాస్వామికమును స్థాపించాలి; అందు మన మగ్రగాములై ఉండాలి. కాబట్టి మనసంఘాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘంగా చేసి అతివాద దృక్పథంతో నడపాలి. మన మబలలము కాము, సబలులమని నిరూపించాలి. మనం సబలులం కానంతవరకూ సమాజ బలం సగమేనని చెప్పాలి. మన దృఢ సంకల్పాన్ని ఏ మహాశక్తికూడా మార్పజాలదని ధృవపర్చాలి. అప్పుడే మనకు సర్వం సిద్ధిస్తుంరి. ఈ ఆశయముల నన్నిటినీ ప్రధానంగా పెట్టుకొని కృష్ణా జిల్లా మహిళా మండలి పని చేయు టెంతయు గర్వింపదగియున్నది. మన హక్కుల నన్నిటిని యీవ్యాసములో స్థలాభావముచే విపులంగా చర్చించలేకపోయాను.

పీడిత ప్రజలారా మేల్కొనుడు
విప్లవము వర్ధిల్లు గాక
సామ్రాజ్యవాదం నశించాలి
మహిళా సంఘాలకు జై

ప్రాణం అంటే ఏమిటి?

(15 వ పేజీ తరువాయి)

ప్రవర్తించడం; వాటికి తగినట్లుగా సర్దుకోవడము. వేడి, చలి, వెల్తురు, స్పర్శ యిటువంటి పరిస్థితులకు చేతనములన్నీ తగు రీతిగా సర్దుకుంటాయి ఎండ విస్తారముగా ఉంటే జంతువులు నీడలోకి పోవడము. చెట్లు ఆకులు ముడుచుకొనిపోవడంకూడా మనంచూస్తున్నదే. వెల్తురు రాగానే తామర పువ్వు వికసిస్తుంది; రాత్రి ముడుచుకొంటుంది. అచేతనమైన రాయి ఎండలో వేడెక్కి చలిలో చల్లబడ్డా, ఈ అనుగుణ ప్రవర్తన మాత్రం ఉండదు. పరిస్థితులను గ్రహించే చైతన్యశక్తి చెట్లల్లోకన్న జంతువులలోనూ, జంతువులలోకన్న మనుష్యులలోనూ అధిక మవుతుంది. ఈ గుణం వల్ల బాహ్య పరిస్థితులను అతిక్రమించ గలుగుతున్నాయి, చేతనములన్నీని. మనుష్యులలో ఈ చైతన్య శక్తి విస్తారముగా ఉండుటె మానవ నాగరికతకు కారణం.

పైన ఉదహరించిన ఐదు గుణములూ ప్రాణము యొక్క ముఖ్య లక్షణాలు. ఇవి చేతన పదార్థమైన ప్రోటోప్లాసంయొక్క గుణములు. ఆహారమును ప్రోటోప్లాసంగా మార్చడానికీ, తరువాత శ్వాసక్రియలో ప్రాణవాయువు సంయోగంచేత శక్తి నివ్వడానికీని, ప్రోటోప్లాసం రాసాయనికమైన మార్పులు చాలా పొందుతుంది. ప్రోటోప్లాసం ఈక్షణంలో ఒక సంపుటిగాఉంటె ఉత్తరక్షణంలో మరొకటిగా మారుతుంది. ఈ పరివర్తన పరంపరే ప్రాణం.

ప్రోటోప్లాసం చంచలమైనపదార్థం. దానిలో వేర్వేరు అచేతన పదార్థాలు వేర్వేరు పాళ్ళలో మిశ్రమమై ఉన్నాయని ఇదివరకే చూచాము. ఆ పాళ్ళు యేవో నిశ్చయముగా ఇంతవరకూ శాస్త్రజ్ఞులు తెలిసికోలేదు. పరిశోధనలు తీవ్రంగా జరుగుతున్నాయి. ఆ పాళ్ళు తెలిసికొని శాస్త్రజ్ఞులు ప్రోటోప్లాసమును తయారు చేయగలిగా మన్న మాట.

ఒకటి మాత్రం నిశ్చయం. ప్రాణం గాలి కాదు. జీవుని యొక్క గుణం అనడంలో అర్థంలేదు. ప్రోటోప్లాసంలో కలుగుతూన్న రాసాయనిక మార్పులయొక్క పరంపర. అదే ప్రాణం. ఈపరంపర ఎక్కడయినా అడ్డి ఆగిపోయిన యెడల అదే మృతి పొందడం. మోటారు కారులో ఎన్నో యంత్రాలు, పెట్రోలు, బేటరీ, మేగ్నిట్ ఉన్నాయి. ఇవన్నీ కలిసి పని చేస్తే మోటారు కారు నడుస్తుంది. ఏదైనా అడ్డంపడి ఒక్క భాగం పనిచేయకపోతే మోటారు కారు ఆగిపోతుంది. అంతే కాని కారు నడుస్తూన్నపుడుండి, ఆగినపుడు అందులోనుంచి ఎగిరిపోయేది ఏదీ లేదు. అట్లాగే ప్రోటోప్లాసం కూడా మార్పులు చెందుతూ వుంటే, ప్రాణ చలనం, చైతన్యం వుందంటాము. మోటారు కారుకు ప్రోటోప్లాసముకు ఒక్క భేదమున్నది. మోటారు కారు నడిపించుటకు డ్రైవరు కావలెను. ప్రోటోప్లాసముకు దానంతటదే మార్పులు చెందే గుణముంది. ఇటువంటి గుణాలు గలవి అచేతన పదార్థాలలో కూడా లేకపోలేదు. రేడియం అనే ధాతువు కొంతకాలంలో సీసముగా మారడం ప్రసిద్ధ విషయం.

ప్రోటోప్లాసం మార్పులు చెందుతూ ఉన్నంతసేపూ ప్రాణం ఉన్నదంటాము. ఆ మార్పుల పరంపర ఆగిపోగానే మృతినొందినదంటాము. చచ్చినవి అచేతనములు కావు; మార్పులు ఆగిపోయిన ప్రోటోప్లాసం. చెట్లు, జంతువులు చేతనములు. వాటి శరీరములు ప్రోటోప్లాసంచేత నిర్మితమైనవి. వీటిల్లో, ప్రాణలక్షణాలైన ఆహార గ్రహణం, ఎదగడం, సంతాన సృష్టి, శ్వాసక్రియ, చైతన్యం ఎట్లా ప్రత్యక్ష మవుతున్నాయో తెలుసుకోవాలి.

—'విజ్ఞానం' నుండి

ప॥ గో॥ జిల్లా జమీన్ రైతు మహాసభ

7-1-38 తేదీని ధర్మాజీగూడెంలో జరిగిన పశ్చిమ గోదావరి జిల్లా జమీన్ రైతు మహాసభకు అధ్యక్షత వహిస్తూ శ్రీ సుంకర సూర్యనారాయణగారు ఈ క్రింది విధంగా ఉపన్యసించారు:

కాంగ్రెసువారు మంత్రి పదవులను స్వీకరించుట తోడనే మన కష్టము లీడేరునని భావించితిమి.

ప్రస్తుతమున్న ఎస్టేటు లాండు ఆక్టులో జరుగవలసిన మార్పులను సూచించు నుద్దేశ్యముతో విచారణ సల్పి నివేదించుటకై రెవిన్యూ మంత్రి గౌ॥ ప్రకాశంగారి అధ్యక్షతను రెండు సభల నుండియు ఎన్నుకోబడిన ఒక విచారణ సంఘ మేర్పరుపబడినది. వారి నివేదిక నవంబరు నెలాఖరున ప్రకటింపబడినది. అంతటి నివేదికను ఎంతో శ్రమ కోర్చి సేకూర్చి ప్రకటించిన సంఘమువారునూ, ప్రత్యేకముగా రెవిన్యూ మంత్రి ప్రకాశంగారునూ ఎంతయు వందనీయులు.

చిరకాలానుగతమై, హిందూ, మహమ్మదీయ యుగములందును అంగీకరించబడి, పాశ్చాత్య ప్రభుత్వ ఫలితముగా భారతదేశ సంప్రదాయములు, పరిస్థితు లెరుగని ఆంగ్ల పాలకులచే, జమీందారులకు మేలు కూర్చుటకై తీసివేయబడ్డ రైతుల భూస్వామ్యపు హక్కు తిరిగి రైతుల కివ్వవలెనని చేసిన సూచనకు రయితులెంతయు కృతజ్ఞులు.

జమీందారులు రెవిన్యూ వసూలు చేయుటకు నియమింపబడ్డ ప్రభుత్వ ప్రతినిధి మాత్రమే గాని, అతనికి భూమియందు ఎట్టి హక్కు లేదనియు, రైత్వారీరైతులకు భూమియందు గల సర్వ హక్కులును జమీన్ రైతులకునూ కలవని స్పష్టపరచు టెంతయుసమంజసం.

జమీందారీ విధానము ఏల పోవాలి?

జమీందార్లు శిస్తు వసూలుకు ఏర్పరచబడ్డ వారగుటచే, ప్రస్తుత కాలములో శిస్తు వసూలుకు వారు అవసరము లేదు కనుక, జమీందారీ విధానమే రద్దుకావించవలెనని మనము చాలకాలము నుండియు ఆందోళన చేయుచున్నాము.

పైగా, పర్మనెంటు సెటిల్మెంటు ప్రకారం జమీందారులు పొందిన సనదుల ఉద్దేశ్యము ప్రకారము జమీందారు దేశములో శాంతిని కాపాడుటలో ప్రభుత్వమునకు తోడ్పడవలెను; దొంగలను, ఇతర నేరస్థులను పట్టుకొని ప్రభుత్వమునకు అప్పజెప్పవలెను. రయితు క్షేమమే తన క్షేమముగా భావించి వర్తించవలెను. తమకు వచ్చు శిస్తులో కొంత భాగము ప్రజోపయోగకరములైన వైద్యాలయములు, విద్యాలయములు, పశువైద్యాలయములు మున్నగువానికి వినియోగించవలెను. నీటి సదుపాయముల పోషించవలెను; క్రొత్తవానిని ఏర్పరచవలెను.

జమీందారు తన బాధ్యతను నిర్వర్తించుటలేదు కాన పర్మనెంటు సెటిల్మెంటు ఉద్దేశ్యమునకే భంగము కలిగినది.

ఆకాలమున ప్రభుత్వమువారికి జమీందారుల అవసరము కలిగి, వారు (జమీందారులు) పై విధుల నిర్వర్తించుటకును, శిస్తు వసూలు చేయుటకును, పర్మనెంటు సెటిల్మెంట్లు ఏర్పరచిరి.

కాని, ప్రస్తుత కాలమున జమీందారులు తమ విధులను నిర్వర్తించకపోవుటయే గాక, రైతులను అనేక విధములుగా బాధించుచున్న విషయము జగద్విదితము. అట్టిచో కమిటీవారి విచారణ ఫలితాలను బట్టి జమీందారీ విధాన నిర్మూలనము హేతుబద్ధము. కాన, ఆవిషయమును నివేదికలో స్పష్టపరచి ఉండవలసినది.

అట్లు చేయకపోగా పైపెచ్చు రానున్న క్రొత్త చట్టపీఠికలో జమీందారీ విధానమును అంగీకరించినట్లు స్పష్టపరచవలెనని సూచించుట విచారకరము.

శిస్తు నిర్ణయము

1801 వ సంవత్సరపు నాటి శిస్తు నిర్ణయమైనను మనము తాత్కాలికముగా అంగీకరించవలసినదే గాని, శాశ్వతంగా కాదు. ఎందువల్లనంటే, పూర్వకాలంలో భూమినుండి వచ్చు పంటలో పదియవ వంతు కొన్నాళ్లను, రాజ భాగము (అనగా శిస్తు) గా నిర్ణయింపబడెను. అది వదలివేసినను క్రొత్తపన్నుల సూత్రముల బట్టి పన్నుల విచారణ సంఘము (1926-27) వారును, మార్షు బాంక్సు సంఘము (1937) వారును, భూమి నుంచి వచ్చు నికరాదాయములో నాల్గవ వంతుకన్న భూమి పన్ను హెచ్చు ఉండదాదని నిర్ణయించిరి.

ఏ పన్నుల విధానమునైనను భూమినుండి వచ్చు నికరాదాయములో తన కుటుంబ ఖర్చులు పోను మిగతా ఆదాయం పైననే పన్నువిధించుట న్యాయము. ఖర్చులన్నీ పోను, రైతు కుటుంబ వ్యయమునకు తగు మొత్తమును వదలి, మిగిలిన ఆదాయముపై వృద్ధిక్రమానుగతముగా ఆదాయపు పన్ను విధించుట సక్రమమును, సశాస్త్రీయమును అగు మార్గము. ఆ లక్ష్యమునకే రైతు శ్రేయోభిలాషులును రైతుసంఘములును కృషి చేయుచున్నారు.

పట్టాలు: శిస్తు వసూలు

పట్టాలు యిచ్చు బాధ్యత, శిస్తు వసూలు, జమీందారుకే వదలుట రైతులకు కష్టదాయకము.

జమీందారు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించుచో, (ట్లు (జమీందారు) ప్రవర్తించుట సర్వసాధారణముగా జరుగుచునే ఉన్నది) అన్ని విధాల అశక్తుడైన రైతు ప్రభుత్వోద్యోగుల వద్దకును న్యాయస్థానములకును పోలేడు. చట్ట నిబంధనలను అమలుపరచుకోజాలడు.

అశక్తులకు, అందునూ సమస్త ప్రజలకూ కూడు పెట్టు రైతుకు రక్షణనిచ్చుట ప్రభుత్వ ధర్మము. కాన, పట్టాలిచ్చుట, శిస్తు వసూలు ప్రభుత్వము ద్వారానే జరుగుట ధర్మము.

స్వంత శేరీలు

జమిందారుకు రైతు భూమిని స్వాధీనమొందుంచుకొనుటకు గాని, తనదిగా చేసుకొనుటకు గాని వీలు లేకుండ చేయవలెననియు, రైతు భూమి మీద శిస్తు వసూలు హక్కు తప్ప మరి ఏ యితర హక్కును లేదనియు, స్పష్టపరచవలెనను సూచన మంచిదే గాని, అది చాలదు.

పర్మనెంటు సెటిల్మెంటు నాటికి ఉన్న అడవులు, కొండలు, గ్రామ కంఠములు, పచ్చిక బీళ్లు, గోభూములు మున్నగు పెక్కు సాముదాయక భూములను బంజర్లను, జమిందారులు తమ ప్రైవేటు భూమిగా మార్చుకొన్నారు. ఇట్టి భూములపై కూడ పైసూచనను బట్టి జమిందారుకు ఎట్టి హక్కు లేదు.

కాని, అట్టి ఆక్రమణలను తొలగించి, సాముదాయక భూములను ప్రజోపయోగమునకు వదలి, వ్యవసాయమునకు ఇవ్వదగు బంజరు భూములను భూమిలేని వ్యవసాయదారులు సహకార పద్ధతులపై వ్యవసాయము చేసుకొని అనుభవించు ఏర్పాట్లు చేయవలెను. లోగడ శిస్తు బకాయీల వేలములలో జమీందార్లు కొని అనుభవించుచున్న రైతు భూములను ఆ యా రైతులివ్వగలిగిన బకాయిశిస్తులు పుచ్చుకొని వారికివ్వవలెను.

కొన్ని అడవులను, కొండలను, సాముదాయక భూములను జమిందారులు తమ బంధువులకును, ఇతరులకును రైతు భూములుగా మార్చి, పట్టా లిచ్చిరి. అట్టివి ప్రజోపయోగమునకై శాసనరీత్యా యిప్పించవలెను.

జలాధారములు

కమిటీవారు జలాధారములను జమిందారు మంచి స్థితిలో నుంచవలెననియు, వీలున్నచో జలాశయనిధిని ఏర్పరచవలెననియు, జమిందారు జలాధారములను మరమ్మతు చేయనిచో ప్రభుత్వమే అతని ఖర్చుల మీద చేయించవలెననియు సూచించిరి. ప్రస్తుతమున్న చట్టంలోను ఇట్లే యున్నది. అనుసరించవలసిన విధానము ఇప్పటికన్న త్వరగా నడచునట్లుండవలెను. కమిటీవారి సూచన రైతులను తృప్తిపరుపజాలదు. జమిందారులు మరమ్మతు చేయించకపోవుటయు, రైతులు కొన్నాళ్ళు నష్టము అనుభవించుటయు జరుగును. కాన, జలాధారములనుకూడ ప్రభుత్వ పరిపాలన క్రిందనే తీసుకొని, వానిపోషణకును క్రొత్త వసతుల నేర్పరచుటకును, వలయు ధనమును జమిందారువద్ద సాలీనా రైతు చెల్లించు శిస్తు నుంచి వసూలు చేసి ఆ మొత్తమును జలాశయ నిధిగా ఏర్పరచవలెను. పంచాయతీలున్న చోట్ల నీటి వసతులను వానికి అప్పగించవలెను.

యీనాం రైతులు

ప్రస్తుతమున్న ఎస్టేటు లాండు ఆక్టు ప్రకారము యీనాం గ్రామములు కూడ ఎస్టేటులే. కాన, కమిటీవారు వానిని గూర్చి కూడ తమ సూచన లివ్వవలసియుండగా, అట్లు చేయక యీనాం గ్రామములను ఎస్టేటు నిర్వచనము నుండి తొలగించి, వానికి వేరే శాసనము చేయవలెనని సూచించుట విచిత్రము.

ఈనాం గ్రామములు యినాంగా యివ్వబడినపుడు అట్లు యిచ్చినవారు జమీందారులయినను, ప్రభుత్వమైన తమకున్న హక్కులే యివ్వగలరు గాని, రైతుల హక్కు నివ్వజాలరు. జమీందారుకు గాని, ప్రభుత్వముకు గాని శిస్తు వసూలు హక్కు మాత్రమే కలదు. స్వాధీన హక్కు రైతుదే. అందుచే ఈనాం గ్రామములు కూడ ఎస్టేట్లుగానే నిర్వచింపబడి, ... రైతులు జమీన్ రైతుల హక్కులన్నియు పొందవలెను.

ఒక సందేహం

జాతీయైక్యతకు ఇది వ్యతిరేకమా?

(ఒక కాంగ్రెస్ వాలంటీరు)

కొండపల్లి పంచాయితీ బోర్డు ఎన్నికలు. కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వాలంటీర్లు కావాలన్నారు మా కప్టెను సూరి శాస్త్రి గారు. సరే! నేనూ ఒకణ్ణి అన్నాను. మా కందరికి కొండపల్లి స్టేషనుకు టిక్కెట్లు కొని యిచ్చి తీసుకెళ్ళారు కొండపల్లి పంచాయితీ బోర్డు ఎలక్షనుల ప్రధాన నాయకుడు పెదర్ల వెంకటసుబ్బయ్యగారు.

తీరా కొండపల్లి ఊళ్ళోకి వెళ్ళితిని గదా అక్కడ ఒమాదిరి యువజన సంఘం వుంది. దాని పేరు హనుమాన్ క్లబ్బు. ఆ ఊళ్ళో కుర్రాళ్ళంతా ఈ ఎన్నికల్లో కాంగ్రెసు అభ్యర్థుల్ని వ్యతిరేకిస్తున్నారు. మా బెజవాడ యువజన సంఘంలో సభ్యుణ్ణి నేను. మేమూ కొడవలి సుత్తీ హత్తిన ఎర్రజెండాతోనే ఊరేగుతాము. కాని మా ఎర్రజెండా ఎపుడూ కాంగ్రెసును బలపరచడానికే నిలబడేది. అచటో; దీని కంతా విరుద్ధం. ఎర్రజెండా కాంగ్రెసు జెండాకు వ్యతిరేకంగా నిలుచుంది. ఎమిటిది? దీన్లో ఏదో పొరపాటుందనుకొన్నాను,

మర్నాడు కాశేశ్వరరావు, బయ్యా సూర్యనారాయణమూర్తి గార్లు ఉపన్యాసా లిచ్చారు. గూడెంలో ఒక మీటింగు ఏర్పాటు చేశారు. కాశేశ్వరరావుగారు రాజ్యం అధికారం, మా కాంగ్రెసుదే. కాంగ్రెసుకే ఓట్లివ్వాలన్నారు. బి. యస్. మూర్తిగారు కాంగ్రెసు హరిజనోద్ధరణకు కంకణం కట్టుకుంది, హరిజనులంతా కాంగ్రెసుకే ఓటివ్వాలన్నారు. సరి మీటింగు పూర్తి చేసుకొని వారెళ్ళిపోయారు. మేము ఓట్లన్నీ కాంగ్రెసుకే అనుకొన్నాము.

ఇంతలో హనుమాన్ క్లబ్బు ముఠా వచ్చారు. వారు ఇదివరకే వాళ్ళ మధ్య పనిచేస్తున్నారు కాబోలు; హరిజనులంతా చుట్టూ మూగారు. వారు కాంగ్రెసును తూలనాడలేదు: పొగడుతూనే మాట్లాడారు, కొండపల్లిలో కాంగ్రెసు తరపున నిలచిన అభ్యర్థులు కాంగ్రెసువారు కాదన్నారు. కాంగ్రెసు అస్పృశ్యతను రూపు మాపాలంటుంది. కాని ఈ అభ్యర్థులు నూతులలో హరిజనుల నీళ్ళు తోడుకోనిస్తామని వ్రాసివ్వమంటే నిరాకరించారు. కాంగ్రెసు మద్యపాన నిషేధం చెయ్యమంటూంటే యిచట సారా, కల్లు యిజారాదార్లు కాంగ్రెసు అభ్యర్థులా! ఎంత అన్యాయం! కాన స్వతంత్రులకే ఓట్లివ్వమన్నారు. అచట ఉన్న హరిజనులు "నిజమేనండి బాబూ! వారంతా మాలమాదిగల్ని ఆమడదూరా నుండమంటారు. మీరే మా అజ కనుక్కొంటున్నారు. మీకే ఓటిత్తా"మన్నారు.

తరువాత ఆ యువకబృందం నాయకుడుతో మాట్లాడాను. అతడు తామూ కాంగ్రెసు వారమే; సుభాసు చంద్రబోసు ఇటుప్రయాణం చేస్తారన్నపుడు వెయ్యిమందిని స్టేషనుకు తీసుకుపోయామన్నాడు. వాళ్ళక్లబ్బుకు 'నవశక్తి' పత్రిక వస్తుందట. సోషలిజమంటే అభిమానం. అయితే కాంగ్రెసు వ్యతిరేక ప్రచారం ఏమిటన్నాను నేను.

వారంతా ఒక ఎన్నికల ప్రణాళిక తయారుజేసారు. (1) గొడ్లను బందిలదొడ్లో పెట్టకుండుట (2) అడవిలో నుంచి కట్టెపుల్లలు తెచ్చుకోనిచ్చుట (3) నూతులను హరిజనులకుతెరచుట (4) హనుమాన్ క్లబ్బుకు పుస్తకాలు, పత్రికలు తెప్పించుట (5) ఇవన్నీ ఒక సంవత్సరంలో పూర్తిచేస్తామని వ్రాసియివ్వాలి. ఇవన్నీ కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికకు విరుద్ధమైనవి కావు. అనుకూలమైనవే. విషాదమేమిటంటే అచటి కాంగ్రెసు అభ్యర్థులు వాటిని అంగీకరించలా! స్వతంత్ర్య అభ్యర్థులు ఆకోర్కెలు అంగీకరిస్తామని సంతకము చేసారు!! హనుమాన్ క్లబ్బు వాళ్ళకు సాయంచేసింది. ఇంతేగాదు! 35 వేల సభ్యత్వాన్ని రద్దు చేయించారనీ, కొండపల్లిలో చేర్పించిన 250 కాంగ్రెసు సభ్యుల్లో 50 మంది దగ్గరమాత్రమే 0-4-0 వసూలుచేశారనీ, ఇదంతా కాంగ్రెసుకు ద్రోహంకాదా? అని అడ్డుప్రశ్న వేసాడు.

నేను "ఇదికాదు! కామ్రేడ్! మీ ప్రణాళికపై సంతకము చేసారేకాని, యీస్వతంత్ర్య అభ్యర్థులు మాత్రం నమ్మతగిన వాళ్ళా"అని అడిగాను. అతడు "వీళ్ళు దగా చెయ్యొచ్చు. అపుడు వాళ్ళపనీ చూడాలి, మన కోరికలు చేయమని నిరాకరించే వాళ్ళకంటే చేస్తామనే వారు మెరుగుకాదా! దగాచేస్తే ప్రజలు మనవైపున్నారుగా"అన్నాడు.

ఎన్నికలు జరిగాయి 2 రు మాత్రం కాంగ్రెసువారు నెగ్గారు. తక్కిన 10 మంది స్వతంత్రులు నెగ్గారు. నాటినుండి నాకొక సందేహం!

కాంగ్రెసు తరపున పెట్టిన కాండిడేటులు కొత్తగా ముతకబట్టలు కట్టినవారు; అచటి రైతులు, కూలీలను వ్యాపారంలో, వడ్డీతో పీక్కుతినేవారే. అచటి యువకులు కోరిన ఎన్నిక వాగ్దానాలు సక్రమమైనవే. కాని గొప్పదైన కాంగ్రెసు సంస్థపేరు ఇటువైపు: అటువైపు మొన్నటివరకు జస్టిసువారైన స్వతంత్రులు. ప్రజలకిష్టమైన కోర్కెలకు ఒప్పుకోలేదు వీరు. వారు ఒప్పుకొని సంతకంచేసారు, వారికే యువకులు సాయముజేసారు. నెగ్గారు. కాని విషాదమేమిటంటే కాంగ్రెసు ఓడిపోయిందనే కబురు వినడం కష్టంగా వుంది.

హనుమాన్ క్లబ్ యువకులు చేసినది సబబేనా? సక్రమంగానే నాకు కాన్పిస్తూంది. కాని సంయుక్త ప్రతిఘటనకు వ్యతిరేకం గాదా? అనేదే అనుమానం!

న.వ శక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3-0-0
అర్ధ సంవత్సర చందా	1-10-0
విడిప్రతి	0-1-0

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

నెలకు 20 అం॥ లోపల అంగుళానికి	రూ.	0-6-0
„ 20" అం॥ పైన	„	0-4-0
„ 100" అం॥ పైన	„	0-3-0
పేజీ	రు 10-0-0 లు	
½ పేజీ	6-0-0 లు	
¼ పేజీ	3-0-0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్‌లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0-8-0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు డబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

మేనేజరు

నవశక్తి.

* * *

చందాదారులను చేర్పించాలి!

జనవరిలో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"ను పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం

ముఖ్యంగా పార్టీసభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తిచేస్తారని నమ్ముతున్నాం.

	జనవరి నెల కోటా	మొదటి వారంలో చేర్పించినది.
విశాఖపట్టణం	5	1
తూ. గోదావరి	30	4
ప. గోదావరి	50	2
కృష్ణా జిల్లా	50	10
గుంటూరు	30	7
నెల్లూరు	20	2
రాయలసీమ	10	1
ఇతర స్థలాలు	5	1
	200	28

చైనా - స్పైను ఫిల్ములు

కామ్రేడ్స్,

కామ్రేడ్ టెండుల్కరు ఫిబ్రవరి 4వ తారీఖునుండి చైనా. స్పెయిను యుద్ధఫిల్ములను ప్రదర్శించడానికి ఆంధ్రరాష్ట్రములో పర్యటనము ఆరంభించును. ఈ ప్రదర్శనములవల్ల వచ్చిన డబ్బంతయూ చైనాకు వెళ్ళియున్న భారతీయ అంబులెన్సుకు పంపబడును.

ఫిబ్రవరి	5 బెజవాడ	ఫిబ్రవరి	18 తెనాలి
„	6 గుడివాడ	„	19 గుంటూరు
„	7 బందరు	„	21 నంద్యాల
„	8 భీమవరము	„	22 కర్నూలు
„	9 పాలకొల్లు	„	23 అనంతపురం
„	11 రాజమండ్రి	„	24 కడప
„	12 కాకినాడ	„	35 నెల్లూరు
„	13 విశాఖపట్టణము	„	27 28 } మద్రాసు
„	14 విజయనగరము	మార్చి	1, 2 } మద్రాసు
„	15 ఏలూరు		

ఆయా స్థలములలోనున్న పార్టీ సభ్యులందరు కాంగ్రెస్ సంఘాలతోను, ఇతర పుర ప్రముఖులతోను కలిసి ఈ ప్రదర్శనములకు కావలసిన ఏర్పాట్లు చేయ మొదలు పెట్టాలి.

1. ప్రదర్శించడానికి సినిమా హాలులను ఉచితముగా ఏర్పాటు చేయవలెను.

2. ఆయా మ్యునిసిపాలిటీలనుండి ఎంటర్టెయిన్‌మెంటు టాక్సు లేకుండచేయవలెను.

3. ఇప్పటినుండే టిక్కెట్లు అమ్మవలయును. టిక్కెట్లు చైనానిధికి విరాళములుగా అమ్మవలయును. అంటే, 5 రూ. టిక్కెట్లు, 1 రూ. టిక్కెట్లు, 0-8-0 టిక్కెట్లు, 0-2-0 టిక్కెట్లు అమ్మవలయును. సినిమా హాలులో ఎంతమందికి స్థలముందో అన్ని టిక్కెట్లు మాత్రమే అమ్మవలయును. ఇంకను ఎక్కువమంది వున్నచో ఆయా రోజులలోనే రెండవ ప్రదర్శనానికికూడ ఏర్పాట్లు చేయవలయునేగాని, ఫిల్ములు రెండవ రోజు వరకు ఉంచవలయునని కోరడముగాని, సినిమా హాలులను క్రిక్కిరిసి ఉండేటట్లు చూచి అల్లకల్లోలము గావించడముగాని చేయకూడదు.

4. ఈ నెల 20 వ తారీఖు లోపల ప్రతిస్థలమునుండి వారువారుచేసిన ఏర్పాటులను గూర్చి పూర్తి వివరాలతో జాబు వ్రాయాలి. లేనిచో ఆయాస్థలములు కార్యక్రమమునుండి విరమింపబడును.

5. టెండుల్కరుకు, వారితో వచ్చు ఒకరిద్దరికి తగిన సదుపాయాలు చేయవలయును.

6. రష్యా చిత్రాలు ప్రస్తుతము తీరుకురావడములేదు. ఫిల్ములు జయప్రదంగా ప్రదర్శించడానికే ఎల్లరూ శక్తికొలది గా ప్రయత్నించవలయును.

7. ఫిల్ములు టాకీలు 2 గంటలుపట్టును.

పు. సుందరయ్య,

నవశక్తి ఆఫీసు, బెజవాడ.

సత్తెనపల్లి తాలూకా రాజకీయ పాఠశాల

మన తాలూకాలో రాజకీయోద్యమంలో పని చేయుచున్న యువకులకు, పనిచేయు ఉత్సాహము గలవారికి అవసరమైన రాజకీయవిజ్ఞానమును గలుగజేయుటే యీపాఠశాల నేర్పరచు యుద్దేశము. మనదేశీయులు సుఖపడాలంటే బ్రిటిష్‌ప్రభుత్వపరిపాలన మొదటఅంతమొందాలి నేడు స్వాతంత్ర్యోద్యమంలో పనిచేయుచున్న వారందరు ప్రజాఉద్యమాన్ని యెలా నడపాలో? మన దేశముయొక్క ప్రత్యేక పరిస్థితులేమిటో? నేడు తారుమారగుచున్న ప్రపంచ పరిస్థితులతో మన స్వాతంత్ర్యోద్యమమునకు గల సంబంధమేమో? విపులంగాతెలుసుకోవాలి.మనఉద్యమం యే పరిస్థితులలో ఆరంభమై నేడెంతవరకు అభివృద్ధిచెందింది? ప్రస్తుతం మనల నెదుర్కొంటున్న క్లిష్టసమస్యలు వీటిపై మనదేశంలోని వివిధ రాజకీయ పక్షముల అభిప్రాయములు మనకు బాగా తెలియాలి.

ఇంతేగాక ప్రస్తుతం నూటికి 90మందిఎన్నో బాధలు పడుచున్న ఈసమాజమునకు మారుగా ప్రజలందరు యేకొరతలేకుండా సౌఖ్యంగా జీవితము గడపాలె, అనే ఆశయం గలిగిన సహచరు లందరము సంఘం ఈ పరిస్థితికి యెలా పరిణమించిందో? అంతాసౌఖ్యపడాలంటేసమాజమెట్లా మారాలో? తెలిసికొని వీటి విషయమై యున్న వేర్వేరు అభిప్రాయాలు చర్చించి ఒక నిర్ణయమునకు రావాలి. అప్పుడే మనకందరకు ఉద్యమంలో పనిచేయుటకు అవసరమైనప్రత్యేక దృష్టి అలవడుతుంది. ప్రజాఉద్యమాన్ని జయప్రదంగా నడపాలంటేఉద్యమపంధానుముందుగా చూడగలిగియుండాలి, ఈ కొలదిరోజులలో యిందుకవసరజ్ఞానాన్ని సాధ్యమైనంత చక్కగా కలుగజేయు నుద్దేశముతో యీ క్రింది పాఠ్యక్రమమును యేర్పచడమైనది.

సిలబస్

1. మనదేశం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దాస్యమునకు ఎలా లోనుగావలసివచ్చింది. ఆర్థికంగాను, రాజకీయంగాను, భారతదేశం పొందిన మార్పులు.

2. కాంగ్రెసుపుట్టుక, జాతీయోద్యమ పరిణామము. దీనికి సంబంధించిన నిర్మాణ సమస్యలు.

3. 1857 సం॥మొదలు నేటివరకుఇండియా రాజ్యాంగవిధానంయొక్క పరిణామము. 1858 ఇండియాఆక్టు. 1861 యిండియన్ కౌన్సిల్సు యాక్టు. 1892 ఇండియాకౌన్సిలు యాక్టు. 1909 మింటోమార్లే సంస్కరణలు. 1919 మాంటుపర్డు సంస్కరణలు. 1935 ఇండియా గవర్నమెంటు యాక్టు.

4. హిందూదేశ పారిశ్రామికాభివృద్ధి.

5. కార్మికోద్యమము. అఖిలభారత ట్రేడ్ యూనియన్, ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ సంయుక్త ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్. కార్మికోద్యమయెడల కాంగ్రెస్ నాయకత్వమువైఖరి, కార్మికోద్యమానికి జాతీయోద్యమానికి సంబంధము.

6. అ. భా. రైతు ఉద్యమము-వివిధ రాష్ట్ర ఉద్యమ కేంద్రీకరణము. కాంగ్రెసు నాయకత్వ వైఖరి.

7. అ. భా. విద్యార్థి ఉద్యమం-జాతీయోద్యమంలో దాని భాగము.

8. వివిధ రాష్ట్రములలో వ్యయసాయకూలీ యుద్యమము-రైతు-వ్యవసాయ కూలీ సంయుక్త నిర్మాణ సమస్యలు.

9. యువజనోద్యమము-ప్రస్తుతం యువజన సంఘాలు చేయవలసిన పని.

10. అ. భా. మహిళా ఉద్యమము-వివిధ దేశములలోని మహిళా సంఘాలు.

11. అ. భా. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పుట్టుక-కాంగ్రెస్ అతివాదులు. నేటి సోషలిస్టు ఉద్యమము.

12. సామ్రాజ్య ప్రతికూల సంయుక్త సంఘటన (యునైటెడ్ ఫ్రంటు)

13. సంస్థానములు 1857 సం॥ పూర్వం. తర్వాత వీటి స్థితి గతులు. బ్రిటిష్ సామ్రాజ్య ప్రభుత్వమునకు-సంస్థానాధీశులకు గల సంబంధం-సంస్థాన ప్రజా ఉద్యమ విజృంభణ-కాంగ్రెస్ నాయకత్వ వైఖరి.

14. సంఘం అనాదినుంచి ప్రస్తుత పరిస్థితులకు ఎలాపరిణామం చెందింది?

15. నేడు ప్రజల దాస్యమునకు మూల కారణమైన సామ్రాజ్య వాదంయొక్క లక్షణాలు.

16. ప్రభుత్వం-దాని పుట్టుక వేర్వేరు సాంఘిక వ్యవస్థలలో ప్రభుత్వము చేస్తూ వచ్చెడి పనులు. పెట్టుబడిదారీ పద్ధతిలో ప్రభుత్వము చేస్తున్న పని. సోషలిస్టు సమాజంలో ప్రభుత్వం యొక్క పని. కమ్యూనిస్టు సమాజంలో ప్రభుత్వము యెలా కృశించి పోతుంది.

17. సంఘముయొక్క మానసికాభివృద్ధికి, ఆర్థిక పరిస్థితులకును గల సంబంధము-దీనిపై కారల్ మార్క్సు అభిప్రాయము.

18. జాతీయత-దాని లక్షణములు-యూరప్‌లోని ప్రజా తంత్రము, జాతీయోద్యమములు.

19. రష్యా జారు ప్రభుత్వ పరిపాలన— 1917 బోల్షివిక్ విప్లవం-పంచవర్ష ప్రణాళికలు-ప్రస్తుత రాజ్యాంగ విధానము, కుట్రలు-ప్రభుత్వ శిక్షలు-సోవియట్ యూనియన్ అంతర్జాతీయ వైఖరి.

20. స్పెయిన్, చైనా, పాలస్థయిన్ దేశాల ప్రజా పోరాటాలు-ఫాసిస్టు, సామ్రాజ్యవాదుల దుండగాలు.

21. ఆయా దేశ పటముల సహాయంతో-ప్రపంచమందలి వివిధ దేశాల రాజ్యాంగ విధానాలు-విస్తీర్ణములు-ఆర్థిక సంపత్తి-వీటినైసర్గిక స్వరూపములు రైళ్లు, ఓడలు మొదలైన రాకపోకల సౌకర్యాలు.

22. రైత్వారీ పద్ధతి-జమీందారీ పద్ధతి-యు. పి, బీహార్, బొంబాయి, పంజాబు, బెంగాలు, మద్రాసు రాష్ట్రములలోని ఇటీవలి టేనెన్సీ బిల్లులు. ప్రకాశం కమిటీ రిపోర్టు.

23. భూమి శిస్తు విధానం—

24. రాష్ట్ర స్వపరిపాలన — కాంగ్రెసు మంత్రిత్వాలు.

25. కాంగ్రెస్ మంత్రి పదవులు స్వీకరించిన వివిధ రాష్ట్రములలో మంత్రులు అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికను ఎంతవరకు ఆచరణలో పెట్ట గలిగారు.

26. ఫెడరేషన్-లోపాలు-దీనిని భగ్నము చేయడమెలా?

27. బాషాప్రయుక్తరాష్ట్రవిభజన - ఆంధ్ర రాష్ట్రియుద్యమము.

28. గ్రంథాలయోద్యమము - వివిధ దేశ గ్రంథాలయసంఘములు - గ్రంథాలయ నిర్వహణము.

29. సహకారోద్యమము.

30. వయోజనవిద్య.

31. గ్రామపంచాయితీ విధానం.

ఇట్లు.

దాట్ల గురవరాజు (ఆర్గనైజరు)

మాదల వీరభద్రరావు (కార్యదర్శి)

తాళ్ళూరు

కోసూరు పోష్టు

బెజవాడ విద్యార్థి ప్రచారక సంఘం

పైసంఘమువారు డిశంబరు 29 తేదీ బెజవాడలో బయలుదేరి, పునాదిపాడునకు వెళ్లిరి. అచట కంకిపాడు, మారుతీ సినిమాహాలులో నొక గొప్ప సభ జరిగెను. పోలపరపు మధుసూదనరావు గారధ్యక్షతవహించిరి. ప్రచారక సంఘకార్యదర్శియైన అడవికొలను శీతారామారావు సంఘమువారి ప్రచారముయొక్క ముఖ్యోద్దేశమైన 'సెలెక్షను'లనుగూర్చియు, డిటెన్షన్లను గూర్చియు ఉపన్యసించిరి. బెజవాడ విద్యార్థుల సమ్మె సంగతులను పూసగ్రుచ్చినట్లు చెప్పిరి. తరువాత 'జిల్లా విద్యాశాఖాధికారి'గారి సర్క్యులరును, దాని 'ఖండన'ను వినిపించిరి.

తరువాత తల్లిదండ్రుల కర్తవ్యమునుగూర్చి శిరిపురపు కోటేశ్వరరావుగారు విపులముగా నుడివిరి. తమబాలుర నందఱను గవర్నమెంటు పరీక్షకు పంపుడనియు, సెలెక్షన్ పద్ధతిని వెంటనే అపుచెయించుడనియు, తెలుపునట్టి దరఖాస్తుఫారములు విద్యాశాఖాధికారు లందరికి తల్లిదండ్రుల సంతకములతో పంపునట్లును, అటులే విద్యార్థులుకూడా ఈ విధానమును అపుచేయించవలెనను తీర్మానమును పంపిరి.

30-12-38 వ తేదీన తాడంకియందు నాగిశెట్టి పున్నయ్యగారి అధ్యక్షతక్రింద హైస్కూలులో గం. 1-39 ని॥ లకు సభ జరిగెను. చేవూరు వెంకటబంగారురావుగాడు ప్రచారసంఘమువారు యీజిల్లా ప్రచార మేల చేయవలసివచ్చెనో, దీనివలన విద్యాధికారులయందు కలుగు అలజడినిగూర్చియు, తీవ్రముగ ఉపన్యసించిరి. అవసరమగునెడల జిల్లాయందలి ప్రతి స్కూలును 'డిటెన్షన్ల' పద్ధతికై సమ్మెచేయవలెనని ఖండితముగాచెప్పిరి. సంఘనిర్మాణ క్రమమునుగూర్చియు దానివలన లాభములను గూర్చియు సవిస్తరముగాచెప్పిరి. సభవారు ఈ క్రింది తీర్మానము ఏకగ్రీవముగా నామోదించిరి.

2. ప్రస్తుత విద్యావిధానమునందలి డిటెన్షన్ల పద్ధతిని రూపు మాపజేయుటకై తగిన చర్య దీసికొనవలసినదను అభిప్రాయమును, మద్రాసు విద్యాశాఖామాత్యులగు గౌ. సుబ్బరాయునుగారికిని తదితర అధికారవర్గమువారికినీ, విద్యార్థుల వద్దనుండియు, తల్లిదండ్రులవద్దనుండియు పంపవలసినదిగా యీసభవారు తీర్మానించడమైనది.

31-12-38 తేదీన పామర్రు గ్రామమున సాయంత్రము 3 గంటలకొక గొప్ప బహిరంగ సభజరిగెను. వై. బసవయ్యగారు అధ్యక్షత వహించిరి. కృష్ణాజిల్లా విద్యార్థి సంఘ సహాయ కార్యదర్శులైన వై. దుగ్గప్రసాదరావు, పామర్రు గ్రామమునందలి విద్యార్థుల కష్టసుఖములను గూర్చి విపులముగ నుపన్యసించిరి. 'సెలెక్షను' పద్ధతిని రూపు మాపుటకై విద్యార్థి ప్రచారక సంఘమువారు ప్రస్తుత మవలంబించుచున్న విధానమును తెలియబరచిరి. తరువాత ప్రచారకసంఘ సహాయకార్యదర్శియైన పోలూరి ఆంజనేయ ప్రసాదరావుగారు విద్యార్థులు సమ్మె చేయవలసిన విధమును, బెజవాడ విద్యార్థులు సమ్మెలయందనుభవించిన కష్టములను, అందు తమ కాలేజి విద్యార్థులెట్లు పాల్గొనినదియును విపులముగ నుపన్యసించిరి. విద్యార్థులీసమరమునందు జాతిమత వివక్షతలేక పోరాడవలయునని నుడివిరి.

2-1-39 తేదీన ఈసంఘమువారు బందరులో మునిపల్లి రామారావుగారి యధ్యక్షతక్రింద ఉదయము 8 గంటలకు టౌనుహాలులో సభ జరిపిరి. వీరు ప్రస్తుత విద్యావిధానమే మార్పు జెందవలయుననిరి. పరీక్షావిధానమే విద్యార్థి జీవితమునకొక కళంకమని చెప్పిరి. అందు యీ సెలెక్షన్ పద్ధతి మరింత హేయమని చెప్పిరి. దీనికై అందరికంటె ముందు నష్టపడుచున్న తలి దండ్రులెక్కువ శ్రద్ధ వహింపవలయునని నొక్కి వక్కాణించిరి. రాష్ట్రకాంగ్రెసు సంఘమువారి వద్దకు కొట్రగడ్డ రాజగోపాలరావు గారును, మి. సత్యనారాయణ, బి. ఏ., గారును వెళ్ళిన సమాచారమును తెల్పిరి. ఇక సమ్మె విషయమై మాట్లాడుచు, సమ్మె సాగించు విధానమును, విద్యార్థుల ఐక్యతనుగూర్చియు విపులముగ ఉపన్యసించిరి.

పిదప అడవికొలను శీతారామరావు, కోటేశ్వరరావుగార్లు బెజవాడ విద్యార్థులు సమ్మెయందు అనుభవించిన కష్టములను గూర్చియు విద్యాధికారులు తమ సంఘీభావమును చెడగొట్టుటకు చేసిన ప్రయత్నములను తెలియబరచిరి.

ఈ సెలెక్షనులందు విద్యార్థులకు గలుగుచున్న అన్యాయములను గురించియు వ్యక్తిగత ద్వేషములవలన, మంచి తెలివిగల విద్యార్థులను పరీక్షకు పంపకుండుటయు, దీనివలన బీదవిద్యార్థులు అనుభవించు కష్టములు దుర్భాహ్యములని నుడివిరి.

ఈక్రింది తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదింపబడెను.

1. సెలెక్షనుపద్ధతియు, డిటెన్షను విధానములను రద్దుచేయుటకు తగినచర్య వెంటనేతీసికొనవలసినదిగా విద్యాశాఖాధికారులను కోరుచూ యీసభవారు తీర్మానించుచున్నారు.

2. విద్యార్థులవద్దనుండియు, పోషకులవద్దనుండియు పంపబడుదరఖాస్తులన్నీ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘమువారిద్వారా మదరాసురాష్ట్రీయ విద్యార్థి మహాసభవారికి పంపునట్లు ఈసభవారు తీర్మానించబడమైనది. అధ్యక్షులకు వందనములతో సభముగిసెను.

నేటి ప్రపంచం

(13 వ పేజీ తరువాయి)

బలపర్చనని వారనుకుంటున్నారు. అందుచే మనకు కావాల్సింది మార్చి మార్చి అడగాలి.

ము—నాకు జిబోతీ, సూయజుకాలువలు వచ్చే నిసపిదప నీవు యుక్రెయినును అడిగి తీసు కుంటావు!

హి—అవును.

ము—పిదప నేను ట్యూనిస్‌ను అడుగుతాను.

హి—సరిగ్గా అలా చేయాలి.

ము—చాల బాగుంది! పిదప?

హి—నేను రుమేనియాను, కాలనీలను తీసు కుంటాను.

సంభాషణ ఈ విధంగా జరిగింది. ఆ సంభాషణ పూర్తి అయ్యేటప్పటికి, ఇటలీకి ఆల్జీరియా పచ్చింది. హిట్లరుకు ఏర్షియా, ఫ్రాన్స్‌లోని ఆలేస్‌లో రెయినులు వశమవుతాయి.

ఇంగ్లండుకుకూడ ప్రపంచ ఆర్థిక క్షోభ చిరిగి పట్టుకుంది. ఇంగ్లండు మారకపు రేటు తారుమారయ్యే పరిస్థితులు కల్గుతున్నాయి. ఒకటి రెండు నెలల ముందు విదేశాలకు అప్పు ఇవ్వ వద్దన్నారు. ఆయినా బ్రిటిషు ప్రభుత్వం యొక్క విదేశాంగ నీతి వలన బ్రిటనుమీద నమ్మకములేక అనేకమంది బ్రిటనునుండి తమ మూల ధనాన్ని అమెరికాకు మార్చుతున్నారు. ఎగుమతులు తక్కువ. దిగుమతులు ఎక్కువగా కూడ ఉన్నాయి. అందుచే ఇంగ్లండు బంగారాన్ని ఎగుమతిచేయక తప్పడములేదు. దీనితో మారకపు రేటు తారుమారవుతూ ఉంది. దీనిని పడిపోకుండా కాపాడడానికి, బ్యాంకి నోట్లు 23 కోట్ల పౌనులనుండి 40 కోట్ల పౌనులవరకు పెంచారు. ఈ 17 కోట్ల పౌనులను బ్రిటిషు మారకపు రేటును కాపాడడానికి ఎక్స్చేంజి ఈక్విలైజేషన్ ఫండుకు వినియోగిస్తారు. ఫ్రెంచి బ్యాంకికూడ లండన్ బ్యాంకికి పూర్తిగా సాయము చేస్తానంటూ ఉంది. 1931 లో ఇట్టి పరిస్థితులలోనే బ్రిటిషు కార్మికపార్టీ తమ అధికారాన్ని కన్సర్వెటివ్ పార్టీవారి కప్పజెప్పారు. నేడు కన్సర్వెటివు పార్టీ ప్రపంచ యుద్ధాన్ని తీసుకరావడము మూలంగా నైతేనేమి, లేక కార్మికుల సౌకర్యాలను మరింత తగ్గించడము వల్లనైతేనేమి తప్పుకోడానికి చూస్తుంది. కాని అప్పుడే లండను నగరములో "పనియైనా ఇవ్వండి లేకపోతే ఆహారమైన ఇవ్వండి" అని నిరుద్యోగులు ఆందోళన చేస్తూఉన్నారు.

జర్మనీ : అమెరికా

అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్టు అమెరికను కాంగ్రెసు(అమెరికను పార్లమెంటు) సమావేశమయినపుడు ఒక ఉపన్యాస మిచ్చాడు. "ప్రపంచాన్నంతా ఆవరించాలసిన యుద్ధం ఆపబడింది. అయితే శాంతిఇంకా ఏర్పరుపబడలేదు. మనచుట్టూ బహిరంగంగా ప్రకటించకనే యుద్ధాలు సాగుతున్నాయి. అవి ఆర్థికంగాను, సైనికంగానుకూడ ఉన్నాయి. రోజు రోజుఆర్థిక సైనిక ఆయుధాలు వృద్ధవుతున్నాయి. రోజు రోజు క్రొత్త ఆర్థిక సైనిక యుద్ధాలు ఆరంభమవ్వే సూచనలు కనపడుతున్నాయి. అమెరికనులకు ముఖ్యమైన మతము, ప్రజాతంత్రము, అంతర్జాతీయ సామరస్యమును తృణీకరిస్తూ విదేశాలనుండి ఛాలెంజిచేస్తున్నారు. ఈలాంటి తుపానులను, ఏమూలనుండి వచ్చినా ఎదుర్కొని మన గోళముపైపుకు రాకుండ జేయడానికి అమెరికను ప్రజలు పూనుకొనిఉన్నారు"

యుద్ధాలను ఆపుచేయడానికి, ఆయుధములను పెంపొందించడము ఆపుచేయడానికి వర్తకము తిరిగి వృద్ధి పొందడానికి ఇతర దేశాలతో కలసి పనిచేయడానికి మనము ఎప్పుడూ తయారే. కాని ప్రపంచము చాల చిన్నదైనది. ఆయుధాలు చాల వేగముగా ఉపయోగించడానికి వీలవుతూ ఉంది. ఈ పరిస్థితులలో ఏ ఒక్క దేశమైనా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, ధిక్కరించడానికి పూనుకుంటే, ఏ దేశముకూడా శాంతిని కాపాడలేదు. అట్టిదేశానికి తగినజవాబు మాటలు నిష్ప్రయోజనము కావచ్చు. కాని మానవజాతి యంతటి అభిప్రాయాలను గౌరవింపజేయడానికి యుద్ధమేగాక ఇంకను మార్గాలు కలవు. మన తటస్థ చట్టాలు ఇతరదేశాలపై దాడివెడలిన వానికి లాభప్రదంగాను, వానిక్రింద బడి నలుగుతూవున్న దేశాలకు నష్టదాయకంగాను పరిణమించవచ్చును. కేవలము ఆత్మ రక్షణార్థమైనా అలా ఇకముందైనా కానివ్వకుండా జాగ్రత్తపడాలి. మరియొకవిధమైన ప్రభుత్వ విధానము, ప్రజాతంత్రాన్ని ఎదుర్కోడానికి ఐక్యతను చూపగలిగితే ఆదాదిని సంయుక్త ప్రజాతంత్ర ప్రభుత్వాలు ఎదుర్కోవాలి.

ఒక దేశముయొక్క సామాజిక, ఆర్థిక సంస్కరణ కార్యక్రమము ఆయుధ నిర్మాణమువలె దేశ సంరక్షణకు మూలాధారమైనది. మనదేశములో శాంతికాలమున సమర్థతతో ఆత్మ సంరక్షణకు కావలసిన ఏర్పాట్లు చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఉన్నాము. నియంతలేకాక మనము కూడా నిరుద్యోగులకు మూసివేయబడిన ఫ్యాక్టరీలలో పని యిప్పించగలమనియు, ఆ విధంగా చేయునపుడు నాగరికత హద్దులలోనే ఉండుననికూడ రుజువుచేయాలి."

జర్మనీ పత్రికలు, ఇటలీ పత్రికలు, ఈ ఉపన్యాసాన్ని ఖండించి వ్రాస్తున్నాయి. ఛాంబర్లేను మాత్రము ఈ ఉపన్యాసము ఫాసిస్టు నాజీనియంతలకు హెచ్చరికగా ఉండబట్టి బలపర్చాడు. ఈ ఉపన్యాసముతో అమెరికాకూడ బ్రిటనుతోకలిసి అవసరమైతే జర్మనీని ఎదుర్కొంటుంది. జాగ్రత్తసుమా అని ముస్సోలినీ, హిట్లరులను బెదరించడానికి ఛాంబర్లేను ఉపయోగించుకుంటాడు.

అమెరికా తన ఆయుధ కార్యక్రమాన్ని కూడ ప్రకటించింది. (1) సైనిక, నౌకాదళాలకు కావలసిన విమానాలు ఇప్పటికన్న నాల్గురెట్లు వచ్చే సంవత్సరములోపల హెచ్చించడము. (2) 20,000 వైమానికులను. అంతకన్న ఎక్కువమంది మెకానిక్కులను ప్రతి సంవత్సరము తరిఫీదు చేయుట. (3) వైమానిక దళాన్ని 20 వేలనుండి 60 వేల వరకు వచ్చే సంవత్సరము లోపల పెంచుట. (4) కాల్బలము, మరఫిరంగి దళాన్ని వృద్ధిపొందించుట. (5) వెంటనే తాత్కాలిక రక్షణ సైన్య నిర్మాణానికి 2 కోట్ల పౌనులను ఖర్చు పెట్టుట. (6) సైన్యానికి, నౌకాదళానికి మరి ఎనిమిది విమానాశ్రయాలను క్రొత్తవి ఏర్పాటు చేయడము. (7) వచ్చే సంవత్సరము 500 విమానాలను నిర్మించడము.

నౌకాదళానికి 72 కోట్ల డాలర్లు, పెనమా కాలువ రక్షణకు 52 కోట్ల డాలర్లు. జాతీయ సంరక్షణ కోసము 132 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టడానికి రూజ్‌వెల్టు కోరాడు. నిరుద్యోగులకు పని కల్పించడానికి, రైతులకు, యువకులకు సౌకర్యాలు కలిగించడానికి 227 కోట్ల డాలర్లు వ్యవసాయానికి 70 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాలన్నాడు. అంతేగాక ప్రస్తుతము పోషింపబడుతున్న 27 లక్షల మంది నిరుద్యోగుల ఖర్చుల కోసం మరి 88 కోట్ల డాలర్లు ఇమ్మన్నాడు. మొత్తము లోటు 400 కోట్ల డాలర్లు మొత్తము అమెరికా ప్రభుత్వపు రాబడి 567 కోట్ల డాలర్లు ఖర్చు 976 కోట్ల డాలర్లు.

పిసఫ్రింటు : శాంతి శక్తులు

స్పెయిను యుద్ధ రంగము.

తిరుగుబాటుదారుల సైన్యము ముందుకు సాగుతోనే ఉంది. బారాన్ బ్లాంకాస్ నగరాన్ని వశపర్చుకొని మరియొక $12\frac{1}{2}$ మైళ్లు తూర్పుకు మధ్య ధరాసముద్రముపైపు నడిచాయి. ఉత్తర కాటలోనియాలోని ఆర్టిసా అను మరియొక నగరాన్నికూడ తిరుగుబాటుదారులు ఆక్రమించుకున్నారు. 3 లక్షలమంది తిరుగుబాటుదారుల సైన్యము సీగ్రినదిని, ఈబ్రోనదిని దాటి బార్సిలోనా మీదికి వస్తున్నారు. అయినా ఇంకా 68 మైళ్ళ దూరములో ఉన్నారు. బార్సిలోనాపై బాంబులవర్షము కురుసిస్తూనే ఉన్నారు కూడ బ్రిటిషు నేనలపై తిరిగి బాంబులు పడ్డాయి. 15 దినాలుగ యుద్ధము సాగుతూ ఉన్ననూ, ప్రభుత్వసేనలు మెల్లమెల్లగా తమ ముఖ్య రక్షణ స్థానాలను వదలి వెనక్కి తరలిపోవాలసి వచ్చినను, కొన్ని స్థలాలో తిరుగుబాటుదారుల సైన్యము మధ్య ధరాసముద్రానికి 20 మైళ్ళ దూరములో ఉన్ననూ, ప్రభుత్వ సేనలు తమ ధైర్యాన్ని వదలలేదు. తీవ్రంగా యుద్ధం చేస్తూనే ఉన్నాయి. 300 మంది ఇటలీ సైనికులు గాయపడినవారు రోమునగరము చేరారు. తిరుగుబాటుదారులు టరోగానాకు రక్షణగా ఉండే కొండలను చుట్టు ముట్టివేసి యున్నారు.

ఈ దాడి తీవ్రత కొంతవరకైనా తగ్గించడానికి ప్రభుత్వసేనలు స్పెయిను పడమటభాగాన ఈస్టిమాడ్రి రంగాన దాడి ఆరంభించాయి. పోర్చుగల్ సరిహద్దుకు 90 మైళ్ళ దూరము వరకు జొచ్చుకపోయారు. తిరుగుబాటుదారుల రాకపోకలకు అడ్డుకొట్టారుకూడ. ఈ దాడిని ఎదుర్కోడానికి కాటలోనియా రంగాననుండి అనేక విమానాలను ఫ్రాంకో అచ్చటికి పంపవలసివచ్చినది. అంతేగాక కాటలోనియా రంగములో కూడ జనరలు ఫ్రాంకో దాడితీవ్రత తగ్గినదనికూడ వార్తలు వస్తున్నాయి. యుద్ధము తిరిగి అరంభమయినప్పటినుండి తిరుగుబాటుదారులలో 25000గురు చనిపోయినవారు, గాయపడ్డవారు, ఖైదీలుగ పట్టుబడ్డవారు అని ప్రభుత్వము ప్రకటించింది. ఫ్రాంకో సేనాని, ప్రభుత్వసేనలనుండి 30000 మందిని కేవలము ఖైదీలుగానే పట్టెకున్నామని ప్రకటించాడు.

చైనా : జపాను యుద్ధరంగము

జపానుతో సంధిచేసుకొమ్మని కోరిన వాంగ్ చంగ్ వైను కుమింగ్‌టాంగ్‌పార్టీనుండి వెడలగొట్టడమేగాక, జపాను కీలుబొమ్మప్రభుత్వాలలో పాల్గొన్నవారిని అరెస్టు చెయ్యమనికూడ చైనా ప్రభుత్వము ప్రకటించింది. చౌ. ఎన్. లీ. అను కమ్యూనిస్టుపార్టి నాయకుడు "వాంగ్‌యొక్క ద్రోహము చైనాయుక్క ఐక్యతనుగాని యుద్ధ శక్తినిగాని తగ్గించదు" కమ్యూనిస్టులను మరింతదగ్గరికి వచ్చేటట్లు చేయుడానికి వాంగ్ చంగ్ స్థానాన ఒక అతివాదినిగాని లేక కమ్యూనిస్టునుగాని ఏర్పరచడానికి ఆలోచిస్తున్నారు. చైనాలో జాతీయ స్వాతంత్ర్య పోరాటాన్ని బలపర్చడానికి కుమింగ్‌టాంగ్ కమ్యూనిస్టులు కలసిమెలసి పనిచేస్తున్నారు. కాని మనదేశములోమాత్రము కమ్యూనిస్టులని సాకుచెప్పి అతివాదుల నందరిని కాంగ్రెసునుండి తరిమివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చైనా అనుభవమునుండి అయిన మన నాయకులు నేర్చుకొనేటట్లులేదు.

చైనాలో సంధిప్రయత్నాలు భగ్నమయ్యాయి జపాను దేశీయమంత్రి సుఎట్సెకూ, జపానులోని పార్టీల నన్నింటిని ఒకే పార్టీగామార్చి, దేశమందంతటా ఫాసిస్టుపరిపాలనలోవలె యుద్ధానికి తయారు గావించాలని పట్టు పట్టాడు, దీనితో కోనోయి ప్రధాని రాజీనామా ఇచ్చాడు. బారన్ హిరోను మాను తన మంత్రివర్గాన్నిఏర్పరచాడు. కోనోయికి ఏడిపార్లమెంటుపై అధికారములేకపోయినా, ఒక మంత్రిగా తీసుకోబడ్డాడు. క్రొత్తగా మంత్రివర్గములోకి తీసుకోబడ్డవారు ప్రాతవాడుగాక 4 మాత్రమే.

ఈ మంత్రివర్గమురాగానే, శాంతి ప్రయత్నాలను భగ్నపరిచింది చంగుకేషేకు అని కరపత్రాలను విమానాలనుండి షాంఘై పట్టణమంతా వెదజల్లారు. చంగుకేషేకును, వాంగ్ చంగ్‌వై చేసిన సంధి సూచనలను అంగీకరించమని ముగ్గురు చైనా రాయబారులు కోరినట్లుకూడ అందులో వ్రాశారు. కాని ఆ ముగ్గురూ తామలా టెలిగ్రాములు ఇవ్వలేదని ప్రకటించారు, అంతేగాక 25 మంది చైనా సేనా నాయకులు చంగ్ కేషేకును బలపరుస్తూ వాంగ్‌ను నిరసిస్తూ ఒక ప్రకటన గావించారు.

జపాను వచ్చే సంవత్సరము చైనాయుద్ధము కొనసాగించడానికి 35 కోట్ల పౌనులను ఖర్చు పెట్టుతుంది. గత సంవత్సరము 29 కోట్లపౌనులను ఖర్చుపెట్టింది. జపాను యుద్ధమంత్రి ఇటగాకి, చైనాలో తమ ఉద్దేశాన్ని ఏపద్ధతుల ననుసరించియైనా నొందుతామని ఒకప్రకటన చేశాడు తూర్పు ఆసియాలోని పద్ధతులనుబట్టి ఆయుధాలను మరింత ఎక్కువగా తయారుచేస్తారట. దేశాన్నంత యుద్ధానికి సంసిద్ధముగా ఉండేటట్లు చేస్తారట! పారిశ్రామికోత్పత్తి శక్తిని ఎక్కువ చేస్తారట! ఆర్థికమంత్రి, ఇషిఖటా, ఎక్కువ చేస్తానన్నాడు. ముఖ్యముగా ఆదాయపుపన్ను; వస్తువులపైపన్ను ఎక్కువచేస్తాడట! జపాను వర్తకాన్ని పెంపొందించడానికి, ఇతరదేశాలలోని 26 వర్తక ఏజెన్సీలను మరింత ఎక్కువ చేస్తాడట! జపాను సేనానాయకుడు టట్సుహికోట కషిమా, నూతన ప్రపంచాన్ని నిర్మించడానికి, ఇండియాను, ఆసియాఖండాన్ని పునిర్నిర్మించడానికి 100 ఏండ్లఅయినా యుద్ధాన్ని జపాను సాగిస్తుందని ప్రకటించాడు.

జపాను : రష్యా

జపాను రష్యామీదకూడ త్వరలో యుద్ధము సాగించేటట్లు ఉంది. షఖిలిన్ దీవిలో గత నవంబరు 2వ తారీఖున యిరువురు జపానీయులు రష్యాకు చెందిన స్థలములోకి తుపాకులతోవెళ్లారట! రష్యా సైనికులు వారిని కాల్చి చంపారని జపాను సంజాయిషీ కోరుతూఉంది. మరియొక జపాను దేశస్థుని పట్టుకొని పోయారట. జపానుకు చెందిన షఖిలిన్ దీవిపై రష్యావిమానాలు ఎగిరాయట. జపానుకు చేపలు పట్టుకొనే హక్కులు ఇవ్వడములేదట. వెంటనే ఇవ్వనిచో యుద్ధము తప్పదని జపాను దేశమునుండి ప్రకటనలు వెలువడుతున్నాయి. ముఖ్యముగా రష్యా చైనాకు సాయము చేస్తూ ఉందట! అందుచే జపానును ఇంత కాలము చైనా ఎదుర్కొనడము సాధ్యమయింది. అందువల్ల యుద్ధము తప్పదంటూ ఉంది జపాను. రష్యా కూడ జపాను పైబడితే ఎదుర్కొనడానికి కావలసిన సన్నాహాలు చేస్తూ ఉంది. చంకూ పెంగు ప్రాంతాన కోటలు నిర్మిస్తున్నదట! యుద్ధ పరికరాలు పంపబడుతున్నాయట. ఔటరు మంగోలియాలోకూడ రష్యా సైనికులను పంపించి జాగ్రత్త పడుతూ ఉందట!

50,000......................

దొంగలున్నారు జాగ్రత!!

ఆంధ్రులలో 'నవశక్తి' కూడాలి—దీనికి సాధనం ఏమిటి? —
ఆంధ్రుల రక్తాన్ని ఘోరతర చర్మవ్యాధులు పీల్చివేస్తున్నవి !! శక్తిహీనులైన ఆంధ్రులకు స్వాతంత్ర్యం ఏలాగు లభిస్తుంది?
ఇవిగో! — మీ పరిశ్రమలు — వీటిని ఉద్ధరించుకోండి !!

"లెప్పర్ క్యూర్" సకల మేహ, కుష్ఠు, సుఖ రోగాలను పారద్రోలి మీలో "నవశక్తి" నిచ్చేది ఈ ఔషదమే!
25 సం॥ అనుభవంగల మూలసంస్థ—

బ్రాంచీలు
గాంధీనగర్, బెజవాడ.
బ్రాడ్వే. P. B. 137 మద్రాసు.

★

లక్ష్మీ అండు కో (రిజిస్టర్డు)
H. O. వాల్తేరు, ఆర్. యస్. పోస్టు.

ది బలరామా ఆయుర్వేదిక్ ఫార్మశీ వారి

స్త్రీ జనామృతమ్

స్త్రీలకుగల తెలుపు, ఎరుపు, వ్యాధులు నివారింపజేయుటకు అమూల్యమైనది. నీరసము, గుండెదడ, సంతాన నష్టము పోగొట్టి మంచి వుత్సాహము, సత్సంతానము గలిగింపగలది. గుణమును రొక్కి సీసాలను, సీసా రు 2—0—0 లు. కేటలాగు, కేలండరు వుచితము.

వలయువారు:— ఉరిటి బ్రదర్సు
వైద్యశాఖ, ఏలూరు, (ఆంధ్రా)

శిశువైద్య

డా॥ జమ్మి వ్యాసారావు

లీవర్ అండు స్ప్లీన్ యెన్లార్జిమెంటు స్పెషలిస్టు అండ్ మెడలిస్టు.

వ్యాసకుటీరము, విజయనగరం.

వీరి ఔషధములు త్వరలో గ్యారంటీగా గుణము నిచ్చును.



మీ వార్తాపత్రికలు కేటలాగులు, పుస్తకములు మొదలగునవి చిత్రించుటకు కావలసిన లైనుబ్లాకులు హాఫ్టోను బ్లాకులు, త్రై కలర్ బ్లాకులు మేము ఆధునిక ఎలెక్ట్రిక్ యంత్రముల సహాయముతోచేసి యిచ్చెదము. ఆంధ్ర దేశములో ఆంధ్రులచే బ్లాకుల చేయు పరిశ్రమాలయ మిది యొక్కటి మాత్రమే. ఆంధ్రులందరు ఆదరించ ప్రార్థితులు.

వివరములకు ధరలకు నేడే వ్రాయండి.

కుమార్ అండ్ కంపెనీ,

ఫొటో ఆర్టిస్టుసు లైన్ అండ్ హాఫ్టోన్ బ్లాక్మేకర్స్, తెనాలి.

అడ్వర్టైజరు

(ఆంధ్రాంగ్ల మాస పత్రిక)
విజయనగరము

చక్కని కథలు, వ్యాసాలు ఉంటాయి.
తక్కువ వ్యయ ప్రయాసాలతో వర్తక, పారిశ్రామికాభివృద్ధి చేయు పత్రిక యిదియే.
సాలు చందా 8 అణాలు మాత్రం.
విడి పత్రిక 1 అణా.

ఆరోగ్యసుధ

సమస్త సెగ సవాయి వ్యాధులకు

సెగవ్యాధులు జీర్ణించుట, సవాయి వ్యాధులు జీర్ణించుట, చర్మదోషములు, మూత్రనాళము నందలిమంట, మూత్రము సన్నముగ వచ్చుట, కీళ్ళ నొప్పులు, ఉదుకువ్యాధులు, శుక్లనష్టము మొదలగు వానికి దివ్యామృతము.
సుమారు 1 నెలకు 1 తు॥ రు 4-0-0 లు

సర్వసుధ

ముష్టి మైధునము, అధిక స్త్రీ సంభోగము మొదలగు వానిచే కలిగిన నపుంసకత్వమును పోగొట్టి, కండ పుష్టిని, వీర్యవృద్ధిని జవసత్త్వములను కలిగించును.

1 నెలకు 60 మాత్రలు రు 10-0-0 లు

N B:- ఇంకను 250 రకముల ఔషధములును, మరికొన్ని అనుభూత మందులును, మాచే రచింపబడిన ప్రసిద్ధములగు ఆయుర్వేద గ్రంధములును మావద్ద దొరకును.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
బెజవాడ.

నిక్కాక ! నిక్కాక !
నరముల పటుత్వము పోతోంది
జీర్ణశక్తి నశిస్తోంది
మేధాశక్తి మాయమౌతోంది
కాపాడుకోండి! త్వరపడండి!

మా హీట్ కిలర్

వాడండి

ధరస్వల్పం ! పని అమోఘం !!
శ్రీ రామకృష్ణా ఆయుర్వేద ఫార్మశీ,
విజయనగరము.

రత్నపురుష లేహ్యాం

బలము రక్తము, వీర్యవృద్ధికి
20 తు॥ కి 1—0—0

ఈశ్వరఫార్మసీ, పాలకొల్లు.

సి. రథంగపాణి

ఫొటోగ్రాఫర్
బసవరాజు సన్స్, విజయనగరం.
మెయిన్రోడ్డు,
అందముగా ఫొటోలు తీయబడును.
ఒక పర్యాయము చూచిన మీకే తెలియును.

చదువ వలసిన హిందీ వార పత్రికలు

నయా హిందూస్థాన్ బెయిర్హనా, అల్లాబాద్, సం॥ చందా 2—0—0.
జనతా బంకీపూరు, పాట్నా. సం॥ చందా రు 3—0—0.

ఆంధ్ర రాడికల్ లిటరేచర్ సెల్లింగు డిపో, గుంటూరు

1 రు. రుసుము— డిస్కౌంటు 25%

రాజకీయ గ్రంధాలన్నీ కావాలంటే

ఏజంట్లు:—

1 సిటీ స్టూడెంట్సు ఎంపోరియం, గుంటూరు
2 సి, హెచ్. రాధాకృష్ణమూర్తి, తెనాలి
3 ఆర్. మహాదేవ్, హైదరాబాద్
4 ఎం. బి. సుబ్రహ్మణ్యం, నెల్లూరు
5 వెంకట రంగా & కో, బందరు
6 శ్రీ జయలక్ష్మీ ఫ్యాన్సీమార్టు, బెజవాడ
7 సి. సి సుబ్బయ్య, గూడూరు
8 ఎం. ఆర్. మూర్తి, రంగూన్
9 పి. లోకనాథం, బాపట్ల
10 ఎం. వీరభద్రరావు, సత్తెనపల్లి
11 బి. వి అప్పలరాజు, నందివాడు
12 కె. సుబ్బరాజు, పాలకొల్లు
13 యల్. వి. రావు, విజయనగరం
14 డి. శ్రీరామమూర్తి, భీమవరం

సి. పి. సారధి,
మేనేజరు,

ప్రొఫెసర్సు అశోక అండ్ పైలీజు

అశోక:—ప్రాచ్యపాశ్చాత్య మతాను గుణ్యముగ సిద్ధము చేయబడిన ఈ యౌషధము స్త్రీలకు గలుగు సర్వవ్యాధులను నిర్మూలింప జేయుటయేగాక వంధ్యలను సంతాన వతులుగ జేయుటలో ప్రసిద్ధి చెందినది. సీసా రు 2—4—0.

పైలీజు:—శస్త్ర చికిత్సకు లొంగని మూల వ్యాధులు సైతము మా పైలీజు వలన కుదురగలవు 20 రోజులకు సరిపోవు మందు పైపూతకు కూడా కలసి రు 2—8—0.

ఆయుర్వేద కుటీరము, గుంటూరు.

జమీందారీ
రైతుల హక్కులకై
పోరాడేది
నవశక్తి

నవశక్తి

కార్మిక, కర్షక
రాజ్యం
కావాలంటుంది
నవశక్తి

Published by M. Chandrasekhara Rao }
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE